మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

హైదరాబాద్ | సంపుటి: 2 • సంచిక: 84 • పేజీలు:12+16 • వెల: రూ.5 | గురువారం • 22-2-2018 | www.manamnews.com | /manamnews

కస్టడీకి మరో ముగ్గురు

- పీఎన్‌బీ కేసులో సీబీఐకి కోర్టు అనుమతి
- ఇప్పటికే ఇద్దరు ఉద్యోగుల ఇంటరాగేషన్
- తాజాగా బ్యాంకు జీఎం జిందాల్ అరెస్ట్
- నిరుడు ఫిబ్రవరిలో 280కోట్లకు ఎల్‌వోయూ
- నా క్లయింట్ పారిపోలేదు: నీరవ్ లాయర్
- సిట్ ఏర్పాటుకు 'పిల్'పై కేంద్రం వ్యతిరేకత

7 లో..



మీలో ఒకణ్ని!

కమల్ హాసన్ రాజకీయ అరంగేట్రం

- నా పార్టీ... 'మక్కళ్ నీది మయ్యమ్'
- మీ మాటే వింటా.. మీ వెనుకే నడుస్తా
- తమిళ ప్రజలకు విశ్వనాయకుడి హామీ
- రామేశ్వరం-మదురై రోడ్‌షో

9 లో..

సాంకేతికతతో మార్పు

పేదలకు ఉపయోగపడాలి

నాణ్యమైన వైద్యం.. వ్యవ'సాయం'.. సైనికులకూ దోహదం

ఆ మేరకు టెక్నాలజీని రూపొందించాలి



- టెకీలకు మంత్రి కేటీఆర్ పిలుపు
- ముగిసిన 'వరల్డ్ ఐటీ కాంగ్రెస్'
- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై నాస్కామ్‌తో 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' ఏర్పాటు చేస్తామని ప్రకటన
- చివరిరోజు ముఖ్య అతిథిగా బాలీవుడ్ నటి దీపికా పదుకొనే



వరల్డ్ ఐటీ కాంగ్రెస్ ముగింపుసభలో కేటీఆర్‌తో దీపిక కరచాలనం

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (మనం ప్రతినిధి):

నూతన సాంకేతిక పరిజ్ఞానం సమాజానికి, ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉండాలని మంత్రి కేటీఆర్ అభిప్రాయపడ్డారు. పేదలకు సాంకేతికత ఉపయోగపడాలని కోరారు. విద్య, వైద్య, వ్యవసాయ రంగాలు అత్యంత ప్రధానమైనవని, ఆయా రంగాల్లో సవాళ్లను ఎదుర్కొనేందుకు టెక్నాలజీని ఉపయోగించుకోవాలని అన్నారు. పేదలకు సాంకేతికత ఉపయోగపడితే ఎన్నో మార్పులు వస్తాయని, సరిహద్దులో కాపలా కాస్తున్న సైనికులకు సాంకేతికత **మిగతా 6లో..**

డిప్రెషన్.. పెద్ద సమస్య

- అంటువ్యాధిలా విస్తరిస్తోంది
- బాధితులకు అండగా నిలవాలి
- నేనూ డిప్రెషన్ బాధితురాలినే
- అప్పుడు అమ్మ అండగా ఉంది
- దీపికా పదుకొనే

6 లో..



ప్రియా వారియర్‌కు సుప్రీం ఊరట

- 'పాట' వివాదంలో క్రిమినల్ చర్యలపై స్టే
- ఎక్కడా కేసులు నమోదు చేయొద్దని ఆదేశం

7 లో..

కాంగ్రెస్‌లోకి నాగం!

ఉత్తమ్ బస్సుయాత్రకు ముందే చేరిక

- కొత్తకోట దంపతులు కూడా జంప్
- రాహుల్‌తో భేటీ.. చేరికకు ఓకే



3 లో..

ఇదీలోకం!



దశావతారం చిత్రంలో విభిన్న పాత్రలు పోషించినట్టుగా రాజకీయాల్లో కూడా అదే తీరు కొనసాగిస్తారా సార్..!

ఏమైతదో బొగ్గుబాయి!

శరాఘాతం కానున్న ప్రైవేటీకరణ

సింగరేణి భవిష్యత్తుపై నీలినీడలు

సర్కారు నిర్ణయంపై ఆగ్రహావేశాలు

- బ్రిటిష్ కాలం నాటి పరిస్థితులలోస్తాయా
- 1889 నుంచి బొగ్గు తవ్వకాలు షురూ
- ఒకనాడు 1.16 లక్షల మందితో కళ
- ప్రస్తుత కార్మికులు కేవలం 54 వేలు
- ప్రైవేటులో సంక్షేమం ఎండమావే



హైదరాబాద్, ఫిబ్రవరి 21 (మనం ప్రతినిధి):

బొగ్గు గనులను ప్రైవేటీకరించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయం.. సింగరేణి పాలిట శరాఘాతంగా మారనుంది. ఈ నిర్ణయంతో తెలంగాణ రాష్ట్రానికే తల మానికమైన సింగరేణి కాలరీస్ భవిష్యత్తు ఆగమ్య గోచరంగా మరే పరిస్థితి నెలకొంది. బొగ్గు గనుల తవ్వకాల్లో ప్రైవేటు కంపె నీలతో పాటు విదేశీ సంస్థలనూ అనుమతించేందుకు కేంద్రం **మిగతా 2లో..**



మృత్యు శకటం

రెండు కార్లు ఢీ.. 9 మంది దుర్మరణం

అక్కడికక్కడే ఏడుగురు.. ఆస్పత్రిలో మరో ఇద్దరు

- అదుపు తప్పి డివైడర్‌ను తాకి.. ఆపై మరో కారును ఢీకొన్న ఓ కారు
- మితిమీరిన వేగం వల్లే ప్రమాదం
- రోడ్డుపై చెల్లాచెదరుగా మృతదేహాలు
- వనపర్తి జిల్లాలో ఘోర దుర్ఘటన

కొత్తకోట, ఫిబ్రవరి 21(మనం న్యూస్):

రహదారి నెత్తురోడింది.. తుక్కుతుక్కుగా మారిన వాహనాల మధ్యలో ఇరుక్కున్న, చెల్లాచెదరైన మృతదేహాలు.. విరిగిన ఎముకలు, రక్తం కారుతున్న ముఖాలతో మృతదేహాలు **మిగతా 6లో..**



వాతావరణం



తెలుగు రాష్ట్రాల్లో గురువారం పొడి వాతావరణం నెలకొంటుంది. పగటి ఉష్ణోగ్రతలో మార్పులేదు. రాత్రి ఉష్ణోగ్రత స్వల్పంగా తగ్గుతుంది. చలిగాలుల తీవ్రత పెరుగుతుంది. గంటకు 10 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉంది.

గరిష్ఠ ఉష్ణోగ్రత: 33 డిగ్రీలు

కనిష్ఠ ఉష్ణోగ్రత: 18 డిగ్రీలు

గాలిలో తేమ: 48 శాతం

ముహూర్తం

శ్రీహేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం, తిథి: సప్తమి తె.2.291 తదుపరి షష్ఠి; నక్షత్రం: భరణి మ.1.32 తదుపరి కృత్తిక; వర్జ్యం: తె.1.07-2.39; దుర్ముహూర్తం: మ.3.12-4.44; రాహుకాలం: మ.1.57-3.23; అమృతఘడియలు: ఉ.8.52-10.26; శుభసమయం: మ.1.00-1.30.

సూర్యోదయం: 6.43

సూర్యాస్తమయం: 6.17



కేసీఆర్ అక్క విమలాబాయి కన్నుమూత

కొన్నాళ్లుగా అస్వస్థత.. ఆస్పత్రిలో తుదిశ్వాస


హైదరాబాద్, ఫిబ్రవరి 21 (మనం ప్రతినిధి):




కొద్దికాలంగా అస్వస్థతతో బాధపడుతున్న సీఎం కేసీఆర్ రెండో అక్క పి.విమలాబాయి(82) బుధవారం కన్నుమూశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆమె తెల్లవారుజామున కన్నుమూశారని కుటుంబసభ్యులు తెలి పారు. సోదరి విమలాబాయి పార్థివదేహానికి సీఎం కేసీఆర్, మంత్రులు హరీశ్‌రావు, **మిగతా 6లో..**

ఇక సిమ్ నంబర్‌లో 13 అంకెలు

ఫోన్లకు కాదు.. మెషీన్లకు మాత్రమే



- సెల్‌ఫోన్ నంబర్లకు 10 అంకెలే
- ఎం2ఎం సర్వీసులకే మార్పులు
- పీవోఎస్ మెషీన్లలో వాడే సిమ్‌లకే
- జూలై 1 నుంచి అమలులోకి
- పాత సిమ్‌లూ మార్చుకోవాల్సిందే
- అక్టోబరు 1 నుంచి ఏడాది చివరిలోపు
- టెలికాం శాఖ ఉత్తర్వులు జారీ



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21:

ఇకపై మొబైల్ నంబర్లు 13 అంకెలతో రాబోతున్నాయి. ఇప్పటి వరకు ఉన్న 10 అంకెల విధానానికి టెలికాం శాఖ స్వస్తి పలకబోతోంది. ఈ ఏడాది జూలై 1 నుంచి ఈ కొత్త విధానం అమలులోకి వస్తుంది. ఈ మేరకు అన్ని టెలికాం కంపెనీలకు ఆదేశాలు అందాయి. అయితే సాధారణ మొబైల్ ఫోన్ వినియోగదారులకు ఈ విధానం వర్తించదు. వీరికి యథావిధిగా పాత విధానంలోనే 10 **మిగతా 6లో..**

మైనారిటీ బీఈడీ విద్యార్థులకు నో హాల్‌టికెట్స్

- కోర్టు చెప్పినా పట్టించుకోని వర్సిటీ అధికారులు


(ఫైల్ ఫొటో)

హైదరాబాద్, ఫిబ్రవరి 21(మనం ప్రతినిధి): రాష్ట్రవ్యాప్తంగా మైనార్టీ బీఈడీ కళాశాలల విద్యార్థులకు మొదటి సెమిస్టర్ హాల్ టికెట్స్ అందక.. తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మైనారిటీ బీఈడీ కళాశాలల యాజమాన్యాలు నిబంధనలకు విరుద్ధంగా కోటాకు మించి సీట్లను భర్తీ చేశారనే కారణంతో ఉస్మానియా యూనివర్సిటీ అధికారులు సదరు కాలేజీల్లోని ప్రవేశాలను అంగీకరించేది లేదని తెలిపింది. దీంతో మైనారిటీ కాలేజీ యాజమాన్యాలు కోర్టును ఆశ్రయించాయి. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రస్తుతానికి అనుమతించాలని వర్సిటీ అధికారులకు సూచించింది. కానీ వర్సిటీ అధికారులు మైనార్టీ కాలేజీల్లోని విద్యార్థులకు హాల్‌టికెట్స్‌ను జారీ చేయలేదు. బుధవారం మొదటి సెమిస్టర్ ఫిలాసఫీ పరీక్ష ముగిసింది. ఈ పరీక్షకు మైనార్టీ కాలేజీ విద్యార్థులు హాజరుకాలేకపోయారు. దీంతో విద్యా సంవత్సరం నష్టపోయే ప్రమాదం ఉందని రాష్ట్రవ్యాప్తంగా మైనార్టీ బీఈడీ కాలేజీలకు చెందిన విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. దీనిపై వర్సిటీ అధికారులు పునరాలోచించి.. హాల్‌టికెట్స్ జారీ చేయాలని కోరుతున్నారు.

వెబ్‌సైట్‌లో టీఆర్టీ హాల్‌టికెట్లు



హైదరాబాద్, ఫిబ్రవరి 21(మనం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్సీ) వెబ్‌సైట్‌లో టీఆర్టీ హాల్ టికెట్లను పొందుపరిచినట్లు అధికారులు వెల్లడించారు. పరీక్ష కేంద్రాల కేటాయింపులో లోపాల కారణంగా హాల్‌టికెట్ల డౌన్‌లౌడ్‌ను నిలిపేసిన సంగతి తెలిసిందే! టీఆర్టీ హాల్‌టికెట్ల గందరగోళంపై సీజీజీ అధికారులతో సమీక్షించిన టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి వాణీప్రసాద్.. బుధవారం మధ్యాహ్నం నుంచి హాల్‌టికెట్లను వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్టు తెలిపారు. ఈ నెల 24నుంచి పరీక్షలు యథాతథంగా జరుగుతాయని ఆమె వెల్లడించారు. టీఆర్టీ తెలుగు పండిట్, స్కూల్ అసిస్టెంట్ తెలుగు పరీక్షలకు సంబంధించిన హాల్‌టికెట్లను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. ఈ నెల 24న తెలుగు పండిట్, స్కూల్ అసిస్టెంట్ తెలుగు పరీక్ష జరగనుంది.

తెలుగు మీడియం అభ్యర్థులకూ ఇంగ్లీష్ పేపర్

ఉపాధ్యాయ నియామక పరీక్షల్లో పీఈటీ (ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్) పోస్టుల పరీక్షకు హాజరయ్యే తెలుగు మాధ్యమాన్ని ఎంచుకున్న అభ్యర్థులకు ఇంగ్లిషులో కూడా ప్రశ్నాపత్రం ఉండేలా చేయాలని టీఎస్‌పీఎస్సీని హైకోర్టు ఆదేశించింది. పీఈటీ సిలబస్ ఇంగ్లిషులో ఉందని, తెలుగులో పశ్నాపత్రం ఉంటే అభ్యర్థులు నష్టపోతారని పేర్కొంటూ నల్లగొండకు చెందిన వెంకటరమణ దాఖలు చేసిన రిట్‌ను బుధవారం హైకోర్టు విచారించింది. పశ్నాపత్రం తెలుగుతోపాటు ఇంగ్లిషు కూడా ఉండేలా చేయాలని టీఎస్‌పీఎస్సీని న్యాయమూర్తి జస్టిస్ రామచంద్రరావు ఆదేశించారు.


ఆందోళనలో భాగంగా మాట్లాడుతున్న ఏబీవీపీ నాయకులు

ఓయూలో బయట వాహనాలను అనుమతించొద్దు

- ఏబీవీపీ డిమాండ్, ఆర్ట్స్ కళాశాల వద్ద రాస్తారోకో

హైదరాబాద్, ఫిబ్రవరి 21(మనం ప్రతినిధి): ఉస్మానియా విశ్వవిద్యాలయంలోకి బయటి వాహనాలను అనుమతించ వద్దని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్ట్స్ కళాశాల వద్ద ప్రధాన రహదారిపై బుధవారం రాస్తారోకో చేశారు. ఇందులో భాగంగా వర్సిటీ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం పలువురు ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ ఇతర వాహనాల కారణంగా వర్సిటీలో ట్రాఫిక్ అధికమయ్యి ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఇతర వాహనాల రాకపోకల వల్ల వర్సిటీలో అకడమిక వాతావారణం దెబ్బతింటుందన్నారు. సమస్య పరిష్కారానికి దశలవారీగా చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ కేంద్ర కమిటీ వర్కింగ్ సభ్యుడు మట్ట రాఘవేందర్, ఓయూ ఇన్‌చార్జి శ్రీహరి, అధ్యక్షుడు సుమన్, ఎన్ఈసీ మెంటర్ ప్రవీణ్, కార్యదర్శి నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఏమైతదో బొగ్గుబాయి!

(మొదటి పేజీ తరువాయి)

అనుమతి ఇవ్వడంపై కార్మిక సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. కేంద్రం నిర్ణయంతో ఇప్పటికిప్పుడు సింగరేణికి నష్టం లేకున్నా భవిష్యత్తులో సింగరేణి అసలు ఉంటుందా అనే మీమాంస కార్మికుల్లో నెలకొంది. తెలంగాణలోని బొగ్గుగనుల్లో బ్రిటిష్ కాలం నాటి పరిస్థితులు పునరావృతం కానున్నాయా అని కార్మికులు ఆందోళన చెందుతున్నారు.

ఉద్యోగ భద్రతకు భరోసా లేదు

బొగ్గు గనులను ప్రైవేటీకరిస్తే కార్మికులకు ఉద్యోగ భద్రత ఉండదు. తెలంగాణలో 1886లో బ్రిటిష్ హయంలో బొగ్గు నిల్వలను కనుగొన్నారు. 1889 నుంచి బొగ్గు తవ్వకాలు చేపట్టారు. నాడు కార్మికులు నిత్యం ప్రమాదాల అంచున పనిచేశారు. నాడు మహిళలు కూడా భూగర్భంలో పనిచేశారు. హక్కుల కోసం నినదించిన వారిపై చర్యలు తీసుకుంటూ బ్రిటిష్ అధికారులు నిరంకుశ పాలన సాగించారు. కార్మికులు గని ప్రమాదంలో చనిపోయినా, గాయపడినా పట్టించుకోని దుస్థితి నాటిది. అనేక పోరాటాలతో పనిగంటలతో పాటు పలు సంక్షేమ పథకాలను, హక్కులను కార్మికులు సాధించుకున్నారు. ఉద్యోగ భద్రత ఏర్పడింది. వేజ్‌బోర్డు ఏర్పాటు చేసుకున్నారు. లాభాల బోనస్ తెచ్చుకున్నారు. వారసత్వ ఉద్యోగాలు సాధించుకున్నారు. బొగ్గు గనుల ప్రైవేటీకరణతో ఇక వీటన్నింటికీ చరమగీతమేనా అని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సింగరేణిలో దశాబ్దంన్నర కాలంగా సాగుతున్న ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణతో... ఒకప్పుడు లక్షా 16వేల మంది కార్మికులతో కళకళలాడిన సింగరేణి ప్రస్తుతం 54వేల మందితో సరిపెట్టుకుంటున్నది. గనుల వేలంతో భవిష్యత్తులో కొత్తగా ఏర్పడే బొగ్గు గనులతో తెలంగాణ యువతకు ఉద్యోగ అవకాశాలు అంతంత మాత్రంగానే లభించే అవకాశాలున్నాయి. ఉద్యోగ భద్రత కూడా ఉండదని కార్మిక సంఘాల నేతలు పేర్కొంటున్నారు. పోరాడి సాధించుకున్న హక్కులైన వేజ్‌బోర్డు ప్రైవేటు సంస్థల ఆధీనంలో నడిచే బావుల్లో ఉండదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం సింగరేణిలో కార్పొరేట్ వైద్యం అందుతోంది. ప్రైవేటు బొగ్గు బావుల్లో.. కార్పొరేట్ వైద్యం అందని ద్రాక్షగానే మారే అవకాశం ఉంది.


సింగరేణి కార్మికులు(ఫైల్ ఫొటో)

భవిష్యత్తు అంధకారమేనా

సింగరేణికి ఇప్పటికిప్పుడు ఎలాంటి భయం లేదని అధికారులు పేర్కొంటున్నా.. భవిష్యత్తు అంధకారమేనని కార్మిక సంఘాల నేతలు పేర్కొంటున్నారు. బొగ్గు గనుల ప్రైవేటీకరణతో పోటీతత్వం పెరిగే అవకాశం ఉంది. ఒడిశా, మధ్యప్రదేశ్, పశ్చిమబెంగాల్, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ లాంటి రాష్ట్రాల్లో మంచి నాణ్యత కలిగిన బొగ్గు తక్కువ లోతులోనే లభిస్తుంది. సింగరేణిలో బొగ్గు సీమ్‌ల మందం పది మీటర్ల లోపే ఉంది. ఎక్కువగా మూడు నుంచి 6 మీటర్ల వరకే. ఇతర రాష్ట్రాల్లో 20 నుంచి 120 మీటర్ల మేర బొగ్గు సీమ్‌లున్నాయి. సింగరేణిలో ఓపెన్‌కాస్టులో మట్టి తీసేందుకే చాలా మొత్తాన్ని వెచ్చిస్తున్నారు. ఆయా రాష్ట్రాల్లో తక్కువ లోతులో లభించే అవకాశం ఉండటంతో ధర కూడా తక్కువగా ఉండే అవకాశం ఉంది. దీంతో మన సింగరేణి బొగ్గు పోటీ మార్కెట్లో తట్టుకునే అవకాశాలు తక్కువ. ఈ క్రమంలో నష్టాల పేరుతో సింగరేణిని ప్రైవేటువారికి అప్పగించే అవకాశాలు మెండుగా ఉండవచ్చని కార్మిక సంఘాల నాయకులు వాపోతున్నారు.

ఇప్పటికే కొంత ప్రైవేటుకు..

సింగరేణిలో ఇప్పటికే భూపాలపల్లి ఏరియాలో తాడిచర్ల ఒక బ్లాకును జెన్‌కోకు అప్పగించారు. జెన్‌కో దాన్ని ఓ ప్రైవేటు కంపెనీకి అప్పగించింది. బొగ్గు తవ్వకంలో అపారమైన అనుభవం ఉన్న సింగరేణిని కాదని ప్రభుత్వం పరోక్షంగా ఇలా అప్పగించిందనే విమర్శలున్నాయి. ఇదే విధంగా భవిష్యత్తులో కొత్త బ్లాకులను ప్రైవేటుకు అప్పగిస్తే సింగరేణి పరిస్థితి ప్రశ్నార్థకమే అని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజలే ప్రభుత్వానికి యజమానులు

- త్వరలో 14,000 పోలీసు నియామకాలు
- పోలీసులకు వారానికి ఒక రోజు సెలవు
- అభివృద్ధిని ఓర్వలేక ప్రతిపక్షాల విమర్శలు
- మరో పదేళ్ల పాటు కేసీఆరే ముఖ్యమంత్రి
- రాష్ట్ర హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి


పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న నాయిని

జహీరాబాద్, ఫిబ్రవరి 21(మనం న్యూస్): ప్రజలే ప్రభుత్వానికి యజమానులని, ప్రజాక్షేమం కోసం ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని రాష్ట్ర హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి తెలిపారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు బుధవారం జహీరాబాద్ వచ్చిన హోం మంత్రి స్థానిక అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కొత్తగా 14వేల మంది పోలీసులను నియమిస్తామని చెప్పారు. రాష్ట్రంలో పోలీసుల పనితీరు బాగుందన్నారు. పోలీసులకు వారానికి ఒక రోజు సెలవును ఇవ్వనున్నట్లు తెలిపారు. శాంతి భద్రత పరిరక్షణలో తెలంగాణ పోలీసులు దేశంలో మొదటి స్థానంలో ఉన్నారని అన్నారు. జహీరాబాద్‌లో త్వరలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. అభివృద్ధి విషయంలో దేశంలోనే తెలంగాణ మొదటి స్థానంలో ఉందని చెప్పారు. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ పథకాల ద్వారా రాష్ట్రం సస్యశ్యామలం అయ్యిందన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతి పక్షాలు విమర్శలు చేస్తున్నాయన్నారు. ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు పని చేస్తున్న కేసీఆర్ మరో పదేళ్ల పాటు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉంటారన్నారు. అంతకముందు స్థానిక పోలీసుల నుంచి హోం మంత్రి గౌరవ వందనం స్వీకరించారు.

జూలై నుంచి విద్యార్థులకు హెల్త్‌కార్డులు

రాష్ట్ర మంత్రులు శ్రీహరి, లక్ష్మారెడ్డి




హైదరాబాద్, ఫిబ్రవరి 21(మనం ప్రతినిధి): రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ విద్యాలయాల్లోని 30 లక్షల మంది విద్యార్థులకు జూలై నుంచి ఆరోగ్య పరీక్షలు చేస్తామని, ఆరు నెలల్లో హెల్త్‌కార్డులు అందజేస్తామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి, వైద్యారోగ్య శాఖ మంత్రి సీహెచ్.లక్ష్మారెడ్డి తెలిపారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి విద్య, వైద్యారోగ్య శాఖల సమన్వయంతో ఆరోగ్య పరీక్షలు, హెల్త్, హైజీన్ కిట్స్ ఇవ్వాలనే అంశంపై బుధవారం సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు కడియం శ్రీహరి, సీహెచ్.లక్ష్మారెడ్డిలు మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రభుత్వ అనుబంధ పాఠశాలలన్నింటిలో ఉన్న 8 లక్షల మంది విద్యార్థినులందరికీ హెల్త్ అండ్ హైజీన్ కిట్స్ ఇవ్వాలని నిర్ణయించామన్నారు. ఇప్పటికే మూడు లక్షల మంది విద్యార్థినులందరికీ విద్యాశాఖ తరపున ఇస్తున్నామని, వచ్చే విద్యా సంవత్సరం నుంచి మరో 5 లక్షల మంది విద్యార్థినిలకు ఇచ్చేలా ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ విద్యాలయాల్లో చదివే 7, 8, 9, 10 తరగతుల్లోని విద్యార్థినిలందరికీ యుక్తవయస్సులో వచ్చే ఆరోగ్య సమస్యలు, సంరక్షణపై అవగాహన తరగతులు నిర్వహించాలని నిర్ణయించారు. ఇందుకోసం మహిళా ఉపాధ్యాయులందరికీ శిక్షణ ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు షెడ్యూల్ ప్రకారమే ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, హెల్త్‌కార్డులు ఇస్తామని అధికారులు మంత్రులకు హామీనిచ్చారు.

'బాలశ్రీ' పోటీలకు శుభాన్విత

- తెలంగాణ నుంచి జాతీయ క్రీడలకు ఎంపిక




హైదరాబాద్, ఫిబ్రవరి 21: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇప్పటికే బాలరత్న అవార్డును అందుకున్న ఎస్. శుభాన్విత జాతీయ స్థాయిలో బాలశ్రీ అవార్డు కోసం ఏప్రిల్ 21 నుంచి 24 వరకు ఢిల్లీలో జరిగే పోటీలలో 'సృజనాత్మక నృత్య విభాగానికి' ఎంపికైంది. ఉత్తర సెంటర్ ఫర్ ఫెర్మార్మింగ్ ఆర్ట్స్ వ్యవస్థాపకురాలు, శుభాన్విత గురువు గీతా గణేశన్ మీడియాకు ఈ విషయాన్ని తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన సోమేసుల బాలసుబ్రహ్మణ్యం, సుహాసిని దంపతుల కుమార్తె శుభాన్విత ప్రస్తుతం.. శ్రీ చైతన్య కళాశాలలో ఇంటర్ చదువుతోంది. చదువులో ప్రతిభను కనబరుస్తూనే దేశ వ్యాప్తంగా 300 ప్రదర్శనలు ఇచ్చి, అనేక అవార్డులను అందుకుంది. 2014లో భారత ప్రభుత్వం సి.సి.ఆర్.టి. స్కాలర్ షిప్‌కు ఎంపికైంది. దూరదర్శన్ నిర్వహించిన 'అందెల రవళి' పోటీలో భరతనాట్యం, కూచిపూడిలో ప్రథమ బహుమతి పొందింది. 2015లో రాష్ట్రస్థాయి యువజనోత్సవాల్లో ప్రథమస్థానం పొంది, ఛత్తీస్‌గఢ్‌లో జాతీయ స్థాయిలో జరిగిన పోటీలలో తెలంగాణాకు ప్రాతినిధ్యం వహించింది. అనేక జాతీయ స్థాయి నృత్య పోటీలలో ప్రథమ బహుమతి పొంది న్యాయనిర్ణేతల ప్రశంసలు అందుకుంది.

కోర్టు ధిక్కరణ కేసులో లక్ష జరిమానా

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (మనం లీగల్ ప్రతినిధి): తమ ఆదేశాలను ఉల్లంఘించడమే కాకుండా తప్పుదోవపట్టించిన హైదరాబాద్‌లోని టోలిచౌకి ప్రాంతానికి చెందిన సయ్యద్ మోయినుద్దీన్‌కు హైకోర్టు లక్ష రూపాయల జరిమానా విధించింది. టోలిచౌకి ప్రాంతంలోని అంజయ్యనగర్‌లో అనుమతి లేకుండా ఐదు అంతస్తుల భవనాన్ని నిర్మించిన సయ్యద్‌పై జీహెచ్ఎంసీ హైకోర్టులో కోర్టు ధిక్కార రిట్‌ను దాఖలు చేసింది. దీనిని విచారించిన న్యాయమూర్తి నవీన్‌రావు.. సయ్యద్‌కు లక్ష జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. భవనాన్ని నిర్మించేసిన సయ్యద్ జీహెచ్ఎంసీకి భవన నిర్మాణ క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్నారు. దీనిని గతంలో విచారించిన న్యాయమూర్తి.. యథాతథ పరిస్థితిని కొనసాగించాలని ఆదేశించారు. ఈ ఆదేశాలు ఉండగానే అయిదు అంతస్తుల భవనాన్ని సయ్యద్ నిర్మించడంపై జీహెచ్ఎంసీ కోర్టు ధిక్కార రిట్ వేసింది. ఈ కేసులో సయ్యద్‌కు కోర్టు భారీ జరిమానా విధిస్తూ తీర్పు చెప్పింది.

స్పేస్ సూట్‌లో 'మినీ టాయిలెట్'

- వ్యోమగాములకోసం నాసా తయారీ



వాషింగ్టన్, ఫిబ్రవరి 21: అత్యవసర పరిస్థితుల్లో వ్యోమగాములు రోజుల తరబడి స్పేస్ సూట్‌లోనే ఉండేందుకు వీలు కల్పించే సరికొత్త సూట్‌ను తయారు చేస్తున్నట్లు నాసా ప్రకటించింది. ఇందులో వేస్ట్ డిస్పోజల్(మలమూత్ర శుద్ధీకరణ) కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపింది. ఈ వినూత్న సూట్‌ను ఆరు రోజుల పాటు నిర్విరామంగా ధరించవచ్చని పేర్కొంది. ప్రస్తుతం ఉన్న స్పేస్ సూట్‌లో ఈ సదుపాయం లేదని చెబుతూ.. టాయిలెట్ వెళ్లాల్సి వచ్చిన ప్రతిసారీ వ్యోమగాములకు ఇబ్బంది తప్పదన్నారు. ప్రస్తుతం ఈ సూట్ లోపల డయాపర్లను వాడుతున్నట్లు నాసా అధికారులు తెలిపారు. దీంతో పదిగంటలపాటు సౌకర్యవంతంగానే ఉన్నా.. ఆ తర్వాత వాటిని మార్చాల్సి వస్తుందని నాసా ఇంజనీర్ కిర్‌స్టిన్ జాన్సన్ తెలిపారు. ఓరియన్ క్రూ సర్వైవల్ సిస్టమ్స్ సూట్స్(ఓసీఎస్ఎస్ఎస్)గా వ్యవహరించే ఈ సూట్‌లలో వ్యర్థాల నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. భూకక్ష్యకు దూరంగా సాగే ప్రయాణాలలో వ్యోమగాములకు ఈ సూట్లు సౌకర్యవంతంగా ఉంటాయని వివరించారు.

ప్రాణం తీసిన ఈత సరదా

- పెళ్లికొచ్చి..చెరువులో దిగిన యువకులు
- నీట మునిగి ముగ్గురి మృతి


గోగుకుంట చెరువులో మునిగి మృతిచెందిన యువకులు


సంఘటన స్థలంలో విలపిస్తున్న కుటుంబసభ్యులు

శాయంపేట, ఫిబ్రవరి 21 (మనం న్యూస్): ఈత సరదా ముగ్గురు యువకుల ప్రాణం తీసింది. స్నేహితుని పెళ్లికి హాజరైన యువకులు చెరువలో ఈతకు దిగి ప్రాణాలు కోల్పోయారు. శాయంపేట మండలం మాందారిపేట గ్రామ శివారులో జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. మాందారిపేట గ్రామానికి చెందిన నిమ్మల రమేష్ కుమార్తె వివాహం కోసం బంధుమిత్రులు హాజరయ్యారు. వివాహానికి హాజరైన పెళ్లికొడుకు స్నేహితులు తొమ్మిది మంది బహిర్భూమి కోసం గ్రామ శివారులోని గోగుకుంట చెరువు వద్దకు వెళ్లారు. బహిర్భూమి అనంతరం రంగు సాయికృష్ణ (17), ఆలేటి సునీల్ (19), దేవులపల్లి వంశీ(17) చెరువులో ఈతకు సిద్ధపడ్డారు. సాయికృష్ణ, వంశీ నీటిలో మునిగిపోతుంటే ఆలేటి సునీల్ వారిని రక్షించే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో సునీల్ కూడా నీటిలో మునిగిపోయాడు. ఈ ఘటనలో వీరు ముగ్గురు మరణించారు. సాయికృష్ణ, సునీల్ నర్సంపేట బిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్నారు. వంశీ ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నట్లు బంధువులు తెలిపారు. మృతి చెందిన యువకులు వరంగల్ కొత్తవాడకు చెందిన వారు.

కబ్జాదారులకు ఊతంగా సీఎం ప్రకటన

- భూఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి డిమాండ్



హైదరాబాద్, ఫిబ్రవరి 21(మనం ప్రతినిధి): మియాపూర్ భూ కుంభకోణంలో ఒక్క గజం భూమి కూడా పోలేదని సీఎం కేసీఆర్ చేసిన ప్రకటన కబ్జాదారులకు ఊతమిచ్చే విధంగా ఉన్నదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి విమర్శించారు. కొత్వాల్‌గూడ, బాచుపల్లిలోని భూఆక్రమణలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. భూ మాఫియాపై సీనియర్ ఐఏఎస్ అధికారితో విచారణ చేయించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు.

గూడెంలో అటవీ అధికారుల దారుణం

- ఆక్రమించాడంటూ గుడిసె దహనం


గుడిసె స్థలంలో బాధితుడు

కన్నాయిగూడెం, ఫిబ్రవరి 21 (మనం న్యూస్): వరంగల్ జిల్లా కన్నాయిగూడెం మండలంలోని భూపతిపురం గ్రామ శివారులోని గొత్తికోయ గూడెం లో బాడిష మనోజ్ అనే యువకునికి చెందిన గుడిసెను అటవీశాఖ అధికారులు బుధవారం దహనం చేశారు. బాధితుడు మనోజ్ తెలిపిన వివరా లిలా ఉన్నాయి. ఛత్తీస్‌గఢ్ ప్రాంతం నుంచి దాదాపు 20 కుటుంబాలు చాలా ఏళ్ల క్రితం ఈ ప్రాంతానికి వచ్చామని తెలిపాడు. ఈ ప్రాంతంలో గుడిసె వేసుకోవడానికి అవసరమైన సామగ్రి సిద్ధం చేసుకున్నామని, అటవీ శాఖ అధికారులు బుధవారం వచ్చి నిర్మాణంలో ఉన్న గుడిసెకు నిప్పు పెట్టారన్నారు. ఈ స్థలంలో ఇళ్లు నిర్మించుకుంటే ఊరకోమని అధికారులు హెచ్చరించి వెళ్లారని చెప్పాడు.

కాంగ్రెస్‌లోకి నాగం!

ఉత్తమ్ బస్సుయాత్రకు ముందే చేరిక

కొత్తకోట దంపతులు కూడా జంప్

రాహుల్‌తో భేటీ.. చేరికకు ఓకే



హైదరాబాద్, ఫిబ్రవరి 21 (మనం ప్రతినిధి): బీజేపీ సీనియర్ నేత, మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరడం ఖాయమైంది. ఏరోజు పార్టీలో చేరనున్నారో త్వరలోనే ప్రకటించే అవకాశాలు ఉన్నాయి. కాంగ్రెస్ తలపెట్టిన బస్సుయాత్రకు ముందే ఆయన పార్టీలో చేరనున్నట్లు సమాచారం. ఇప్పటికే ఢిల్లీలో మకాం వేసిన నాగం.. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీతో సమావేశమై పార్టీలో చేరికపై చర్చించారు. ఆ సమయంలో ఆయన వెంట పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి కూడా ఉన్నారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన టీడీపీ సీనియర్ నాయకులు కొత్తకోట దయాకర్ రెడ్డి, సీతా దయాకర్‌రెడ్డి కూడా కాంగ్రెస్‌లో చేరనున్నట్లు తెలిసింది. వారిద్దరూ బుధవారం రాహుల్‌తో సమావేశమయ్యారని విశ్వసనీయంగా తెలిసింది. గతంలో వీరిద్దరూ టీడీపీ నుంచి ఎమ్మెల్యేలుగా గెలిచారు. గత ఎన్నికల్లో మాత్రం ఓటమి చవిచూశారు. నిజామాబాద్ జిల్లాలో మంచి పట్టున్న వీరిద్దరూ కాంగ్రెస్‌లో చేరితే పార్టీ మరింత బలోపేత అవుతుందని భావిస్తున్నారు. టీడీపీ జాతీయాధ్యక్షుడు చంద్రబాబుతో వారికి మంచి సంబంధాలు ఉన్నప్పటికీ.. తెలంగాణలో పార్టీ పరిస్థితి ఏమాత్రం బాగోలేకపోవడంతో వారు కాంగ్రెస్‌లో చేరేందుకు మొగ్గు చూపినట్లుగా తెలుస్తోంది. కాగా, నాగం చేరికను గద్వాల్ ఎమ్మెల్యే డీకే అరుణతోపాటు మరికొందరు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. డీకే అరుణ



అయితే ఏకంగా రాహుల్‌గాంధీని కలిసి నాగంను పార్టీలో చేర్చుకోవద్దని కూడా కోరారు. అయితే.. నాగం చేరికతో మహబూబ్‌నగర్ జిల్లాలో పార్టీ బలోపేతం అవుతుందని భావించిన అధిష్ఠానం వ్యతిరేకులను నచ్చజెప్పినట్లు తెలిసింది. అయితే నాగం జనార్దన్‌రెడ్డి మాతృమూర్తి ఆరోగ్యం సరిగ్గా లేకపోవడంతో ఆమెను ఆస్పత్రిలో చేర్చారు. దీనిని దృష్టిలో పెట్టుకునే ముందుగా చేరిక తేదీని ప్రకటించలేదని భావిస్తున్నారు. అయితే మొత్తంగా బస్సు యాత్రకు ముందే నాగం కాంగ్రెస్‌లో చేరడం ఖాయమని అంటున్నారు. టీడీపీ నుంచి ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన నాగం మంత్రిగా కూడా బాధ్యతలు నిర్వహించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో బీజేపీలో చేరారు. గత ఎన్నికల్లో బీజేపీ తరపున పోటీ చేసినా ఓడిపోయారు. రాష్ట్ర పార్టీ నేతలతో విభేదాల కారణంగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. పార్టీలో తనకు తగిన గుర్తింపు లభించడంలేదన ఆయన బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేశారు. కొద్దికాలం క్రితమే తాను బీజేపీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఉగాధి తరువాత ఏ పార్టీలో చేరిది ప్రకటిస్తానన్నారు. అప్పుడే ఆయన కాంగ్రెస్‌లో చేరనున్నారని వార్తలు వచ్చాయి.

పత్తి రైతుల దోపిడికి రంగం సిద్ధం

బీజీ 3 హెచ్‌టీ రకం విత్తనాలపై రాష్ట్రంలో అమలు కాని నిషేధం

- గతేడాది భారీగా విత్తనాల అమ్మకం
- దిగుబడి లేక నష్టపోయిన రైతులు
- ప్రైవేటు సంస్థలపై చర్యలు శూన్యం
- ఈ ఏడాది అమ్మకానికి ఏర్పాట్లు పూర్తి
- ప్రభుత్వం స్పందించాలంటున్న రైతులు



హైదరాబాద్, ఫిబ్రవరి 21(మనం ప్రతినిధి): వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రాధాన్యం, రాష్ట్రాన్ని విత్తన భాండాగారంగా మారుస్తామంటూ నేతలు చెబుతున్న మాటలు నీటిమూటల్లా మారుతున్నాయి. ప్రభుత్వ నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం వెరసి రైతులు నష్టాలు చవి చూస్తున్నారు. రాష్ట్రంలోని పత్తి రైతులను నట్టేట ముంచేందుకు మరోమారు రంగం సిద్ధమయ్యింది. హెచ్‌టీ విత్తనాల పేరుతో రైతులను మోసగించేందుకు ప్రైవేటు విత్తన సంస్థలు ఏర్పాట్లు పూర్తి చేసుకున్నాయి. బీజీ-3 హెచ్‌టీ రకం విత్తనాల వల్ల రైతులు ఎన్నో ఏళ్లుగా నష్టపోతున్నా, ప్రభుత్వం పట్టించుకోకపోవడం గమనార్హం. ప్రభుత్వ ఉదాసీనత వల్ల ఓ పక్క రైతులు నష్టపోతుంటే, మరో పక్క విత్తన సంస్థ యజమానులు కోట్లు గడిస్తున్నారు.

రాష్ట్రంలో అమలు కానీ నిషేధం

బీజీ-3 హెచ్‌టీ రకం పత్తి విత్తనాల వల్ల పత్తి దిగుబడి తగ్గడమే కాకుండా పర్యావరణానికి కూడా హాని జరుగుతుంది. ఈ కారణం వల్ల ప్రపంచంలోని వివిధ దేశాలతో భారతదేశంలోను ఈ విత్తనాలపై నిషేధం ఉంది. కానీ తెలంగాణలో ఈ నిషేధం అమలు కావడం లేదు. ప్రైవేటు విత్తన సంస్థలు బీజీ 3 హెచ్‌టీ రకం విత్తనాలను నిరంతరాయంగా సరఫరా చేస్తున్నాయి. డీలర్లు, ఆర్గనైజర్ల ద్వారా రైతులకు అంటగడుతున్నాయి. ఈ అక్రమ వ్యాపారానికి ప్రభుత్వం, అధికారులు సహకరించడం వల్లే ప్రైవేటు కంపెనీలకు అడ్డూఅదుపు లేకుండా పోయిందన్న ఆరోపణలు ఉన్నాయి. బీజీ 3 హెచ్‌టీ రకం విత్తనాలకు కలుపును నివారించే గుణం ఉంది. ఇదే ప్రత్యేకతగా చూపి ఆయా కంపెనీలు విత్తనాలను విక్రయిస్తున్నాయి.

పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం

గత ఖరీఫ్‌లో రాష్ట్రంలోని దాదాపు 19 లక్షల ఎకరాల్లో బీజీ 3 హెచ్‌టీ రకం విత్తనాలను రైతులు విత్తారు. దిగుబడి పడిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఎకరానికి సగటున 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉంది. రాష్ట్ర వ్యవసాయ శాఖ ఈ ఏడాది పత్తి దిగుబడి 3.2 కోట్ల క్వింటాళ్లు ఉంటుందని అంచనా వేసింది. ఇటీవల అది 2.3 కోట్ల క్వింటాళ్లేనని తెలిపింది. అంటే దాదాపు కోటీ క్వింటాళ్ల పత్తి దిగుబడులు తగ్గిపోయాయి. బీజీ 3 హెచ్‌టీ రకం విత్తనాలు వేసిన చేలల్లో దిగుబడి సగానికిపైగా పడిపోయిందని రైతులు అంటున్నారు. పంట చేను మాత్రం ఏపుగా పెరిగి పూత, కాయ లేకుండా నిలిచిపోతుందని చెబుతున్నారు. ఈ విషయంపై పెద్ద సంఖ్యలో రైతులు వ్యవసాయ శాఖ అధికారులకు ఫిర్యాదు కూడా చేశారు. ఆయా డీలర్ల వద్ద ఆందోళన కూడా చేశారు. కానీ ప్రభుత్వం నుంచి గానీ అధికారుల నుంచి గానీ ఎలాంటి హామీ రాలేదు. ఇదే ఆంధ్రప్రదేశ్‌లో రైతులు దాదాపు 6 లక్షల ఎకరాల్లో బీజీ 3 హెచ్‌టీ రకం విత్తనాలను వేశారు. ఈ విషయంపై ఏపీ ప్రభుత్వం ప్రత్యేకంగా కమిటీని ఏర్పాటు చేసింది. విత్తనాలను అమ్మిన కంపెనీలు, డీలర్లు, ఆర్గనైజర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేసింది.

వచ్చే ఖరీఫ్‌కు 90 లక్షల ప్యాకెట్లు

వచ్చే ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రాష్ట్రంలో పత్తి పంట కోసం పలు ప్రైవేటు సంస్థలు దాదాపు 90 లక్షల విత్తన ప్యాకెట్లను సిద్ధం చేశాయి. గతేడాది తెలంగాణలో 46 లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగు చేశారు. అయితే ఆశించిన స్థాయిలో గిట్టుబాటు ధర లేకపోవడం, దిగుమతి పడిపోవడం వంటి కారణాల వల్ల వచ్చే ఖరీఫ్‌లో పత్తి సాగు కాస్తంత తగ్గుతుందని వ్యవసాయ శాఖ అధికారుల అంచనా. దీన్ని దృష్టిలో ఉంచుకునే ఎకరానికి మూడు ప్యాకెట్లు(సావు గింజలతో కలుపుకుని) చొప్పున ఆయా ప్రైవేటు కంపెనీలు విత్తనాలను డీలర్లకు సరఫరా చేశాయి. గతేడాది ఈ విత్తన అమ్మకాలపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో వచ్చే ఖరీఫ్‌కు సరిపడా సరుకున్న సంస్థలు సిద్ధం చేసుకున్నాయని కేవీకేకు చెందిన ఓ శాస్త్రవేత్త తెలిపారు.

సిండికేట్‌గా పత్తి విత్తన కంపెనీలు

బీజీ 3 హెచ్‌టీ రకం విత్తనాల విక్రయాల విషయంలో ప్రైవేటు విత్తనాల కంపెనీలు సిండికేట్‌గా ఏర్పడ్డాయి. నిషేధం విధించిన విత్తనాలను మార్కెట్‌లో విక్రయించేందుకు మార్గం సుగమం చేసుకున్నాయి. విత్తన కంపెనీల యాజమాన్యాలు ఇటీవల హైదరాబాద్‌లోని ఓ ఖరీదైన హోటల్‌లో డీలర్లు, ఆర్గనైజర్లకు విందు ఏర్పాటుచేశాయి. బీజీ 3 హెచ్‌టీ రకం విత్తనాలను అమ్మాలని డీలర్లు, ఆర్గనైజర్లను కోరాయి. దీనిని వారు వ్యతిరేకించారు. గతేడాది ఈ విత్తనాల విక్రయం వల్ల అధికారుల నుంచి ఇబ్బందులు ఎదుర్కొన్నామని, ఈ ఏడాది తమ వల్ల కాదని డీలర్లు తేల్చి చెప్పారు. అయితే జిల్లా స్థాయి అధికారులతో మాట్లాడి ఎటువంటి ఇబ్బంది లేకుండా చేస్తామని కంపెనీల ప్రతినిధులు హామీ ఇవ్వడంతో విత్తనాల అమ్మకానికి డీలర్లు అంగీకరించారు. విత్తనాల అమ్మకాల విషయంలో అడ్డుపడకుండా ఉండేందుకు ఆయా సంస్థలు గతేడాది అధికారులకు, నేతలకు భారీగానే డబ్బులు ముట్టజెప్పాయి. వచ్చే ఖరీఫ్‌లోనూ ఇబ్బంది పెట్టవద్దని కోరాయి. అందులో భాగంగా ఓ ప్రజాప్రతినిధికి రూ.50 కోట్లు ముట్టజెప్పినట్టు సమాచారం. డీలర్లు, ఆర్గనైజర్లను ఇబ్బందులకు గురి చేయవద్దని సదరు ప్రజాప్రతినిధి రాష్ట్రవ్యాప్తంగా అధికారులకు ఇటీవల హుకుం జారీ చేశారని సమాచారం. బీజీ 3 హెచ్‌టీ విత్తనాల విషయంతో పత్తి రైతుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి ఈ విత్తనాల విక్రయాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

పరిశ్రమలకు తెలంగాణ అనుకూలం

- పెట్టుబడులతో రండి.. ప్రోత్సాహకాలు ఇస్తాం
- గల్‌ఫుడ్-2018 ట్రేడ్ షోలో మంత్రి తలసాని
- వచ్చే నెలలో రాష్ట్రానికి వివిధ సంస్థల ప్రతినిధులు



హైదరాబాద్, ఫిబ్రవరి 21 (మనం ప్రతినిధి): పరిశ్రమల ఏర్పాటుకు తెలంగాణ రాష్ట్రం అనుకూలమని, అన్నిరకాల అనుమతులను సింగిల్ విండో పద్ధతిలో ఇస్తుందని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్యపాడిపరిశ్రమల అభివృద్ధిశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. బుధవారం దుబాయిలో జరుగుతున్న గల్ ఫుడ్-2018 ట్రేడ్ షో రెండో రోజు ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం మాంసాన్ని దిగుమతి చేసుకుంటున్న తెలంగాణ రాష్ట్రం మాంసం ఎగుమతి చేసే స్థాయికి అభివృద్ధి చెందాలని సీఎం సంకల్పించారన్నారు. పరిశ్రమలకు 24 గంటల విద్యుత్ సరఫరా, నీటి లభ్యత, మానవ వనరులు పుష్కలంగా ఉన్నాయన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొచ్చే వారిని ప్రోత్సహించే విధంగా తెలంగాణ ప్రభుత్వం అనేక రాయితీలను కల్పిస్తుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మాంసం ఉత్పత్తి రంగాల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను పరిశీలించేందుకు వచ్చే నెలలో తెలంగాణకు వివిధ సంస్థల ప్రతినిధులు అంగీకారం తెలిపారన్నారు. ట్రేడ్ షోలో మంత్రితో పాటు డెయిరీ డెవలప్‌మెంట్ మేనేజింగ్ డైరెక్టర్ నిర్మల, పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు, గొర్రెలు, మేకల అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బస్సుయాత్రతో టీఆర్ఎస్ గుండెల్లో రైళ్లు

- ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు చెబుతాం
- కాంగ్రెస్ అధికార ప్రతినిధి నగేష్

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (మనం ప్రతినిధి): కాంగ్రెస్ బస్సు యాత్ర ప్రకటనతో టీఆర్ఎస్ నాయకుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయని ఆ పార్టీ అధికార ప్రతినిధి నగేష్ అన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను బస్సు యాత్రలో ప్రజలకు వివరిస్తామన్నారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి చేస్తున్నది అభివృద్ధి నిరోధక యాత్రని టీఆర్ఎస్ చేసిన విమర్శలను ఆయన ఖండించారు. సచివాల యానికి రాని ముఖ్యమంత్రికి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. కేసీఆర్ చేయించిన సర్వేలో టీఆర్ఎస్ ఓడిపోతుందని తేలిందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ బస్సు యాత్రను దిగ్విజయంగా జరుగుతుందన్నారు.

రాష్ట్రంలో 8 కేన్సర్ స్క్రీనింగ్ కేంద్రాలు

- టాటా ట్రస్ట్ ప్రతినిధుల భేటీలో లక్ష్మారెడ్డి

హైదరాబాద్, ఫ్రిబవరి 21(మనం ప్రతినిధి): రాష్ట్ర వ్యాప్తంగా 8 కేన్సర్ స్క్రీనింగ్, చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోందని మంత్రి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈమేరకు బుధవారం తన కార్యాలయంలో టాటా ట్రస్ట్ ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఇప్పటికే వైద్య ఆరోగ్య రంగంలో కృషి చేస్తున్న టాటా ట్రస్ట్ తెలంగాణలోనూ సేవలు అందించడానికి ముందుకు వచ్చిందని తెలిపారు. కేన్సర్ వైద్య పరీక్షలు, చికిత్సకు సంబంధించి తమ వంతు సహకారం అందించడానికి ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకోవడానికి సంసిద్ధతను వ్యక్తం చేసిందన్నారు. సాంకేతిక, పరికరాల పరంగా, ఇతర సహాయ సహకారాలను అందించేందుకు టాటా ట్రస్ట్ సిద్ధంగా ఉన్నట్టు మంత్రి తెలిపారు. ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రి అపెక్స్ సెంటర్‌గా రాష్ట్రంలో 8 కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆలోస్తున్నట్టు మంత్రి పేర్కొన్నారు. ఆదిలాబాద్ రిమ్స్, వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజీ, మహబూబ్‌నగర్ మెడికల్ కాలేజీ, నిజామాబాద్ మెడికల్ కాలేజీల పరిధుల్లో ఒక్కొక్కటి చొప్పున, ఖమ్మం, కరీంనగర్, నల్లగొండ జిల్లాల్లో ఒక్కొక్కటి చొప్పున మొత్తం 8 కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రాథమికంగా నిర్ణయించినట్టు తెలిపారు. విధి విధానాలు ఖరారైతే రాష్ట్రంలో క్యాన్సర్ పరీక్షలు, చికిత్సలు విస్త ృతమవుతాయన్నారు.

ఉత్తమ్ బస్సుయాత్ర షెడ్యూల్ ఖరారు


- ఫిబ్రవరి 26వ తేదీన ప్రారంభం
- అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల కోసం మార్చి 7వ తేదీ తర్వాత విరామం
- ప్రతి రోజూ రెండు ప్రాంతాల్లో సభలు



హైదరాబాద్, ఫిబ్రవరి 21(మనం ప్రతినిధి): తెలంగాణ పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్ చేపట్టనున్న బస్సు యాత్రకు సంబంధించిన షెడ్యూల్‌ను బుధవారం విడుదల చేశారు. తొలి దశలో ఈ నెల 26 నుంచి మార్చి ఏడో తేదీ వరకు యాత్ర నిర్వహిస్తున్నారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం యాత్రను పునః ప్రారంభిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టనున్న బస్సు యాత్రను ఈ నెల 26వ తేదీన ప్రారంభిస్తారు. 26వ తేదీ ఉదయం పది గంటలకు నాంపల్లి దర్గాను సందర్శిస్తారు. అక్కడి నుంచి మైసమ్మ దేవాలయం పూజలు చేసి మొహినాబాద్ చర్చిలో ప్రార్థనలు చేస్తారు. ఆ రోజు మధ్యాహ్నం ఒంటిగంటకు చేవెళ్ల చేరుకుంటారు. సాయంత్రం నాలుగు గంటలకు వికారాబాద్‌లో బహిరంగ సభలో పాల్గొంటారు. రాత్రికి అక్కడే బస చేస్తారు. ప్రతి రోజు మధ్యాహ్నం ఒంటి గంటకు, సాయంత్రం 4 గంటలకు బహిరంగ సభలు ఉంటాయి. 27వ తేదీ మధ్యాహ్నం తాండూరులో, సాయంత్రం సంగారెడ్డిలో సభ ఉంటుంది. రాత్రికి సంగారెడ్డిలో ఉత్తమ్ బస చేస్తారు. 28వ తేదీ మధ్యాహ్నం జహీరాబాద్‌లో, సాయంత్రం నారాయణ్ ఖేడ్‌లో సభలు ఉంటాయి. మార్చి ఒకటి నుంచి 3వ తేదీ వరకు యాత్రకు విరామం ఉంటుంది. మార్చి 4న మధ్యాహ్నం బోధన్, సాయంత్రం నిజామాబాద్‌లో బహిరంగ సభలు ఉంటాయి. మార్చి 5న ఆర్మూర్, బాల్కోండలో సభలు ఉంటాయి. 6న నిర్మల్, మెట్‌పల్లిలో సభలు నిర్వహిస్తారు. మార్చి 7న కరీంనగర్‌లో సభ ఉంటుంది. మార్చి7 తరువాత యాత్రకు విరామం ఉంటుంది. శాసనసభ బడ్జెట్ సమావేశాలు పూర్తయిన తరువాత మళ్లీ యాత్ర ప్రారంభం అవుతుంది.

ఆర్టీసీలో వేతన సవరణ ఒప్పందం అమలు చేయాలి

- కాంగ్రెస్ నేత మల్లు రవి డిమాండ్



హైదరాబాద్, ఫిబ్రవరి 21(మనం ప్రతినిధి): తెలంగాణ ఆర్టీసీలో కార్మికులకు వేతన సవరణ ఒప్పందం అమలు చేయాలని కాంగ్రెస్ నాయకుడు మల్లు రవి డిమాండ్ చేశారు. గాంధీభవన్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ఒప్పందం కాలపరిమితి ముగిసి 11 నెలలు అవుతున్నా యాజమాన్యం ఇప్పటివరకు స్పందించడం లేదన్నారు. వేతన ఒప్పందం అమలు చేసేలా యాజమాన్యంపై ఒత్తిడి తీసుకురావాలని చేయాలని కోరుతూ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు గతంలో ఉత్తమ్ కుమార్ రెడ్డికి వినతి పత్రం సమర్పించారన్నారు. గతంలో 44 శాతం ఫిట్ మెంట్ ఇచ్చిన సందర్భంలో, ఇది ముగిసిన వెంటనే కొత్త ఒప్పందం అమలు చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారని మల్లు రవి గుర్తు చేశారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తామని ఇచ్చిన హామీని కూడా ముఖ్యమంత్రి విస్మరించారని అన్నారు. వేతన ఒప్పందంపై టీఆర్ఎస్ అనుబంధ కార్మిక సంఘం, ఆర్టీసీలో గుర్తింపు సంఘమైన టీఎంయూ ఎందుకు ప్రశ్నించడం లేదని మల్లు రవి అన్నారు. కాగా వేతన సవరణ ఒప్పందం అమలు కోసం అన్ని కార్మిక సంఘాలతో కలిసి ఉద్యమం చేస్తామని స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్రహం తెలిపారు.

నిధుల ఖర్చుపై నిర్లక్ష్యమా?

- అధికారులపై ఎస్సీ కమిషన్ ఆగ్రహం
- పోలీసుల పనితీరుపైనా అసంతృప్తి
- నేరెళ్ల ఘటనపై ఎస్పీపై చర్యలేవి?
- సోషల్ వెల్ఫేర్ కూడా విఫలమైంది
- అధికారుల సమీక్షలో కమిషన్ చైర్మన్

హైదరాబాద్, ఫిబ్రవరి 21(మనం ప్రతినిధి): ఎస్సీల అభివృద్ధి కోసం కేటాయించిన నిధులను ఖర్చు చేయడంలో అధికారుల నిర్లక్ష్యంపై జాతీయ ఎస్సీ కమిషన్ ఆగ్రహం వ్యక్తంచేసింది. రాష్ట్ర పర్యటనలో భాగంగా రెండోరోజైన బుధవారం తాజ్‌డెక్కన్ హోటల్‌లో కమిషన్ పలు ప్రభుత్వ శాఖల ముఖ్య అధికారులతో కమిషన్ సమీక్షా సమావేశం నిర్వహించింది. అనంతరం పోలీస్ అధికారులతో ప్రత్యేకంగా సమావేశమైంది. అనంతరం కమిషన్ చైర్మన్ రాంశంకర్ కఠారియా, వైస్‌చైర్మన్ మురుగన్ మీడియాతో మాట్లాడారు. ఎస్సీల అభివృద్ధిలో తెలంగాణ ప్రభుత్వం పనితీరుపై అసహనం వ్యక్తంచేశారు. ఎస్సీ డెవలప్‌మెంట్ శాఖ పనితీరు బాగాలేదన్నారు. ప్రభుత్వం 2016-17లో రూ.14,375 కోట్లు కేటాయిస్తే అందులో కేవలం రూ.7,170 కోట్లు మాత్రమే ఖర్చు చేయటం విచార కరమన్నారు. సబ్‌ప్లాన్ నిధులను 50శాతం కూడా ఖర్చు చేయకపోవటం పట్ల అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తంచేశారు. ఎస్సీ మహిళల్లో ప్రధానంగా విద్యావకాశాలు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. అక్షరాస్యత తక్కువగా ఉండటం పట్ల ఆందోళన వ్యక్తంచేశారు. తెలంగాణ ప్రభుత్వం గురుకులాలు ఏర్పాటు చేయటంపట్ల అభినందనలు తెలిపారు.

చార్జిషీట్ దాఖలులో నిర్లక్ష్యం..


అట్రాసిటీ కేసుల్లో చార్జిషీట్ దాఖలు చేయటంలో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. తెలంగాణలో మూడేండ్ల కాలంలో ఎస్సీలపై నేరాల సంఖ్య పెరిగిందన్నారు. మర్డర్, అత్యాచారాలకు సంబంధించి 2015లో 17 కేసులు నమోదు కాగా కేవలం 9 కేసుల్లో, 2016లో 32 కేసులకు గానూ 8కేసుల్లోనే పోలీసులు చార్జిషీట్ దాఖలు చేశారని, 2017లో 12 కేసులకు గానూ ఒక్క కేసులోనూ చార్జిషీట్ దాఖలు చేయకపోవటం అన్యాయమన్నారు. పోలీసులు కేసు నమోదు చేయకపోవటంతో బాధితులు కోర్టును ఆశ్రయిస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర పథకాలు ఎస్సీలకు సక్రమంగా అందటం లేదన్నారు. శిక్షల విషయంలో జాతీయ సరాసరితో పోలిస్తే రాష్ట్రంలో కేవలం 22.8 శాతమే ఉందన్నారు. మాన్యువల్ స్కావెంజర్ పనులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అట్రాసిటీ కేసుల్లో స్టేషన్ బెయిలా?: కె.రాములు

అట్రాసిటీ కేసుల్లో స్టేషన్ బెయిల్ ఇస్తుండటం తెలుగు రాష్ట్రాల్లోనే చూస్తున్నానని తెలంగాణకు చెందిన జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు కె.రాములు అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మున్సిపల్ కమిషనర్‌పై కొందరు దాడి చేసిన ఘటనలో కేసు నమోదు చేయటంలో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. చివరకు కమిషనర్ తనను ఆశ్రయించారని తెలిపారు. పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ యాదయ్య పట్ల అధికారులు ప్రోటోకాల్ పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. అట్రాసిటీ కేసుల విషయంలో పోలీసులు జాప్యం చేయటం క్షమించరాని నేరమన్నారు. నేరెళ్ల ఘటనలో ఎస్పీపై చర్య తీసుకోవాలని సూచించినప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు.

కాంగ్రెస్ ఓ ముసలి నక్క

- ఆ పార్టీని నమ్మేది ఎవరు?.. ఆ నేతలది బోగస్ యాత్ర
- ప్రతిపక్షం హోదా కూడా దక్కదు: కర్నె



హైదరాబాద్, ఫిబ్రవరి 21 (మనం ప్రతినిధి): కాంగ్రెస్ పార్టీ ఒక ముసలి నక్క అని, యవ్వనపు రంగులు వేసుకున్న మాత్రాన ముసలి నక్కను ప్రజలు నమ్ముతారా? అని టీఆర్ఎస్ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ ధ్వజమెత్తారు. ఈ నెల 26 నుంచి కాంగ్రెస్ చేపట్టిన ప్రజా చైతన్య యాత్ర ప్రజల కోసం కాదని, అది వారి పదవుల రాజకీయ యాత్ర అని మండిపడ్డారు. బోగస్ యాత్ర చేస్తున్న కాంగ్రెస్‌కు వచ్చే ఎన్నికల్లో ప్రతిపక్ష హోదా కూడా దక్కదన్నారు. ఇప్పటి వరకూ కాంగ్రెస్ నాయకులు పచ్చి అబద్ధాలను పదేపదే ప్రచారం చేసేందుకు బయలు దేరుతున్నారన్నారు. టీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో కర్నె ప్రభాకర్ మీడియాతో మాట్లాడారు. ఏ యాత్ర చేసినా కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. కాంగ్రెస్ హయాంలో కట్టని ప్రాజెక్టులన్నీ, జరగని సంక్షేమ పథకాలన్నీ టీఆర్ఎస్ ప్రభుత్వంలో జరుగుతున్నాయని ప్రజలకు చెప్పడానికి యాత్ర చేస్తున్నారా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకుల యాత్ర వల్ల ఒరిగేందేమీ లేదన్నారు. సెమీఫైనల్స్‌కు సిద్ధంగా ఉండాలని కాంగ్రెస్ నేత షబ్బీర్‌అలీ అనడాన్ని ప్రస్తావిస్తూ.. నిన్న, మొన్న జరిగిన మునిసిపల్, గ్రామపంచాయతీ ఉప ఎన్నికల్లోపాటు కాంగ్రెస్ సభ్యులే చనిపోయి సానుభూతి పవనాలు ఉన్న నారాయణ్‌ఖేడ్, పాలేరు స్థానాలు, టీఆర్ఎస్ ఎంపీలు రాజీనామా కారణంగా జరిగిన మెదక్, వరంగల్ లోక్‌సభ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ ఎక్కడ గెలిచిందో షబ్బీర్ అలీ చెప్పాలన్నారు. టీఆర్ఎస్‌కు రాజీనామాలు చేయడం, తిరిగి గెలవడం కొత్త కాదని అన్నారు. ముందు రేవంత్‌రెడ్డి రాజీనామా డ్రామాపై షబ్బీర్ అలీ వంటి నాయకులు మాట్లాడాలన్నారు. రాజీనామా చేశానని చెప్తున్నా రేవంత్‌రెడ్డి ప్రభుత్వ కార్యక్రామాల్లో ఎలా పాల్గొంటున్నారని నిలదీశారు.

మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..


గురువారం, ఫిబ్రవరి 22

విధాన వైరుధ్యం

బ్యాంకింగ్ ఘరానా మోసాలకు గుండెలు బాదుకుంటున్న కథనాలు చూస్తుంటే గొంగట్లో తింటూ వెంట్రుకలు వస్తున్నాయని బాధపడుతున్నట్ల నిపిస్తోంది. వజ్రవ్యాపారి నీరవ్ మోదీ చేసిన పదకొండున్నర వేల కోట్ల రూపాయల మోసపు చీకటి కోణాల మూల్యాంకనలు పూర్తికాకమునుపే, రోటోమ్యాక్ గ్లోబల్ అనే పెన్‌ల తయారీ కంపెనీ అధిపతి విక్రమ్ కొఠారీ చేసిన రూ.3,695 కోట్ల కుంభకోణం బయటపడడం దేశాన్ని ఆశ్చర్యంలో ముంచెత్తింది. వంచన, వ్యాపారం పర్యాయపదాలుగా సాగుతున్న ఆర్థిక విధానంలో ఇంతకంటే ఘనమైన ఉదంతాలు ఎలా ఉనికిలోకి వస్తాయి? ద్రవ్యం (డబ్బు) సర్వాంతర్యామి, సర్వశక్తిమంతుడుగా ప్రపంచంలో విశ్వరూపం దాల్చిన తరుణంలో డబ్బు ఎంత పరిమాణంలో కలిగి ఉన్నాడన్న అంశానికి మాత్రమే విలువిచ్చి, ఎలా సంపాదించాడనే దానిని అంతగా పట్టించుకోని సామాజిక న్యాయం నడుస్తున్నది. ఈ పరిస్థితుల్లో 'స్కామాసురు'లను తొలుత ఈసడించుకున్నట్లు అనిపించినా, తర్వాత సమాజంలో వారికే నీరాజనాలు దక్కుతుండడం దురదృష్టకరమే గానీ, ఒక కఠోర వాస్తవం. ఈ నేపథ్యంలో ఘరానా మోసాలు, ఉన్నతాధికారులు, రాజకీయ నాయకుల అవినీతి సైతం సమర్థతకు చిహ్నాలుగా అంతరంగాల్లో ఒక సుప్త చేతన సంస్కృతిగా కొనసాగుతూ సామాజిక ఆమోదం కలిగి ఉండడాన్నీ కాదనలేము. దాంతో బడా మోసం చూసి గుండెలు బాదుకుంటున్న వాళ్ళలో తమకు ఆ చాన్స్ రాలేదే అని బాధతో విమర్శిస్తున్నవారూ అధికసంఖ్యలో ఉండడంలోనూ ఆశ్చర్యం లేదు.

నీరవ్ బృందం చేసిన మోసం ప్రాథమిక అంచనాలకు మించి రూ.20 వేల కోట్లు చెల్లించవలసి ఉంటుందని వివిధ బాధిత బ్యాంకులు వాపోతున్నాయి. దాదాపు ముప్పై బ్యాంకుల దాకా నీరవ్ బృందం మోసం చేసి ఉంటారని సీవీసీ, ఈడీ, సీబీఐ, సహా ఏడు సంస్థలు చేపట్టిన విచారణలో వెల్లడైంది. అదే విధంగా ఏడు బ్యాంకులతో ఏర్పడిన కన్సార్టియం సంస్థ నుంచి కొఠారీ బృందం నకిలీపత్రాలతో పొందిన రుణాల్ని విదేశీ సంస్థల ఖాతాలకు తరలించింది. ఆ తర్వాత ఆ విదేశీ బ్యాంకుల నుంచి వాటిని తమకు అనువైన బ్యాంకులకు తిరిగి రాబట్టడంలో నిబంధనలన్నిటినీ అతిక్రమించినట్లు సీబీఐ దర్యాప్తులో బయటపడింది. రుణ పరిమితులకు మించి ఓవర్ డ్రాఫ్ట్ రూపంలో రుణాలను పొందే విధానం 2008 నుంచి బ్యాంకులు అమలుచేస్తున్నాయి. వజ్రాలు, ఆభరణాలు, గోధుమల ఎగుమతి వంటి వాణిజ్య లావాదేవీల్లో ఇలాంటి బ్యాంకింగ్ విధానం అమలులో ఉంది. బ్యాంక్ ఆఫ్ బరోడా వెబ్‌సైట్‌లో ఎగవేతదారుల జాబితాలో అగ్రస్థానంలో రొటొమాక్ సంస్థ ఉన్నప్పటికీ, 2015 నుంచి ఆ సంస్థ ఖాతాను మొండిబాకీల కింద పరిగణిస్తున్నప్పటికీ బ్యాంకుల కన్సార్టియం కొఠారీకి సహకరించడం క్షంతవ్యం కాదు. అయితే ఈ రెండుకుంభకోణాలు బయటపడ్డాయి కాబట్టి అర్థమయ్యాయి కానీ, ఏళ్ళ తరబడి జరుగుతున్న ఇలాంటి బ్యాంకింగ్ విధానంలో బయటపడని కుంభకోణాలు ఇంకెన్నో? అవకతవకల్ని నివారించే లక్ష్యంతో పెద్ద ఎత్తున నిబంధనల్నీ రూపొందించినా, నెలవారీ ఆడిటర్లు పరిశీలిస్తూ నివేదికలు రూపొందిస్తూ ఉన్నా అక్రమాలు జరుగుతుండడంలో విధానపరమైన లోపమే ప్రధాన కారణం.

హర్షద్ మెహతా, కేతన్ పరేఖ్, నీరవ్ మోదీ, కొఠారీ వంటి ఘరానా కార్పొరేట్ వంచకులకు లోపాయికారీగా సహకరించి కోట్లకు పడగలెత్తిన బ్యాంకు అధికారులు, ఉద్యోగులను ఎలా లెక్కించగలం? కేవలం రెండేళ్ళ వ్యవధిలో ప్రభుత్వరంగ బ్యాంకులకు చెందిన 5,200 మంది ఉద్యోగులు రకరకాల మోసాలకు పాల్పడినట్లు ఆర్‌బీఐ అధికారికంగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో వ్యవస్థాగత లోపాల్ని ముందే గుర్తించి కట్టడి చేయడంలో రిజర్వు బ్యాంకు దక్షతను ప్రశ్నిస్తూ కేంద్రం రాసిన తాజా లేఖ ప్రజల్లో భయాందోళనలు కలిగిస్తున్నాయి. విదేశీ, స్వదేశీ కార్పొరేట్ సంస్థలను, ద్రవ్య సంస్థలను ప్రోత్సహిస్తూ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను (ఎఫ్‌డీఐ) దేశంలోకి రాబట్టడమే అభివృద్ధిగాను, పూర్వ షరతుగాను భావిస్తూ, ద్రవ్యసర్దుబాట్ల ద్వారానే ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దాలనే ప్రభుత్వ విధానాల కారణంగానే ఇలాంటి కుంభకోణాలు నిత్యం వెలుగులోకి వస్తున్నాయి. ప్రభుత్వరంగ బ్యాంకుల మొండి బకాయిలు ఏడు లక్షల కోట్ల రూపాయలకు పైబడగా, గడచిన పదకొండేళ్ళలో కేంద్ర ప్రభుత్వాలు రూ.2.6 లక్షల కోట్ల ప్రజాధనాన్ని పునర్ మూలధనీకరణ పేరుతో వెచ్చించాయి. అంటే రుణాలు, ఇతరత్రా లావాదేవీలతో ప్రభుత్వ రంగ బ్యాంకులను కార్పొరేట్ సంస్థలు మోసంచేస్తుంటే కేంద్ర ప్రభుత్వం ఆ నష్టాలను పూడ్చేందుకు ప్రజాధనాన్ని వినియోగించడం దారుణం. మొండి బకాయిలు సంక్షోభంలో కూరుకుపోయిన బ్యాంకులను నిలబెట్టేందుకు, కార్పొరేట్లు ఎగ్గొట్టడం వల్ల కలిగే నష్టాన్ని, ప్రజలు దాచుకున్న డబ్బుతో భర్తీ చేసుకునేందుకు వీలుగా మోదీ ప్రభుత్వం ఎఫ్‌ఆర్‌డీఐ (ఫైనాన్షియల్ రిజల్యూషన్ ఆఫ్ డిపాజిట్ ఇన్సూరెన్సు బిల్లు)ను రూపొందించింది. ప్రజలు పైసాపైసా కూడబెట్టిన కష్టార్జితాన్ని బ్యాంకులు, ఇన్స్యూరెన్స్ కంపెనీలు స్వాహా చేయడంతో ఆ కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి దాపురిస్తుంది. కొంతమంది ఘరానా మోసగాళ్లను, అధికారులను శిక్షించి నిజాయితీగా వ్యవహరిస్తున్నామని ఆత్మసంతృప్తి చెంది చేతులు దులుపుకున్నంత మాత్రాన స్కాంలు రావడం శాశ్వతంగా సమసిపోవు. ద్రవ్యపెట్టుబడి, కార్పొరేట్ అత్యాశల కేంద్రంగా సాగే ఆర్థిక విధానాన్ని అనుసరిస్తున్నంత కాలం ఇలాంటి కుంభకోణాలు ఏర్పడడాన్ని ఏ ప్రభుత్వమూ నిరోధించలేదు.



మంచిమాట



'జీవితంలో విలువలు నేర్పించేదే నిజమైన విద్య'

- డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్

అస్తిత్వ ద్వైతాద్వైతం

అగ్ర, నిమ్న కులాలు ఏవైనా గతంలో హిందూ మతం, రాజ్యం రూపొందించిన సమగ్ర మతవ్యవస్థలోని శకలాలే. దాంతో కుల అస్తిత్వ వాదమేదైనా సారాంశంలో శకల మతవాదమే.




వెన్నెలకంటి రామారావు
సెల్ : 9550367536

ప్రతిఫలనం

గూగి వాథియాంగో ఒక అస్తిత్వ ధిక్కార సంకేతం. వైవిధ్యపూరిత అస్తిత్వాలతో కూడిన ప్రపంచ మానవాళిని 'పెట్టుబడి-శ్రమ- సరకు-డాలరు' అనే ఏకీకృత అస్తిత్వంగా ప్రపంచీకరణ కుదిస్తున్న, పరాయికరిస్తున్న, వలసీకరిస్తున్న క్రమాన్ని ఆయన అక్షరాల్లో ధిక్కార గానాన్ని ఆలపించారు. సామ్రాజ్యవాదం భౌగోళిక- రాజకీయ, భౌతిక, మానసిక రూపాల్లో ప్రపంచ మానవాళి వలసీకరణకు గురిచేస్తుండడాన్ని గూగీ సాహిత్యం నిలదీసింది, పోరాడే ప్రజానీకానికి ఉత్తేజితం చేసింది. ఎంతటి ఘోరమైన పరిస్థితిలో జీవిస్తున్నప్పటికీ మార్పు కోసం కలగనడం మానొద్దని ఆదివారం హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయంలో జరిగిన 'యుద్ధకాలంలో స్వప్నాలు.. బాల్య జ్ఞాపకాలు' పుస్తకావిష్కరణ సభలో పీడిత వర్గ భావజాల కర్త గూగీ సందేశమిచ్చారు. గూగీ ఆత్మకథ తొలిభాగంగా ఇంగ్లీషులో వచ్చిన ఈ పుస్తకాన్ని నాగపూర్ హై సెక్యూరిటీ జైల్లో యావజ్జీవ కారాగార శిక్ష అనుభవిస్తున్న మేధావి ప్రొఫెసర్ జి.ఎన్.సాయిబాబా తెలుగులోకి అనువదించారు. 'నిద్ర కోసం స్వప్నించడం కాదు, భవిష్యత్ సమాజం కోసం స్వప్నించు' అని గూగీ ఇచ్చిన పిలుపులో మట్టి కాళ్ళ మహారాక్షసి సామ్రాజ్యవాదం పాదాల కింద పురుగుల్లా నలిగిపోతూ భౌతికంగా, సాంస్కృతికంగా, మానసికంగా వలసీకరణ చెందుతూ నిత్యం పరాయికరణకు లోనవుతున్న బ్లాక్ ఆఫ్రికన్ ప్రజల అస్తిత్వ ఘీంకారం మారుమోగింది. ఆయన ఉపన్యాసంలో కెన్యాలో సాగిన వలసవాద నిరంకుశపాలన, వారి స్థానిక పెత్తందారీ ఏజెంట్లు చేసిన, చేస్తున్న మారణకాండ, అణచివేతల వివరణలు అనేకం సమకాలీన భారతీయ సామాజిక సారూప్యత కలిగి ఉన్నట్లు అనుభూతమయ్యాయి. 80 ఏళ్ళ వయసులోనూ తన జాతి అస్తిత్వం కోసం, మానవాళి సమన్యాయం కోసం ఆయన పడుతున్న తపన మనలో నిద్రాణమై ఉన్న అనేక భావోద్వేగాలను చరచిలేపింది.

కుల, మత, ప్రాంత, జాతి, భాష, జెండర్ తదితర బహుళ అస్తిత్వాలు అంశీభూతాలుగా ఉన్న భారతీయ సమాజం నేడు అస్తిత్వ వైషమ్యాల సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. పాలక, ఆధిపత్య అస్తిత్వాలు, అణగారిన అస్తిత్వాల మధ్య ఒకవిధమైన యుద్ధవాతావరణం నెలకొంది. దళిత, బహుజన సామాజిక సమూహాలు, ముస్లిం తదితర మైనారిటీ సమూహాలు నేడు మెజారిటీ మత, కుల అస్తిత్వాల దాష్టీకానికి, విద్వేషకాండకు గురవుతున్నాయి. కుల వ్యవస్థ పునాదిగా వున్న 'ఏకీకృత హిందూ అస్తిత్వం' అనే నినాదంతో సాగుతున్న సాంఘిక పునర్నిర్మాణ జగన్నాథ రథచక్రాల కింద బహుళ అస్తిత్వాల భారతీయ సమాజం బీటలుబారుతోంది. మెజారిటీ హిందూ ప్రజల్ని ఓటు బ్యాంకుగా మలిచి అధికారాన్ని సుస్థిరం చేసుకునేందుకు మెజారిటీ మతతత్వ శక్తులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. దానికి ప్రతిగా హేతువాద భావాలు కలిగిన లౌకిక శక్తులు సంఘటితం కాకుండా రాజ్యం తీవ్ర నిర్బంధాన్ని ఒకచేత్తో అమలు చేస్తూ, మరొక చేత్తో గోసంరక్షణ, పశు మాంసాహార నిషేధం, మతవిద్వేషకాండ, స్త్రీల వస్త్రధారణ, ప్రవర్తనలపై మోరల్ పోలీసింగ్ వగైరాల రూపంలో మత విద్వేషకాండకు పాల్పడుతున్న మతోన్మాద శక్తులను రహస్యంగా/బహిరంగంగా ప్రోత్సహిస్తోంది. ఈ నేపథ్యంలో 90ల తర్వాత ప్రపంచీకరణ నేపథ్యంలో లౌకిక/వామపక్ష శక్తుల స్థానంలో కుల, మత తదితర వివిధ ఆధునికానంతరవాద (పోస్ట్ మాడర్నిస్ట్) అస్తిత్వవాద ఉద్యమాలు ముందుకొచ్చాయి. హిందుత్వ దాడులు పెరుగుతున్న సందర్భంలో వాటికి వ్యతిరేకంగా ఈ అణగారిన అస్తిత్వవాద శక్తులు వివిధ అస్తిత్వవాద సిద్ధాంతాలతో (మితవాదం, అతివాద రూపాలలో) ప్రతిఘటనకు సిద్ధమవుతున్నాయి. ఈ నేపథ్యంలో కులవ్యవస్థ పునాదిగా ఉన్న ఏకీకృత హిందూ అస్తిత్వవాదం విశ్వరూపంలో సమాజమంతా ఆవరిస్తోంది.



దేశభక్తికి కులం, మతం లేదు

జమ్మూలోని సుంజువాన్ సైనిక శిబిరంపై ఇటీవల ఉగ్రవాదులు జరిపిన దాడిలో ప్రాణత్యాగం చేసిన ఏడుగురు జవాన్లలో ఐదుగురు ముస్లింలేనని, అయినా భారతీయ ముస్లింల దేశభక్తిని శంకిస్తున్నారని మజ్లిస్ ఇత్తేహాద్ ముస్లిమీన్ (ఎంఐఎం) అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ చేసిన వ్యాఖ్య వివాదాస్పదంగా మారింది. దానికి ప్రతిస్పందిస్తూ దేశరక్షణకు ప్రాణాలొడ్డుతున్న సైనికులకు మతంరంగు పులమొద్దని, అది అన్ని మతాలకు పవిత్ర స్థలమని భారతసైన్యం హితవు పలికింది. నిజమే! దేశభక్తికి మతం లేదు, కులం లేదు. దేశం కోసం ప్రాణాలర్పించిన వారిలో కుల, మత పునాదులు వెతకడం సరికాదు. రాజకీయాలు నేరపూరితమై, రాజధర్మం నశించి కుల, మత, ప్రాంత, జాతి తదితర అస్తిత్వాల రంగు పులుముకున్న తరుణంలో ఓటుబ్యాం కుల కోసం ప్రతి విషయాన్ని స్వప్రయోజనాలకోసం వివాదాస్పదంగా మార్చి ప్రజల్లో అస్తిత్వ విద్వేషాలు రెచ్చగొడుతున్నారు. దాంతో ప్రజావిభజన రాజకీయాలు సమాజంలో నేడు ప్రబల స్థానాన్ని ఆక్రమించాయి. బహుళ అస్తిత్వాలతో కూడిన జాతీయ ఏకరూపత పేరుపై ఆధిపత్య అస్తిత్వాలు చేస్తున్న దాష్టీకాన్ని, అణచివేతను వివిధ అణగారిన అస్తిత్వాలు ధిక్కరిస్తున్న పరిస్థితి నుంచి ఇది ఏర్పడింది.

సమాజంలోని కుల, మత, ప్రాంత తదితర అస్తిత్వాల సమస్యలకు ఏకీకృత పరిష్కారం ఉంటుందనే భావన అగ్ర కులతత్వం, మెజారిటీ మతతత్వం తదితర ఆధిపత్య అస్తిత్వాల మోసపూరిత నినాదమనే ప్రచారం ప్రజానీకంలో లోతుగా విస్తరించింది. ఒకానొక రాజకీయార్థిక వ్యవస్థ ద్వారా అనుబంధితమైన వివిధ అస్తిత్వాలకు దేనికదే విడివిడి పరిష్కారాలుంటాయనే భావం ప్రబలంగా ఉంది. దాంతో ప్రతి పరిష్కారం మరొక అస్తిత్వ సమస్య పరిష్కారంతో అభావం చెందే పరిస్థితి నెలకొంది. మొదట్లో అణగారిన కుల, మత, ప్రాంత తదితరాల్లోని అణగారిన అస్తిత్వాల మధ్య ఐక్యత ఉన్నట్లు కనిపించినా, అది క్రమంగా అధికారంలో వాటాల కోసం పోటీలో వైషమ్యాలుగా పెచ్చరిల్లిపోయాయి.

సంఘ్ పరివార్ ఏకీకృత అస్తిత్వం

ప్రతి అస్తిత్వం, ఉప అస్తిత్వం ఇతర అస్తిత్వాల చర్యలను కుట్రలుగా చూసే ధోరణి ఒకటి సర్వత్రా ఆవరించింది. ఈ నేపథ్యంలో కులవ్యవస్థ పునాదిపై 'ఏకీకృత హిందూ అస్తిత్వం' ఎజెండాతో భారతీయ సమాజంలో మెజారిటీ మత స్థులను సంఘటితం చేసి ఓటు బ్యాంకును, అధికారాన్ని సుస్థిరపరచే లక్ష్యంతో సంఘపరివార్ శక్తులు వేగంగా పావులు కదుపుతున్నాయి. అలాంటి ఏకీకృత హిందుత్వ కార్యక్రమానికి అగ్రకుల ఆధిపత్యాన్ని, దాష్టీకాన్ని ధిక్కరిస్తూ ముందుకొస్తున్న అస్తిత్వ ఉద్యమాలు పెద్ద అడ్డంకిగా తయారయ్యాయి. హిందూమతంలో అంతర్భాగంగా పరిగణిస్తున్న లింగాయత్, శ్రీవైష్ణవం, పలు మతవిశ్వాసాలతో ఉన్న దండకారణ్య ఆదివాసీ తదితర కులవ్యవస్థను వ్యతిరేకించే భిన్న మతశాఖలకు చెందినవారు సంఘపరివార్ ఏకీకృత హిందూ అస్తిత్వ ఎజెండాకు కొరకాని కొయ్యలుగా తయారయ్యారు. అయితే గతంలో రాజ్యం, మతంలో అంతర్భాగమైన పాలకవర్గం అగ్ర, అణగారిన కులాల వివక్షతో కూడిన కుల వ్యవస్థను నిర్మించారు. గత సమాజాలలోని మిగులు (మిగల్చకుండా) సంపదంతా అగ్రవర్ణాలైన ఆధిపత్య వర్గాలకు చేరేందుకు ఈ సాంఘిక నిర్మాణం అవసరమై, ఉనికిలోకి వచ్చింది. ఇలాంటి అణచివేత సాంఘిక నిర్మాణ విభజన పరిధులకు మాత్రమే పరిమితమై ఉద్యమిస్తే, ఆ సామాజిక వర్గీకరణలోని విభిన్న సమూహాలు పరస్పర విరుద్ధమైన ధ్రువాలుగా మారి మరింత సంఘటిత రూపంలో అవతరిస్తాయేగాని అంతరించవు. కుల సమూహాలు మరింత గడ్డకట్టుకుని పోయి పాలకవర్గాలకు మరింతగా చక్కగా ఉపయోగ పడుతున్న సమకాలీన చేదు అనుభవాలను ఉద్వేగాల మాటున తోసిపుచ్చకూడదు. రాజ్యం, మతం నిర్వచించిన, రూపొందించిన కులవ్యవస్థను, అందుకు భిన్నంగా శ్రమ సంబంధాల సారూప్య నిర్మాణాల ద్వారా కుల నిర్మూలనా లక్ష్యంతో సాగాలి.

అన్నీ ఒకే తానులో ముక్కలే!

అగ్ర, నిమ్న కులాలు ఏవైనా హిందూ మతం, రాజ్యం రూపొందించిన సమగ్ర మతవ్యవస్థలోని శకాలాలే. ఈ నేపథ్యంలో అగ్ర/వెనకబడిన/ అణిచివేతకు గురవుతున్న కుల, మత, ప్రాంత, జాతి తదితర అస్తిత్వాలన్నీ గతంలో హిందూ మతం నిర్వచించిన సాంఘిక విభజన పునాదిగా ఏర్పడినవిగానే పరిగణించాలి. దాంతో కుల అస్తిత్వ వాదమేదైనా సారాంశంలో శకల మతవాదమే. అది తన ప్రయోజనాల కోసం, రాజకీయాధికారంలో వాటా కోసం మతవాద సంస్థలతో సహా ఎలాంటి వర్గ సంపుటిలోనైనా కలసి పోయేందుకు సిద్ధపడు తున్న అనుభవాలు అనేకం ఉన్నాయి. జాట్ కులం 8వ శతాబ్దిలో అస్పృశ్యులు గాను, 11వ శతాబ్దం నాటికి వారు శూద్ర వర్ణంగాను, 17 శతాబ్దంలో క్షత్రియ వర్ణంగాను సంస్కృతీకరణ గురైనట్లు చరిత్ర. నాటి సంస్కృతీకరణ క్రమం దారి తప్పినా, నేడు విడివిడి (శకల మత) సమూహాలుగా సంఘటితమై సామాజిక న్యాయం పేరిట రాజకీయా ధికారంలో వాటాకోసం తీవ్రంగా పోటీపడు తున్నాయి. ఆధి పత్యంలో ఉన్న అగ్రవర్ణ, మెజారిటీ మత అస్తిత్వాలు ఆధికార సుస్థిరత కోసం సాయుధ హిందుత్వ శక్తులుగా సంఘటితమవుతుంటే, వారి దాష్టీకానికి, విద్వేష కాండకు వెరసిన దళిత, బహుజన, మైనారిటీ వర్గాలు సైతం ఆత్మరక్షణ కోసం సాయుధ బలగాలను ఏర్పరచుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. అలాంటి ప్రయత్నాలు తరతమ స్థాయిల్లో జరుగుతున్నాయి కూడా. సమ్మిళిత న్యాయం, స్వేచ్ఛ, భద్రత నినాదంతో సరికొత్త సామాజిక ఉద్యమంగా ఒక అంతరాష్ట్ర ఇస్లామిక్ మిలిటెంట్ సంస్థ 2016లో ఆరెస్సెస్ తరహా శిక్షణతో కేరళలో ఆవిర్భవించింది. ఈ మధ్యకాలంలో మధ్యప్రదేశ్‌లోని తెకాన్‌పూర్‌లో జరిగిన డీజీపీ స్థాయి వార్షిక జాతీయ సమావేశంలో పీఎఫ్‌ఐని నిషేధించాలని ఆ రాష్ట్ర పోలీస్ అధిపతి ప్రతిపాదించడం సంచలనం సృష్టించింది.

(మిగతా రేపు)

కవిత

కళ్ళకు కలర్ లెన్సులు

మాటల మాంత్రికుడని అనిపించు
కోవటానికి అబద్ధపు శబ్దాలను అందంగా పేర్చి
ప్రదర్శిస్తే అది పిట్టల దొర పదవాటమే కాని
పరిపూర్ణ వివేకమైన ప్రసంగ మవదు.

ఎదుటి వాడు ఎదుగుతున్నాడని ఎదలు
బాదుకుంటే బీపి షుగర్లు రానవసరం లేదు మన
పతన పతాకాన్ని ఎగరెయ్యటానికి చెదలుకు
తెలీదు చెక్కను తుక్కు చేస్తున్నానని.

ఇతరుల ఆనందాన్ని అందిపుచ్చు
కోవటానికి పోటీ పడటం నేరమేమి కాదు,
కాని ఆనందాన్ని అనుభవించలేని అనా
రోగ్యం నీకుందనే వాస్తవాన్ని కప్పుచ్చటానికి
చేసే కపట వికటాహసమే దయనీయం

అంతర్వర్తన అనాలోచిత అలజడితో
దహించకుండానే కుమిలి కమిలి పోతుంది
దేహం. సహజ స్వభావంతో సంతోషాన్ని
స్వాగతిస్తే ఉల్లాసం ఉత్సాహం ఉప్పొంగుతుంది
మనస్సు ఊట చెలిమెలా

కళ్ళకు కలర్ లెన్సులొద్దు మనస్సును
మనంకాని శూన్య లోకాన్ని దర్శింపజేస్తది, అది
గ్రాఫిక్సులా మనం చూసేది చేసేది నిజమనే
భ్రమతో తరింపజేస్తది, జగమంత కుటుంబం
మనది ఏకాకి జీవితం ఎందుకు?

- యాదయ్య కొప్పోలు
9494273703

మార్క్సిస్టు జ్ఞాన కోశంలో కలికితురాయి

ఇటీవల విజయవాడ, హైదరాబాద్ నగరాలలో పుస్తక ప్రదర్శనలు జరిగాయి. ప్రపంచవ్యాప్తంగా రకరకాల భాషలలో ప్రచురించిన కొన్ని పుస్తకాలు పాఠకులకు లభించాయి. ఈ పుస్తక ప్రదర్శనలోనే ప్రముఖ మార్క్సిస్టు రచయిత తోలేటి జగన్మోహన్ రావు రాసిన 'మార్క్సిజం- ప్రశ్నలు-సమాధానాలు' అనే 85 పేజీల పుస్తకం (వెల. రూ.60 రూపాయలు) మార్క్సిస్టు జ్ఞాన కోశాగారంలో కలికితురాయిగా నిలుస్తుంది. గతంలో కూడా ఈ రచయిత రెండో ప్రపంచ యుద్ధంలో రష్యా, మేం మళ్ళీ వస్తాం, ప్రజాస్వామ్యవాది స్టాలిన్, సోవియట్ యూనియన్‌లో స్త్రీల పరిస్థితి తదితర పుస్తకాలు రాసారు.



తెలుగులో రాసిన ఈ పుస్తకం మార్క్సిజంను తెలుసుకోవాలని ఆసక్తి ఉన్న ప్రతి పౌరుడు తన భాషలోకి అనువదించుకుని చదవాల్సిన పుస్తకం రాసిన తోలేటి జగన్మోహన్ రావు అభినందనీయులు. మార్క్సిజానికి ప్రాథమిక జ్ఞానమై ఏడు అధ్యాయాలు 1. మార్క్సిజం అంటే 2. మార్క్సిస్టు తత్వశాస్త్రం చారిత్రక భౌతికవాదం, 4. పెట్టుబడిదారీ వ్యవస్థ, 5. పెట్టుబడిదారీ విధానంలో సామ్రాజ్యవాదదశ, 6. శాస్త్రీయ సోషలిజం, 7. రాజ్యం, వర్గ నియంతృత్వంతో కూడిన పుస్తకంలో ప్రపంచవ్యాప్తంగా మార్క్సిజం ఎలా పుట్టింది, పెరిగింది అనే విషయాలు చాలా స్ప ష్టంగా తెలియజేసింది. ఇంకా రెండు అనుబంధాలు జోడించిన ఈ పుస్తకంలో మొదటిది మార్క్సిస్టు పరిభాషలో ఉపయోగించే పదాల అర్థాలు తెలియజేస్తున్నది. రెండవది-ప్రపంచీకరణ నేపథ్యంలో దేశంలోనే అత్యంత పేదరికం అనుభవిస్తున్న జిల్లా అయిన అనంతపురంలోని ఒక పరిశ్రమ యాజమాన్యం, కార్మికవర్గం పట్ల, మహిళా కార్మికవర్గం పట్ల అనుసరించిన, అనుసరిస్తున్న దుర్మార్గ విధానం గూర్చి సవివరంగా వున్నది. ఈ పుస్తకం చదివితే ఆకాశంలో, జీవితంలో, ఉద్యమాల్లో సగభాగమైన మహిళలకు ఈ దుర్మార్గ వ్యవస్థ ఎంత అన్యాయం చేస్తున్నదో కళ్ళు చెమర్చుతాయి.

పుస్తకంలోని ఏడు అధ్యాయాల్లో గతితార్కిక భౌతికవాదం, చారిత్రక భౌతికవాదం, రాజకీయ అర్థశాస్త్రం శాస్త్రీయ సోషలిజాలకు సంబంధించిన మౌలిక ప్రశ్నలను తనకు తానుగా సగటు మార్క్సిస్టు విద్యార్థి గా వేసుకుని విషయాన్ని క్లుప్తంగా, సంక్షిప్తంగా వివరిస్తూ సమాధానాలు వివరించారు. చాలా సరళమైన తెలుగు భాషలో సమాధానాలు వివరించిన విధానం చాలా అద్భుతంగా ఉంది. ప్రకృతి నియమాలు, మార్క్సిస్టు దృక్పథం మౌలిక గతితార్కి నియమాలు- 1. వైరుధ్య నియమం, 2.పదార్థం అభావం అభావం చెందడం, 3. పదార్థం పరిమాణాత్మక మార్పు నుంచి గుణాత్మక మార్పు, గుణాత్మక మార్పు నుంచి పరిమాణాత్మక మార్పు చెందుతుందనే విషయాలు ప్రత్యక్షంగా చెప్పకనే అంతస్సారాన్ని వివరించారు. మార్క్సిజం లెనినిజం సారాంశాంతో పాటు సోవియట్ యూనియన్ రెండో ప్రపంచయుద్ధంలో నిర్వహించిన పాత్రను చక్కగా వివరించినా, సోవియట్ యూనియన్ లోని శాస్త్రీయ సోషలిజం ఎగువదశకు పోకముందే ఎందుకు కూలిపోయిందనే విశ్లేషణ మాత్రం మార్క్సిస్టు విశ్లేషణకు అతీతంగా వున్నది. ప్రపంచ వ్యాప్తంగా మార్క్సిజాన్ని సమీక్షించిన రచయితలెందరో ఉన్నారు. సోవియట్ యూనియన్, హలెండు, పోలెండు లాంటి తూర్పు యూరప్‌లోని దేశాలు, ఆసియా ఖండంలోని చైనా దేశంలో సోషలిజం స్థాపన ఎందకు విఫలమయ్యిందనే విషయం మీద తమ సమీక్షలు చేశారు. ఒక్కొక్కరు ఒక్కొక్క తీరుగా సమీక్షించగా బాలగోపాల్ వంటి వారు ప్రముఖ మనోవిశ్లేషణ నిపుణులైన డాక్టర్ సిగ్మండ్ ఫ్రాయిడ్ అవగాహనను పరిగణనలోకి తీసుకున్నారు. అతని అవగాహన తప్పిన మార్క్సిజం ఆధారంగా పోరాడి అసువుల బాసిన నల్లా ఆదిరెడ్డి, ఎర్రంరెడ్డి సంతోష్ రెడ్డి లాంటి వారు ప్రత్యక్షంగా, తమ కలం పేరుతో వివిధ రచనలు చేసి తెలుగు సమాజానికి అందించారు. సోవియట్ యూనియన్ సోషలిజం విఫలం అయిన విధానం గూర్చి విశ్లేషణ తప్ప మిగతా పుస్తకం అంతా చాలా చక్కగా వున్నది.

గత 15 సంవత్సరాలుగా నేను కొత్తగా ఉద్యమాల్లోకి వస్తున్న యువతకు ఇస్తున్న సలహా మూడు పుస్తకాలు మార్క్సిస్టు తత్వశాస్త్రం, మార్క్సిజం లెనినిజం మావోయిజం (న్యూ విస్టాస్ ప్రచురణలు), రాజకీయ అర్థశాస్త్రం (శ్రామిక వర్గ ప్రచురణలు) మొదటగా చదవాలని, ఇపుడు ఆ మూడు చదివే ముందు తోలేటి జగన్మోహన్‌రావు పుస్తకాన్ని చదివి ఆ మూడు చదవండి అని సలహా ఇస్తున్నాను. అటువంటి ఈ పుస్తకం ప్రతి ఒక్కరు, ముఖ్యంగా నేటి యువత చదవాలని కోరుతున్నాను.

చిక్కుడు ప్రభాకర్
8500810630

మన లేఖలు

ఎంపీ కవితకు అభినందనలు

1993 జూన్ 30 అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు పెదపల్లి-నిజామాబాద్ రైలుమార్గానికి శంకుస్థాపన చేశారు. దానికి నిధుల మంజూరులో ఇంతవరకు కేంద్రం శీతకన్ను వేసింది. ఈ సమస్యపై దృష్టిపెట్టి కేంద్రంతో చర్చలు జరిపి పదికోట్ల రూపాయలు మంజూరు చేసేలా కృషిచేసినందుకు నిజామాబాద్ ఎంపీ కవితకు కృతజ్ఞతలు. ఈ రైలు మార్గం పూర్తయితే వాణిజ్యం ఎంతోఅభివృద్ధికి అవకాశం ఏర్పడుతుంది.

- కోలిపాక రాణి శ్రీనివాస్,
తెలంగాణ జాగృతి సంఘం, బెల్లంపల్లి

ఇసుక లారీల ప్రమాదాలను అరికట్టాలి

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఇసుక లారీల ప్రమాదాలు నిత్యం పెరిగిపోతుండడంతో వాహనదారులు ప్రధాన రహదారి మీదకు రావాలంటేనే జంకుతున్నారు. జయశంకర్ జిల్లాలోని కాళేశ్వరం క్వారీ నుంచి ఇసుక లారీల ద్వారా హైదరాబాద్‌కు తరలివెళ్తోంది. నిత్యం సుమారు అయిదువేల లారీలు ఇసుకను రవాణా చేస్తున్నాయి. ఇసుక లారీల డ్రైవర్లు మద్యం సేవించడం, ఓవర్ టేకింగ్ చేయడం, మితిమీరిన వేగంతో నడపడం వల్ల రోడ్డుమీద వెళ్ళే వారి ప్రాణాలు గాలిలో కలిగిపోతున్నాయి. వారంరోజుల క్రితం మోరంచపల్లి వద్ద ముందు బైక్‌పై వెళ్తున్న ప్రైవేటు అధ్యాపకుడు రవీందర్ దంపతుల మీదికి లారీ దూసుకు వెళ్లడంతో ఆయన ప్రాణాలు కోల్పోగా, భార్య చావుబతుకుల మధ్య కొట్టుమిటాడుతూ కోమాలోకి వెళ్లింది. లారీలను నిలుపుదల చేయాలని ఆయా గ్రామాల ప్రజలు పదిగంటల పాటు ధర్నాచేయడంతో సుమారు 20 కి.మీ వరకు వాహనాలు నిలిచిపోయాయి. అధికారులు జోక్యం చేసుకుని మృతుని కుటుంబాన్ని ఆదుకుంటామనడంతో ధర్నా విరమింపచేశారు. తాజాగా గణపురం మండలం కుందయ్యపల్లి గ్రామం వద్ద రోడ్డుపై వెళ్తున్న బిల్ల మల్లారెడ్డి అనే పేదరైతుపై ఆదివారం రాత్రి ఇసుకలారీ దూసుకెళ్లడంతో అక్కడికక్కడే మరణించారు. రవాణా శాఖ అధికారుల తనిఖీలు లేకపోవడం, పోలీసుల నిర్లక్ష్యం, రోడ్డుపై స్పీడు బ్రేకర్లు లేకపోవడంతో ప్రమాదాలకు కారణంగా నిలుస్తున్నాయి. ప్రభుత్వం కూడా ఆదాయం వస్తోందని చూస్తోందే తప్ప అమాయక ప్రజల ప్రాణాలను పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం, అధికారులు తక్షణమే స్పందించాలి.

- కామిడి సతీష్‌రెడ్డి
జడలపేట, జయశంకర్ భూపాలపల్లి జిల్లా

మనం
కుటుంబం
గురువారం, 22 ఫిబ్రవరి 2018
www.manamnews.com

నాప్కిన్స్ ఫ్రీ
..మాకు ఓటేస్తే

మమ్మల్ని గెలిపించండి.. మీకు ఫ్రీగా శానిటరీ నాప్కిన్స్ ఇస్తామంటోంది కాంగ్రెస్ పార్టీ. ఎన్నికలంటేనే ఆకర్షణీయమైన పథకాలను ప్రకటించే ఓట్ల పండుగగా మారిన మనదేశంలో ఆఖరికి నాప్కిన్స్ కూడా ఎన్నికల అంశంగా మారాయంటే దానికున్న ప్రాధాన్యత ఏమిటో అర్థం చేసుకోవాలని కాంగ్రెస్ మహిళా విభాగం నొక్కి చెబుతోంది. మేఘాలయ రాష్ట్ర అసెంబ్లీకి జరుగుతున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మహిళా ఓటర్లను ఆకట్టుకునేందుకు ఈ పథకాన్ని ప్రకటించింది. రాష్ట్రంలోని అత్యధిక శాతం మహిళలకు నాప్కిన్స్ కొనే ఆర్థిక స్థోమత లేకపోవడంతో హైజీనిటీకి సంబంధించిన సమస్యలు ఎదుర్కొంటున్నారని జాతీయ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సుష్మితా దేవ్ ఎన్నికల ప్రచారంలో ప్రకటించడం విశేషం.



సుష్మిత # అగ్గి బరాటా



"If they can make films tax-free, why not sanitary napkins?"
- Sushmita Dev

కాంగ్రెస్ పార్టీలో యంగ్ వుమెన్ లీడర్‌గా, చురుకైన ఎంపీగా తరచూ పలు అంశాలపై గళమెత్తే సుష్మిత ఈశాన్య రాష్ట్రాల తరపున తన గొంతుక వినిపించడంలో ఎప్పుడూ ముందుంటారు. రాజకీయ అంశాలతోపాటు విద్యార్థుల, మహిళల సమస్యలను సరైన వేదికలపై సరైన సమయంలో లేవనెత్తే సుష్మిత, నిత్యం పలు టీవీ చానెళ్లలో లైవ్ డిబేట్లలో హుషారుగా పాల్గొంటూ, ప్రత్యర్థి పార్టీకి ఛాలెంజ్‌లు విసురుతుంటారు. కాంగ్రెస్ ఫైర్ బ్రాండ్‌గా పేరుగాంచిన సుష్మిత అసోంలోని సిల్‌చార్ లోక్‌సభ స్థానానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మాజీ కేంద్ర మంత్రి సంతోష్ మోహన్ దేవ్ కుమార్తె అయిన సుష్మితను ''బార్న్ లీడర్''గా కూడా వ్యవహరిస్తారు. లండన్‌లోని కింగ్స్ కాలేజ్‌లో ఎల్‌ఎల్‌ఎం చదివిన సుష్మిత గతంలోనే శానిటరీ ప్యాడ్స్‌పై జీఎస్టీని తొలగించాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం పోరాడుతున్న సుష్మిత తాజాగా చేసిన ప్రకటన విడ్డూరంగా ఉన్నప్పటికీ మహిళా ఆరోగ్యంపై దీని ప్రభావం చాలా ఎక్కువని వైద్యులు భావిస్తున్నారు. ప్యాడ్స్‌పై జీఎస్టీ విధించకపోతే చవకగా సబ్సిడీ ధరలకే ఇవి లభించడంతో, గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద మహిళలు కూడా వీటిని ఉపయోగించే అవకాశం లభిస్తుందనేది సుష్మితా దేవ్ అంతరంగం. ''ప్యాడ్‌మ్యాన్'' సినిమా చలువతో ఇప్పుడు జాతీయ వేదికలపై కూడా నాప్కిన్స్ వాడకం, వీటిపై విధించే పన్నులు వంటి అంశాలపై బాహాటంగా మాట్లాడేవారి సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది.



నాస్కాం @ ఘోష్

నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీసెస్ కంపెనీస్ (నాస్కాం) పగ్గాలు ఎట్టకేలకు ఓ మహిళ చేతికి దక్కనున్నాయి. ఏప్రిల్‌లో నాస్కాం ప్రెసిడెంట్‌గా బాధ్యతలు స్వీకరించనున్న దేబజాని ఘోష్ సరికొత్త చరిత్రను సృష్టించనున్నారు. అమెరికాలో సాఫ్ట్‌వేర్ నిపుణురాలిగా 20 ఏళ్లుగా పనిచేస్తూ, ఇంటెల్ వంటి జెయింట్ కంపెనీల్లో పలు కీలక పదవులు నిర్వహించిన ఘోష్ నాస్కాం ప్రెసిడెంట్‌గా అరుదైన ఛాన్స్ దక్కించుకున్నారు. సాఫ్ట్‌వేర్ అవుట్ సోర్సింగ్‌లో గ్లోబల్ లీడర్లతోపాటు ఐటీ ట్రేడ్ బాడీకి కూడా సారథ్యం వహించనున్న మొట్టమొదటి మహిళగా రికార్డు సృష్టించనున్న ఈమె, 167 బిలియన్ డాలర్లకు పైగా విలువైన సేవలను అందించే ఐటీ కంపెనీలకు ప్రాతినిధ్యం వహించే నాస్కాంను మరింత సమర్థవంతంగా నిర్వహిస్తారనే అంచనాలు ఇప్పటికే వెలువడుతున్నాయి.



ఐటీలో మహిళల దశ మారుతుంది

నాస్కాం మొదలై మూడు దశాబ్దాలైనా ఇప్పటి వరకు మహిళలకు మాత్రం ప్రెసిడెంట్‌గా అవకాశం దక్కలేదు. లింగ వివక్ష అత్యధికంగా ఉండే సాఫ్ట్‌వేర్ రంగంలో ఘోష్ ఈ అంశంపై ప్రత్యేకంగా దృష్టి సారించడం ఖాయంగా మారడంతో ఐటీ రంగంలోని మహిళలకు ఇక మంచిరోజులు వస్తాయని ఈ రంగానికి చెందిన నిపుణులు బల్లగుద్ది చెబుతున్నారు. 2400కు పైగా ఐటీ సంస్థలు ఇందులో సభ్యులుగా ఉండగా, వీరికి సంబంధించిన పలు సమస్యలను చక్కదిద్దే బాధ్యతల బరువును మోసేందుకు ఘోష్ అత్యంత సమర్థురాలిగా అందరి విశ్వాసం చూరగొన్నారు. ఐటీ రంగంలో పనిచేస్తున్న మహిళల పట్ల వివక్ష అత్యధికంగా ఉందని, మెటర్నిటీ లీవ్ వల్ల వీరి కెరీర్‌లో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంటూ, తమకంటే తక్కువ సామర్థ్యం ఉన్న, తక్కువ ఎక్స్‌పీరియన్స్ ఉన్నవారికింద పనిచేయాల్సి వస్తోందని నాస్కాం ఇటీవల చేసిన సర్వేలో వెల్లడైంది. పైపెచ్చు ఎంత సమర్థవంతమైన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అయినా కేవలం మహిళ కావడం వల్లే వీరికి తక్కువ జీతభత్యాలు అందుతున్నాయని కూడా నాస్కాం తేల్చగా, వీటన్నింటినీ ఘోష్ సరిదిద్దుతారని ఐటీ రంగంలో స్థిరపడ్డ కోట్లాది మంది మహిళా ఉద్యోగులు కొండంత ఆశతో ఉన్నారు.



చపాతీలు చేసిన ప్రధాని

సాక్షాత్తు ఒక దేశానికి ప్రధానమంత్రి. అయినా.. సిక్కు సంప్రదాయాన్ని తు.చ. తప్పకుండా పాటిస్తూ సతీసమేతంగా స్వర్ణదేవాలయంలో 'సేవ'లో భాగంగా అక్కడి సామూహిక వంటశాలలో చపాతీలు చేశారు. ఆయనెవరో కాదు.. కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడూ. ప్రపంచవ్యాప్తంగా సిక్కులకు పరమ పవిత్ర ఆలయమైన స్వర్ణ దేవాలయాన్ని సందర్శించి.. ఆనందంతో ఉబ్బి తబ్బిబ్బయ్యారు. ఈ సందర్భంగా అక్కడి విజిటర్స్ బుక్‌లో తన భావాలను కూడా రాశారు. ''ఇంత అందమైన, అర్థవంతమైన ప్రదేశంలో నన్ను ఇంత బాగా స్వాగతించడం అపార గౌరవం. ఇందుకు ఎంతగానో సంతోషిస్తున్నాం'' అని ఆయన పేర్కొన్నారు. తన భార్య, పిల్లలతో కలిసి ఆయన ఈ ఆలయాన్ని సందర్శించారు.




ఇండియన్ ఎథ్నిక్ వేర్‌లో కుటుంబ సభ్యులంతా సందడి చేస్తూ భారతదేశమంతా కలియతిరుగుతూ, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులను హ్యాపీగా కలుసుకుంటున్న ట్రూడూ ఫ్యామిలీ ఇప్పుడు మోస్ట్ ట్రెండింగ్ ఫ్యామిలీగా ఇంటర్నెట్‌లో మారుమోగుతోంది.



సారీ చెప్పిన పీఎం

1914 సంవత్సరంలో పంజాబ్ నుంచి జపాన్‌కు చెందిన కొమగటా మరు అనే నౌకలో వచ్చిన 376 మంది ప్రయాణికులను కెనడాలో దిగడానికి నాటి ప్రభుత్వం అనుమతించలేదు. వారిలో ఎక్కువ మంది సిక్కులే ఉన్నారు. ప్రయాణికులు దిగేందుకు అనుమతి లేకపోవడంతో.. వాస్తవానికి హాంకాంగ్ నుంచి వాంకోవర్ వెళ్లాల్సిన ఆ నౌక.. బలవంతంగా తిరిగి బ్రిటిష్ ఇండియాకు వెళ్లిపోవాల్సి వచ్చింది. ఈ ఘటనపై రెండేళ్ల క్రితం కెనడా పార్లమెంటులో ప్రధాని ట్రూడూ క్షమాపణ చెప్పారు. ''ఇప్పటికి కొమగటా మరు ఘటన జరిగి 102 సంవత్సరాలైంది. నాడు ఆ నౌకలో వచ్చిన ప్రయాణికులు కూడా లక్షలాది మంది శరణార్థులలాగే తమకు, తమ కుటుంబ సభ్యులకు మెరుగైన జీవనం కావాలని అనుకున్నారు. తమ కొత్త ఇల్లయిన కెనడాను అభివృద్ధి చేయాలని వాళ్లు కోటి ఆశలతో వస్తే.. వాళ్లకు ఆశ్రయం ఇవ్వడంలో మనం విఫలమయ్యాం'' అని ఆయన అన్నారు. ఖలిస్థాన్ ఉద్యమకారులకు కెనడా ప్రభుత్వ వర్గాలు అనుకూలంగా ఉన్నాయంటూ గతంలో విమర్శలు రావడంతో, నష్టనివారణ కోసం ట్రూడూ ఈసారి తన పర్యటనలో... తాము సమైక్య భారతానికే కట్టుబడ్డామని, ఉగ్రవాదం అణచివేతే లక్ష్యమని మరీ మరీ చెప్పారు. కెనడాలో దాదాపు 5 లక్షల మందికి పైగా సిక్కులు స్థిరపడ్డారు. అత్యధిక సిక్కులకు పర్మినెంట్ రెసిడెన్స్ కూడా ఉండటంతో ఎన్నికల్లో కొన్ని స్థానాల్లో వీరు గెలుపోటములు కూడా నిర్ణయించే స్థితికి చేరుకున్నారు. అంతేకాదు సిక్కు ఎంపీలు కూడా ఈ దేశంలో ఉన్నారు.

ఇక సిమ్ నంబర్‌లో 13 అంకెలు



(మొదటిపేజీ తరువాయి)

అంకెల ఫోన్ నంబర్లు కొనసాగుతాయి. కేవలం మెషీన్-టు-మెషీన్ (ఎం2ఎం) సర్వీసులకు వినియోగించే సిమ్ కార్డులకు మాత్రమే కొత్త విధానం అమలులోకి వస్తుంది. పీవోఎస్ యంత్రాలు, క్రెడిట్/డెబిట్ కార్డుల స్వైపింగ్‌కు వినియోగించే అన్ని బ్యాంకుల మెషీన్లు, విద్యుత్ బిల్లు తీసే యంత్రాలు, అధునాతన కార్లు, ఫ్రిజ్‌లల్లో ఇంటర్నెట్ ఆధారిత కమ్యూనికేషన్‌కు వినియోగించే సిమ్ కార్డులను ఎం2ఎం సర్వీసు సిమ్‌లు అంటారు. ట్రాఫిక్ నియంత్రణ, లాజిస్టిక్ సేవలు, రోబోటిక్ వ్యవస్థలు, రిమోట్ కంట్రోల్, వేర్‌హౌస్ మేనేజ్‌మెంట్, ఐవోటీ రంగాల్లోనూ సమాచార మార్పిడికి ఈ ఎం2ఎం కమ్యూనికేషన్ సర్వీసులను వినియోస్తారు. ఆయా సేవల్లో సమాచార భద్రత దృష్ట్యా టెలికాం శాఖ తాజా నిర్ణయం తీసుకుంది. ఇప్పటి వరకు ఉన్న సాధారణ 10 అంకెల సిమ్ కార్డులను 13 అంకెలకు మార్చాలని నిర్ణయించింది. ఈ మేరకు జూలై 1 నుంచి కొత్త విధానాన్ని అమలులోకి తేవాలని అన్ని టెలికాం కంపెనీలకు ఈ నెల 9న కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు పంపింది. అప్పటి నుంచి కొత్త ఎం2ఎం సర్వీసులకు తప్పనిసరిగా 13 అంకెల సిమ్‌లనే ఇవ్వాలని సూచించింది. ఇప్పటికే వినియోగిస్తున్న 10 అంకెల సిమ్‌లనూ మార్చాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ మార్పిడి కార్యక్రమాన్ని ఈ ఏడాది అక్టోబరు 1న మొదలు పెట్టి డిసెంబరు 31 కల్లా పూర్తి చేయాలని ఆదేశించింది. దీనికి సంబంధించిన ఉత్తర్వులు తమకు అందాయని, అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని బీఎస్ఎన్ఎల్, భారతీ ఎయిర్‌టెల్ వంటి సంస్థలు ధ్రువీకరించాయి. ఆ మేరకు ఎం2ఎం కమ్యూనికేషన్‌లో స్పెక్ట్రమ్, రోమింగ్, క్యూవోఎస్‌కు సంబంధించి మార్పులపై తీసుకుంటున్న చర్యలపై ట్రాయ్‌కు లిఖిత పూర్వకంగా స్పందన కూడా తెలిపినట్లు ఎయిర్‌టెల్ వివరించింది.

రోజంతా వదంతుల హోరు

ఈ నూతన 13 నంబర్ల విధానంపై బుధవారం రోజంతా వదంతులు వ్యాపించాయి. ఈ విధానంతో ఇక అన్ని మొబైల్ నంబర్లు 13 అంకెలతో వచ్చేస్తున్నాయి. తప్పనిసరిగా సాధారణ ప్రజలు కూడా సిమ్ కార్డులు మార్చుకోవాల్సిందేనంటూ సోషల్ మీడియాలో వార్తలు హల్‌చల్ చేశాయి. జూలై 1 నుంచి అందరూ మళ్లీ కొత్త సిమ్‌లు తీసుకోవాలని వార్తలొచ్చాయి. ముఖ్యంగా తొలిగా బీఎస్ఎన్ఎల్ వినియోగదారులు ఈ విధానంలోకి వస్తున్నారనే వార్తలు రావడంతో ఆ సంస్థ అప్రమత్తమైంది. ప్రజల్లోకి తప్పుడు వార్తలు వెళ్తున్నాయని గుర్తించి వాటిని ఖండించింది. సాధారణ ప్రజలపై ఎటువంటి ప్రభావం ఉండబోదని, కేవలం ఎం2ఎం వినియోగదారులు మాత్రమే 13 అంకెల సిమ్‌కార్డుల విధానం పరిధిలోకి వస్తారని ట్విటర్ ద్వారా వివరణ ఇచ్చింది.

సాంకేతికతతో మార్పు



(మొదటిపేజీ తరువాయి)

ఉపయోగపడాలని ఆకాంక్షించారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో బుధవారం 'వరల్డ్ ఐటీ కాంగ్రెస్' ముగింపు కార్యక్రమంలో కేటీఆర్ ప్రసంగించారు. ప్రపంచవ్యాప్తంగా కొత్తగా వస్తున్న సాంకేతిక పరిజ్ఞానంపై ఉన్న అనుమానాలు, అపోహలను ఐటీ రంగ నిపుణులు, వ్యాపారవేత్తలు, ప్రముఖులు ఆ సదస్సు ద్వారా నివృత్తి చేశారన్నారు. ప్రపంచ ఐటీ కాంగ్రెస్ విజయవంతంగా ముగిసిందని, కార్యక్రమాన్ని నగరంలో నిర్వహించిన నాస్కామ్, విట్స్‌లకు ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ కృతజ్ఞతలు తెలియజేశారు. సదస్సును దిగ్విజయంగా పూర్తిచేయడంలో సహకరించిన తెలంగాణ ఐటీ శాఖకు, ప్రధానంగా జయేశ్ రంజన్‌కు కేటీఆర్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. వరల్డ్ ఐటీ కాంగ్రెస్‌లో ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్నామని, డాటా సైన్సెస్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌లకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం, నాస్కామ్ సంయుక్తంగా 'సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్'ను ఏర్పాటు చేయబోతున్నామని ప్రకటించారు. దీనిద్వారా విస్త ృతమైన ఉపాధి అవకాశాలు కల్పించాలనే సంకల్పంతో ముందుకు వెళుతున్నామన్నారు. అడోబ్ కూడా ఇక్కడ ఓ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ముందుకు రావడం ఎంతో సంతోషకరమైన విషయమన్నారు. ఇప్పటికే ఇక్కడ ఉన్న ఐటీ సంస్థలకు అడోబ్ కూడా తోడవడం హైదరాబాద్ ఐటీ రంగానికి మరింత ఊపు తీసుకువస్తుందని అభిప్రాయపడ్డారు. సదస్సు ఇంత ఘనంగా ఎప్పుడూ జరగలేదని, ఐటీ కాంగ్రెస్, నాస్కామ్ ప్రతినిధులు తెలిపారన్నారు. తెలంగాణ రాష్ట్రం ఐటీ రంగంలో ఈ సంవత్సరం కొత్త పుంతలు తొక్కుతూ, ప్రపంచవ్యాప్తంగా వస్తున్న కొత్త సాంకేతికతను అందిపుచ్చుకుంటూ.. ముందుకు వెళుతుందని ఆయన అన్నారు. స్టార్టప్ స్టేట్‌గా తెలంగాణ అవతరిస్తోందని పేర్కొన్నారు.

ఆరోగ్యరంగంలో దేశంలోనే ప్రథమస్థానం.

ఆరోగ్యరంగంలో దేశంలోనే తెలంగాణ అగ్రస్థానంలో ఉందని, నిపుణులైన వైద్యులు ఇక్కడ అందుబాటులో ఉన్నారని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. సాంకేతికతను ఉపయోగించుకుని గ్రామాల్లో కూడా నాణ్యమైన వైద్యాన్ని అందిస్తున్నామని, ప్రతి ఆసుపత్రిలో మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. వైద్యరంగంలో టెలీమెడిసిన్ అందుబాటులోకి తీసుకు వచ్చిన రాష్ట్రం తెలంగాణానే ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. మైక్రోసాఫ్ట్ సంస్థ సాయంతో చిన్నారులకు కంటి వ్యాధుల నివారణకు ఎల్వీప్రసాద్ సంస్థ ఆధ్వర్యంలో స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించనున్నామని తెలిపారు.

ఏ స్థితిలోనైనా పంటలు పండాలి..

ఆహార కొరత ప్రపంచాన్ని వేధిస్తున్న ఒక సమస్యని, కొత్త సాంకేతికతో ఆహార సమస్య లేకుండా చేయొచ్చని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. వ్యవసాయరంగంలో కూడా తెలంగాణ ప్రభుత్వం టెక్నాలజీ వినియోగించడం ద్వారా మెరుగైన ఫలితాలు రాబడుతున్నామని, రైతులకు ఉపయోగపడేలా సాంకేతికతను తీర్చిదిద్దాలని, భవిష్యత్‌లో ఎలాంటి పరిస్థితుల్లోనైనా పంటలు పండించేలా సాంకేతికత వస్తుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. వైద్య, వ్యవసాయ రంగాల్లో పెట్టుబడులు పెట్టాల్సిన అవసరం ఉందన్నారు.

విద్యారంగంలో టెక్నాలజీ..

విద్యారంగంలో కూడా సాంకేతికతను ఉపయోగించబోతున్నామని, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఇది ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. ఇప్పటికే రాష్ట్రంలోని మూడు వేల పాఠశాలల్లో డిజిటల్ క్లాసులు ప్రారంభించామని ఆయన తెలిపారు.

ఈ ఏడాదిలోనే బ్రాడ్‌బ్యాండ్..

సాంకేతికతను ఉపయోగించుకుని కోట్లాది మంది ప్రజల సంక్షేమం దిశగా దష్టి సారించాల్సిన అవసరం ఉందని, సాంకేతికత పరిజ్ఞానంపై 450 కోట్ల మంది ప్రజలు ఆధార పడ్డారని ఆయన వ్యాఖ్యానించారు. ఈ ఏడాది చివరి నాటికి అందరికీ బ్రాడ్‌బ్యాండ్ సదుపాయం అందిస్తామని, రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్‌ఇవ్వడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. 15ఎంబీపీఎస్ స్పీడ్‌తో గ్రామాలు, పాఠశాలలు, ఆసుపత్రులకు ఇటర్నెట్ సేవలు అందిస్తామన్నారు. జాతీయ సగటు కంటే గత మూడు సంవత్సరాల నుంచి తెలంగాణ ఐటీ రంగం 5 శాతం ఎక్కువగా ఉందని, భవిష్యత్తులో కూడా మరింత అభివృద్ధి దిశగా ముందుకు వెళుతుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ద్వితీయ శ్రేణి నగరాల్లో కూడా ఈ ఏడాదిలో ఐటీ పరంగా ఎంతో పురోగతి సాధిస్తామన్నారు. మహబూబ్‌నగర్ మినహా కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం, వరంగల్ నగరాల్లో ఐటీ హబ్స్ నిర్మాణాలు పూర్తయ్యాయని, వాటిల్లో టాస్క్ కేంద్రాలను కూడా ప్రారంభిస్తున్నామని తెలిపారు. ద్వితీయ శ్రేణి నగరాల్లోని యువతకు ఓ వైపు స్కిల్స్‌ను పెంచుతూ, ఐటీలో ఉద్యోగ అవకాశాలను కల్పించే విధంగా కార్యచరణ కొనసాగిస్తున్నామన్నారు. టీ హబ్ రెండో దశ కూడా ఈ సంవత్సరం ప్రారంభం కాబోతుందన్నారు. భారతదేశంలోనే అతిపెద్ద ప్రోటో టైప్ ల్యాబ్ 'టీ వర్క్స్' జూన్ వరకు పూర్తి కాబోంతందని తెలిపారు.



తైవాన్‌తో తెలంగాణ ఒప్పందం

సదస్సు ముగిసిన అనంతరం తైవాన్‌లోని తోయూవాన్ నగరం, హైదరాబాద్ మధ్య అవగాహన ఒప్పందం జరిగింది. ఐవోటీ ఆధారిత సేవ విషయంలో పరస్పర సహకారం కోసం ఈ ఒప్పందం జరిగిందని మంత్రి తెలిపారు. గురువారం నుంచి బయో ఏషియా సదస్సు జరగుతుందన్నారు. ఈ నెల 26,27 తేదీల్లో ఈ-గవర్నెన్స్‌పై జాతీయ సదస్సు ఉంటుందన్నారు. మార్చి 8.. మహిళా దినోత్సవాన్ని పురస్కరించకుని ఆ రోజున మహిళా పారిశ్రామిక వేత్తల హబ్‌ను ప్రారంభిస్తున్నామన్నారు. మార్చి 8 నుంచి 11 వరకు వింగ్స్ ఇండియా సదస్సు జరుగుతుందన్నారు.

డిప్రెషన్..పెద్ద సమస్య

అంటువ్యాధిలా విస్తరిస్తోంది.. బాధితులకు అండగా నిలవాలి

- **నేనూ కుంగుబాటుకు లోనయ్యా**
- **అప్పుడు అమ్మ అండగా ఉంది**
- **బాలీవుడ్ నటి దీపికా పదుకొణె**
- **'వరల్డ్ ఐటీ కాంగ్రెస్'లో ప్రసంగం**



హైదరాబాద్, ఫిబ్రవరి 11 (మనం ప్రతినిధి): డిప్రెషన్ నుంచి బయటపడాలనుకునే ఆలోచనే మనల్ని సగం గెలిపిస్తుందని, ఈ విషయంలో తల్లిదండ్రుల సహకారం చాలా అవసరమని, డిప్రెషన్ నుంచి తాను బయటపడ్డానంటే అదంతా తన తల్లి సహకారమే అని బాలీవుడ్ నటి దీపికా పదుకొణె అన్నారు. ప్రపంచ ఐటీ సదస్సు ముగింపు కార్యక్రమంలో విప్రో బోర్డు సభ్యులు రిషద్ ప్రేమ్‌జీతో ముఖాముఖిలో దీపిక పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'మానసిక ధృడత్వం - సమయస్ఫూర్తి' అంశంపై ఆమె మాట్లాడారు. కుంగుబాటు ప్రపంచ వ్యాప్తంగా ఓ అంటువ్యాధిలా మారుతోందని, సామాజిక చైతన్యంతోనే కుంగుబాటుకు పరిష్కారం లభిస్తుందన్నారు. కుంగుబాటులో ఉన్నప్పుడు తను ఎలాంటి వేధనను అనుభవించిందో, దాన్నుంచి బయటపడటానికి, అధిగమించడానికి ఏమేం చేసిందో ఆమె చెప్పుకొచ్చారు. కుంగుబాటును అధిగమించేందుకు చాలా దారులుండొచ్చనని, అయితే తాను మాత్రం రెగ్యులర్‌గా కౌన్సిలింగ్ సెషన్‌లకు హాజరయ్యానని, మెడికేషన్ ద్వారా మళ్లీ మామూలు మనిషిని అయ్యానని దీపిక చెప్పారు. తన కుటుంబ సభ్యుల సహకారం లేకుంటే ఈరోజు ఈ స్థాయిలో ఉండేదాన్ని కాదని దీపిక అన్నారు. పిల్లలు ఎలా ఉంటున్నారో గమనించడంలో తల్లిదండ్రులు పాత్ర చాలా కీలకమని ఆమె అభిప్రాయపడ్డారు. డిప్రెషన్ అనేది చిన్న సమస్య కాదని, ఇది కేవలం ఓ దేశానికి పరిమితమైంది కాదని, ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మంది దీన్ని ఎదుర్కొంటున్నారని అన్నారు. నిత్యం మనతో కలిసి ఉండేవారు ఏం చెబుతున్నారో, ఏం చేస్తున్నారో గమనిస్తూ ఉండాలని సూచించింది. వారిలో వస్తున్న మార్పులేమిటో గమనిస్తూ.. చిరాకు, కుంగుబాటు లక్షణాలు గుర్తిస్తే వెంటనే అప్రమత్తమవాలని, వారికి అండగా నిలవాలని చెప్పింది. ప్రతిఒక్కరూ తాను ఒంటరిననే భావనను దరిచేరనీయకుండా చూసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం యువత ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో డిప్రెషన్ ఒకటని, వారిని అందులోంచి బయట తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో మానసిక ఆరోగ్య సమస్యల పరిష్కారం, అవగాహన దిశగా 'లివ్ లవ్ లాఫ్' సంస్థ పని చేస్తుందని ఈ సందర్భంగా చెప్పుకొచ్చారు. డిప్రెషన్ అంటే ఎలా ఉంటుందో, దాన్ని అధిగమించడం ఎంత కష్టమో తనకు తెలుసుకాబట్టి, ఈ సంస్థ ద్వారా ఒక్క లైఫ్ సేవ్ చేసిన చాలని భావించానన్నారు. సంస్థలు తమ ఉద్యోగుల మానసిక ఆరోగ్యంపై ద ష్టి పెట్టాలని బాలీవుడ్ నటి దీపికా పదుకొనే సూచించారు. మానసిక సమస్యలతో బాధపడుతున్న వారిపై సానుభూతి చూపించాలని కోరారు. ప్రతీ సంస్థలో ఉద్యోగుల మానసిక ఆరోగ్యం కోసం కౌన్సెలర్లు, సైక్రియాట్రిస్ట్ వచ్చి వెళుతుండాలని సూచించింది. ఉద్యోగులు ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలంటే ప్రతీ సంస్థలో ఇలాంటి అత్యవసరమైన సౌకర్యాలు ఉండి తీరాలన్నారు. ఈ రోజు బాలీవుడ్‌లో క్వీన్‌గా వెలుగొందుతున్న దీపికా పదుకుణె ఒకానొక సమయంలో తీవ్ర మానసిక కుంగుబాటుకు లోనై, ఆత్మహత్య కూడా చేసుకోవాలనుకునే విషయం అందరికే తెలిసిందే.

మృత్యు శకటం



(మొదటిపేజీ తరువాయి)

రూపుమారిపోయాయి.. రక్తం మడుగులో నిర్జీవమైన శరీరాలతో జాతీయ రహదారిపై భయానక పరిస్థితి నెలకొంది. ఉదయం ఏడు గంటల ప్రాంతంలో భారీ శబ్దం విని జాతీయ రహదారి వైపు పరుగెత్తుకొచ్చిన కనిమెట్ట గ్రామస్థులకు కనిపించిన భయానక దృశ్యాలివి.. మితిమీరిన వేగంతో దూసుకొచ్చిన కారు అదుపుతప్పి తొలుత డివైడర్‌ను ఆపై ఎదురుగా వస్తున్న కారును ఢీ కొంది. ఈ ఘటనలో రెండు కార్లలోని ఏడుగురు సంఘటనా స్థలంలోనే మరణించగా.. మరో ఇద్దరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస వదిలారు. ఈ దారుణ ఘటనతో కనిమెట్ట గ్రామ సమీపంలో జాతీయ రహదారి నెత్తురోడింది. బుధవారం ఉదయం ఎన్‌హెచ్ 44పై వనపర్తి జిల్లా కొత్తకోట మండలం కనిమెట్ట గ్రామ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఎదురెదురు గా వచ్చిన రెండు కార్లు ఢీ కొన్నాయి. హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు వెళుతున్న టీఎస్ 08 యుఏ3801 నంబరు గల కారు అదుపుతప్పింది. మితిమీరిన వేగం కారణంగా డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో జాతీయ రహదారి మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీ కొట్టింది. అప్పటికీ అదుపుకా క ఎదురుగా వస్తున్న (కర్నూలు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న) టీఎస్ 08ఈక్యూ 8108 నంబరు గల కారును బలంగా ఢీకొట్టింది. దీంతో 3801 కారులో ప్రయాణిస్తు న్న నందిమళ్ల గ్రామానికి చెందిన బీరప్ప(20), మస్తిపురం గ్రామానికి చెందిన మల్లేష్(35), అజ్జకోల్లు గ్రామానికి చెందిన రాజు(40), మూళ్లమళ్ల గ్రామస్థుడు ఆంజనేయులు (35), కర్నూలుకు చెందిన పసన్న(70), రంగారెడ్డి జిల్లా ఉప్పల్‌కు చెందిన సూరిబాబు(50)లతో పాటు మరో మహిళ (వివరాలు తెలియరాలేదు) అక్క డికక్కడే మృతి చెందారు. మిగతావారికి తీవ్ర గాయాలు కావడంతో మహబూబ్ నగర్‌లోని ఆస్పత్రికి తరలించగా.. కల్పన, లంకాల నరేష్‌లు చికిత్స పొందు తూ మరణించారు. ప్రత్యక్ష సాక్షులు తెలి పిన సమాచారం ప్రకారం.. ప్రమాద సమయంలో రెండు కార్లలోనూ 11 మం ది ప్రయాణిస్తున్నారు. మృతుల్లో కర్నూలు జిల్లా వాసులతో పాటు ఆత్మకూర్ మండలం నందిమళ్ల, మస్తిపురం గ్రామ వాసులుగా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు.



వీధిన పడ్డ కుటుంబాలు..

ఈ ప్రమాదంతో మృతుల కుటుంబాలు వీధిన పడ్డా యి. నాచారంలోని మ ల్కాపురంలో పూల వ్యాపారం చేసుకునే కుటుంబాలను రో డ్డు ప్రమాదం తల కిందులు చేసింది. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన రాజుకు భార్య సుజాత, కుమారులు విష్ణు, మనోహర్‌లు ఉన్నారు. బీరప్పకు రెండేళ్ల క్రితమే పెళ్లి చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మల్లేష్‌కు భార్య పద్మ, కుమారుడు శివ, ఇద్దరు కుమార్తెలు ఉన్నట్లు బంధువులు తెలిపారు. ఆంజనే యులుకు భార్య సావిత్రి కూమర్తెలు అను, అలేఖ్య, అక్షిత ఉన్నట్లు తెలిపారు. వీరంతా హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ కాలనీలో నివాసం ఉంటూ మల్కాపురంలో పండ్ల వ్యాపారం చేస్తున్నట్లు వెల్లడించారు.

మిన్నంటిన రోదనలు...

రోడ్డు ప్రమాదం జరిగిన విషయం తెలిసి అక్కడికి చేరుకున్న బాధిత కుటుంబాల రోదన ప్రమాద స్థలంలో గుమికూడిన వారిని కంటతడి పెట్టించాయి. భీతావహ దృశ్యాన్ని, మృతదేహాల పరిస్థితిని చూసి కన్నీరుమున్నీరయ్యారు. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన రాజు సోదరుడు గుండెలవిసేలా రోదించడం చూసి అక్కడి వారి హృదయాలు కలిచివేశాయి.



ఘటనాస్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే, జేసీ

రోడ్డు ప్రమాదం విషయం తె లుసుకున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వరరెడ్డి సంఘటన స్థలానికి చెరుకుని ప్రమాద వివరాలను సీఐ సోమ్‌నారయణ సీంగ్‌ను అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబీకులను ఓదార్చారు. ప్రమాదంలో మృతి చెందిన మృతుల కుటుంబాలకు ప్రగాఢసానుభూతి తెలిపారు. జేసీ నిరంజన్ రావు సంఘటన స్థలాన్ని పరిశీలించి, మృతుల కుంటుంబాలకు సానుభుతి తెలిపారు.

పోలీసుల అత్యుత్సాహం..

మృతదేహాల వద్ద కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న కుటుంబీకుల పట్ల పోలీసులు దురుసుగా వ్యవహరించ డంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. పోలీసుల తీరుపై మృతుల బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దుఃఖంలో ఉన్న వారిపై పోలీసులు దురుసుగా ప్రవర్తించడం ఎమిటంటూ వాగ్వాదం పెట్టుకోవడంతో ఉద్రిక్తత నెలకొనగా.. ఎమ్మెల్యే జోక్యం చేసుకుని సర్ది చెప్పారు.

తెలంగాణలో 'విప్రో'

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (మనం ప్రతినిధి): తెలంగాణకు మరో మెగా ప్రాజెక్టు రానున్నది. రాష్ట్రంలో దాదాపు రూ.220 కోట్ల పెట్టుబడితో సబ్బులు, సౌందర్యసాధనాల యూనిట్‌ను మహేశ్వరం మండలంలో స్థాపించేందుకు ముందుకు వచ్చింది. 40 ఎకరాల్లో నిర్మించనున్న ఈ తయారీ పరిశ్రమ ద్వారా నేరుగా 300 వందల మందికి, పరోక్షంగా మరో 200 మందికి ఉపాధి లభించనున్నది. ప్రపంచ ఐటీ కాంగ్రెస్ సందర్భంగా విప్రో సంస్థ చీఫ్ స్ట్రాటజీ అధికారి రిషద్ ప్రేమ్‌జీతో పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తాము తెలంగాణలో ఒక తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రికి రిషద్ ప్రేమ్‌జీ తెలిపారు.



తన సోదరి పార్థివ దేహానికి నివాళులర్పిస్తున్న సీఎం కేసీఆర్

కేసీఆర్ అక్క విమలాబాయి కన్నుమూత

(మొదటిపేజీ తరువాయి)

కేటీఆర్, ఎంపీ కవితతో పాటు పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. తిరుమలగిరి శ్మశాన వాటికలో విమలాబాయి భౌతికకాయానికి అంత్యక్రియలు నిర్వహించారు. సీఎం కేసీఆర్‌కు ఎనిమిది మంది అక్కలు, ఒక చెల్లె, ఒక అన్న ఉన్నారు. విమలాబాయి కుటుంబం ప్రస్తుతం అల్వాల్‌లోని మంగాపురం కాలనీలో నివాసం ఉంటున్నారు.'

పాక్ దుందుడుకు చర్య

- **నియంత్రణరేఖ సమీపానికి వచ్చిన చాపర్**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: పాకిస్థానీ హెలికాప్టర్ ఒకటి నియంత్రణ రేఖకు అత్యంత సమీపంలోకి వచ్చింది. తమ ఆకాశ మార్గంలోనే నియంత్రణరేఖకు 300 మీటర్ల దగ్గరకు అది వచ్చేసింది. వాస్తవానికి నియంత్రణరేఖకు ఇరువైపులా కిలోమీటరు దూరం వరకు ఫైటర్ విమానాలు గానీ, చాపర్లను గానీ అనుమతించరు. ఉదయం 9.45 గంటల సమయంలో పాకిస్థాన్‌కు చెందిన ఎంఐ-17 హెలికాప్టర్ ఒకటి గుల్బార్ సెక్టార్‌లో కనిపించింది. అది వెంటనే తిరిగి వెళ్లిపోవడంతో రెండువైపుల నుంచి కాల్పులు గానీ ఏమీ చేపట్టలేదని ఒక అధికారి తెలిపారు.

ప్రియా వారియర్‌కు సుప్రీం ఊరట




- **'పాట' వివాదంపై క్రిమినల్ చర్యలకు స్టే**
- **ఎక్కడా కేసులు నమోదు చేయొద్దని ఆదేశం**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: ఒకే ఒక్క పాటతో కుర్రకారు మనసు కొల్లగొట్టి.. ఇంటర్నెట్ సంచలనంగా మారిన ప్రియా ప్రకాశ్ వారియర్‌కు ఆ పాటే వివాదాలు తెచ్చిపెట్టింది. ఆ పాట ముస్లింల మనోభావాలను దెబ్బతీస్తోందంటూ కొందరు కేసుల పెట్టడడంతో ఆమె సుప్రీం కోర్టును ఆశ్రయించగా.. బుధవారం ఊరట లభించింది. నటి ప్రియా ప్రకాశ్, దర్శకుడు అబ్దుల్ ఒమర్‌లపై ఎటువంటి క్రిమినల్ చర్యలు తీసుకోవద్దంటూ స్టే ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే ఇకపై ఈ రాష్ట్రంలోనూ ఈ పాటపై కేసులు నమోదు చేయొద్దని ఆదేశించింది. మలయాళ దర్శకుడు ఒమర్ అబ్దుల్ తెరకెక్కిస్తున్న 'ఒరు ఆదర్ లవ్' చిత్రంలోని 'మాణిక్య మలయార పూవి' పాటను ఈ నెల 13 విడుదల చేసిన విషయం తెలిసిందే. అందులో నటి ప్రియా ప్రకాశ్ వాలు చూపులతో ఇంటర్నెట్ సంచలమైంది. అయితే ఈ పాట మహ్మద్ ప్రవక్త పవిత్ర ప్రేమకు సంకేతంగా పాడుకునేదని, దీన్ని ఈ సినిమాలో వినియోగించడం ముస్లింల మనోభావాలను దెబ్బతీస్తుందని హైదరాబాద్‌లోని ఫలక్‌నుమా సహా మహారాష్ట్రలోని ముంబై, ఔరంగబాద్‌లలో కొందరు కేసులు పెట్టారు. నటి ప్రియా ప్రకాశ్ వారియర్‌తో పాటు దర్శకుడు ఒమర్ అబ్దుల్‌పైనా చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో ప్రియా ప్రకాశ్ మంగళవారం సుప్రీం కోర్టు పిటిషన్ దాఖలు చేసింది. తమపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను కొట్టేయాలని కోరింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. ఈ పాట కేవలం 40 ఏళ్ల నుంచి మాత్రమే కేరళ మలబార్ తీరంలోని ముస్లింలు రాసుకుని పాడుకుంటున్న పాట అని ప్రియా తరఫు లాయర్ కోర్టుకు వివరించారు. ఇది మహ్మద్ ప్రవక్తను కించపరిచినట్లు ఎలా భావించగలమని, ఆ పాట భావాన్ని సరిగా అర్థం చేసుకోలేని వారే ఈ కేసులు పెట్టారని వాదించారు. ఈ తరహా కేసులు భావప్రకటనా స్వేచ్ఛను హరించడమేనని పేర్కొన్నారు. ఈ వాదనతో ఏకీభవించిన న్యాయస్థానం ఆయా కేసులపై స్టే విధించింది.

నన్ను అరెస్ట్ చేయండి ప్లీజ్!

- **నాకు చావాలని లేదు..**
- **స్టేషన్లలో లొంగిపోతున్న నేరస్థులు**
- **యూపీలో వరుస ఎన్‌కౌంటర్లతో.. వణుకుతున్న క్రిమినల్స్**



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: పరారీలో ఉన్న నేరస్థులను పట్టుకోవడానికి పోలీసులు నానా తిప్పలు పడుతుంటారు.. అయినా చాలామంది ఏళ్ల తరబడి 'పరారీ'లోనే ఉంటారు. సాధారణంగా ఏ రాష్ట్రంలోనైనా ఇదే పరిస్థితి కనిపిస్తుంది. కానీ యూపీలో మాత్రం దీనికి భిన్నమైన పరిస్థితి నెలకొంది. తాజాగా.. ఓ హత్య కేసులో నిందితుడు జింజినా పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు. నాకు ఎన్‌కౌంటర్‌లో ప్రాణంపోగొట్టుకోవాలని లేదంటూ 20 ఏళ్ల ముర్షద్ అలీ తెలిపాడు. ఉత్తర ప్రదేశ్‌లోని షామిలి జిల్లాలో చోటుచేసుకుంది. స్టేషన్‌లో ఉన్న పోలీస్ అధికారి సందీప్ బాల్యన్ వద్దకు వచ్చి, తాను ఓ హత్య కేసులో నిందితుడి నని, తనను అరెస్టు చేయాలని రెండు చేతులు జోడించి లబోదిబోమన్నాడు. అంతే కాదు.. తనకు జీవితకారా గార శిక్ష విధించాలంటూ పోలీసులను వేడుకున్నాడు. దీంతో పోలీసులు ఆ యువకుడిని అరెస్టు చేశారు. ఇదొక్కటే కాదు ఏళ్ల తరబడి కొరుకుడు పడని కేసులు కూడా ఇప్పుడు ఇట్టే తేలిపోతున్నాయ్. నేరస్థులను వెతికి పట్టుకునే శ్రమ పడాల్సిన అవసరం లేకుండా నిందితులు తమకు తామే వచ్చి స్టేషన్‌లో లొంగిపోతున్నారు. కరుడుగట్టిన నేరస్థులు కూడా వణికిపోతూ స్టేషన్‌లో లొంగిపోవడం వెనక ఓ భయం ఉంది. బతికుంటే బలుసాకు తిని కాలం గడపొచ్చనే సామెతను యూపీ ప్రభుత్వం వారికి గుర్తొచ్చేలా చేసింది. దీంతో చచ్చినట్లు.. అదే, చావు భయంతో లొంగిపోతున్నారు. రాష్ట్రంలో యోగి సర్కార్ కొలువు దీరాక.. నేరం చేసి తప్పించుకు తిరు గుతున్న వాళ్లను, రౌడీ షీటర్ల ను, గుండాలను చట్ట ప్రకా రం శిక్షించే క్రమంలో పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. పరారీలో ఉన్న నేరస్థు లను పట్టుకునే క్రమం లో ఎన్‌కౌంటర్లకూ వెర వడం లేదు. అధికారిక సమాచారం ప్రకారం.. యోగి ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేసిన తొలి పది నెలల కాలంలో ఏకంగా 1100ల ఎన్‌కౌం టర్లు జరిగాయి. ఇందులో 34 మంది నేరస్థులు ప్రాణాలు కోల్పోగా 265 మంది గాయపడ్డారు. మరో 2,744 మంది నేరస్థులను పోలీసులు అరె స్టు చేశారు. ఇదే కాలంలో నలుగురు పోలీసులు ప్రాణాలు కోల్పోగా, 247 మంది గాయాలపాల య్యారు. ఈ దెబ్బతో నేరస్థుల్లో ప్రాణం మీద తీపి పుట్టుకొచ్చింది.



కొఠారీపై ప్రశ్నల వర్షం

- ప్రశ్నించడం ప్రారంభించిన సీబీఐ
- ప్రధాన కార్యాలయంలోనే విచారణ
- దేశం విడిచి వెళ్లరాదని ఈడీ ఆంక్షలు
- కొఠారీ అండ్‌కోపై పీఎంఎల్ఏ కేసు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: ఏడు జాతీయ బ్యాంకులకు రూ. 3695 కోట్ల అప్పులు ఎగవేసిన కేసులో రోటోమాక్ పెన్నుల కంపెనీ యజమాని విక్రమ్ కొఠారీపై సీబీఐ అధికారులు ప్రశ్నల వర్షం కురిపించారు. తొలుత కాన్పూర్‌లోనే ప్రశ్నించిన అధికారులు.. ఆ తర్వాత ఢిల్లీలోని ప్రధాన కార్యాలయానికి కొఠారీని పిలిపించారు. అయితే అందుకు కారణాలేంటో మాత్రం చెప్పలేదు. కొఠారీ, ఆయన భార్య సాధన, కొడుకు రాహుల్‌తో పాటు కంపెనీలోని డైరెక్టర్లంతా బ్యాంకు నుంచి రుణంగా తీసుకున్న మొత్తాలను నిర్దేశిత అవసరాలకు వినియోగించకుండా దారి మళ్లించారని సీబీఐ అధికారులు ఆరోపిస్తున్నారు. తొలుత రూ. 800 కోట్ల అప్పులే తీసుకున్నట్లు భావించినా, ఆ తర్వాత అన్నీ కలిపి లెక్కచూస్తే ఈ స్కాం దాదాపు రూ. 3695 కోట్లని తేలింది. ఆ తర్వాత విక్రమ్ కొఠారీ దేశం విడిచి పారిపోయే అవకాశం ఉందని బ్యాంక్ ఆఫ్ బరోడా వర్గాలు అనుమానం వ్యక్తం చేయడంతో కొఠారీపై సీబీఐ ఎఫ్ఐఆర్ దాఖలుచేసింది. ఆ తర్వాత కొఠారీ గానీ ఆయన కుటుంబ సభ్యులు గానీ ఎవరూ భూ, వాయు, ఆకాశ మార్గాలలో ఎటూ దేశం విడిచి వెళ్లకూడదని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా నోటిఫై చేసింది. ఈ మేరకు అన్ని విమానాశ్రయాలు, ఓడ రేవులు, ఇతర రవాణా మార్గాలకు కూడా సమాచారం పంపింది. రోటోమాక్ కంపెనీపైన, దాని ప్రమోటర్ల పైన పీఎంఎల్ఏ (ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్) కేసును ఈడీ నమోదుచేసింది.


రెండేళ్లు తాపీగా ఊరుకుని...

విక్రమ్ కొఠారీ సంస్థకు తానిచ్చిన రూ. 435 కోట్ల అప్పును 'నిరర్థక ఆస్తి'గా బ్యాంక్ ఆఫ్ బరోడా ఎప్పుడో 2015 అక్టోబరులోనే గుర్తిం చింది. అలాగే.. ఆయనను మోసగాడని కూడా 2017 డిసెంబరులో ప్రకటించింది. కానీ, పంజాబ్ నేషనల్ బ్యాంకును మోసం చేసిన నీరవ్ మోదీ విదేశాలకు పారిపోయాడని తేలిన తర్వాతే ఉన్నట్టుండి పరుగులు పెట్టి సీబీఐకి ఫిర్యాదుచేసింది. 2015 సంవత్సరంలోనే దాదాపు రూ. 6172 కోట్ల విదేశీ మారకద్రవ్యం స్కాం కూడా బ్యాంక్ ఆఫ్ బరోడాలో బయటపడింది. జీడిపప్పులు, బియ్యం దిగుమతి చే సుకోడానికి ఆ డబ్బును భారత్ నుంచి హాంకాంగ్ పంపినా, ఏమీ దిగుమతి చేసుకోకుండా వేర్వేరు కంపెనీలకు చెందిన 59 ఖాతాల్లోకి డిపాజిట్ చేశారు. ఈ కేసుతో సంబంధమున్న బ్యాంకు (ఏ.జీ.ఎమ్) ఎస్కే గార్గ్, విదేశీ మారక ద్రవ్య విభాగం అధిపతి జైనేష్ దూబేలను అప్పట్లోనే సీబీఐ అరెస్టుచేసింది. ఒకవైపు అంత జరిగి, మరోవైపు కొఠారీ వందల కోట్లలో అప్పు ఎగ్గొట్టినా బ్యాంక్ ఆఫ్ బరోడా వర్గాల్లో చలనం రాకపోవడాన్ని అంతా తప్పుపడుతున్నారు.

కస్టడీకి మరో ముగ్గురు

పీఎన్‌బీ కేసులో సీబీఐకి కోర్టు అనుమతి.. ఇప్పటికే ఇద్దరు ఉద్యోగుల ఇంటరాగేషన్

- **తాజాగా బ్యాంకు జీఎం జిందాల్ అరెస్ట్**
- **నిరుడు ఫిబ్రవరిలో 280కోట్లకు ఎల్వోయూ**
- **నా కక్షిదారు పారిపోలేదు... నీరవ్ లాయర్**
- **సిట్ ఏర్పాటుకు 'పిల్'పై కేంద్రం వ్యతిరేకత**



న్యూఢిల్లీ/ముంబై, ఫిబ్రవరి 21: పీఎన్‌బీకి వజ్ర బేహారి నీరవ్ మోదీ మోసం కేసులో బ్యాంకు ఉన్నతాధికారి రాజేష్ జిందాల్‌ను సీబీఐ అరెస్ట్ చేసింది. ప్రస్తుతం ఢిల్లీలోని ప్రధాన కార్యాలయంలో జనరల్ మేనేజర్ హోదాలో ఉన్న ఈయన కేసులో కేంద్ర బిందువైన పీఎన్‌బీ బ్రాడీ హౌస్ శాఖకు 2009-11 మధ్య అధిపతిగా ఉన్నారు. నీరవ్ మోదీకి పరిమితిని మించి రుణహామీ లేఖ (ఎల్వోయూ)ల జారీ ప్రారంభమైంది జిందాల్ హయాంలోనే కావడం ఈ సందర్భంగా గమనార్హం. మరోవైపు ఇప్పటికే పీఎన్‌బీ అధికారులు ఇద్దరు తమ కస్టడీలో ఉండగా మరో ముగ్గుర్ని కూడా తమకు అప్పగించాలని అధికారులు ప్రత్యేక కోర్టును కోరారు. ఈ ముగ్గురూ విచారణకు సహకరించడం లేదని, అందు వల్లలోతుగా ప్రశ్నించేందుకు కస్టడీకి అనుమతించాలని విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు మార్చి 3 వరకూ వారిని ప్రశ్నించేందుకు అనుమతిస్తూ ప్రత్యేక కోర్టు జడ్జి ఎస్.ఆర్. తంబోలి ఆదేశాలిచ్చారు. మొత్తం మీద కర్ణుడి చావుకు కారణాలు లక్ష అన్నట్లు... పీఎన్‌బీకి నీరవ్ మోదీ రూ.11,400 కోట్ల మేర సున్నం పెట్టడానికి దారితీసిన లోపాలు బోలెడున్నాయి. ఈ ఘరానా మోసానికి కారణాలు.. మొదటిది... నాసిరకం సాంకేతిక పరిజ్ఞానం. రెండోది... బలహీన ముప్పు నిర్వహణ. మూడోది... అసమర్థ నియంత్రణతో కూడిన పర్యవేక్షణ. ఏదేమైనా నీరవ్ జారుకునేదాకా తమ చేతులు కాలినట్లు గుర్తించని పీఎన్‌బీ యాజమాన్యం ఆ తర్వాత ఆకులు పట్టుకున్నట్లయింది.

'సిట్' అనవసరం... సుప్రీంలో కేంద్రం

పీఎన్‌బీ ఉదంతంపై రిటైర్డ్ జడ్జిలతో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)తో విచారణసహా నీరవ్‌ను రెండు నెలల్లో స్వదేశం రప్పించాలని కోరుతూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాలను (పిల్) సుప్రీం కోర్టు బుధవారం విచారించింది. అయితే, కేంద్ర ప్రభుత్వం ఈ అభ్యర్థనలను వ్యతిరేకించిన నేపథ్యంలో విచారణను మార్చి 16కు వాయిదా వేస్తున్నామని చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. కాగా, పీఎన్‌బీతోపాటు రిజర్వు బ్యాంకు, కేంద్ర ఆర్థిక-న్యాయశాఖలను కూడా పిటిషనర్లు ఇందులో ప్రతివాదులుగా చేర్చారు. భారీ రుణాల మంజూరు, తిరిగి వసూలుకు తగిన మార్గదర్శకాలు రూపొందించేలా కేంద్ర ఆర్థికశాఖ, ఆర్‌బీఐలను ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు. రాని బకాయిల పకడ్బందీ వసూలుకు నిపుణుల కమిటీని ఏర్పాటు చేసేలా కేంద్రానికి ఆదేశాలివ్వాలని కోరారు. రుణ మంజూరులో కీలక పాత్ర పోషించే బ్యాంకుల సిబ్బందిని వాటికి బాధ్యులను చేయాలన్నారు. దీంతోపాటు అప్పు వసూలు కాకపోతే సదరు సిబ్బంది రిటైరైనప్పటికీ వారి ఆస్తులను జప్తుచేసేలా రుణాలకు జోడించాలన్నారు. అంతకుముందు కేంద్రం తరఫున అటార్నీ జనరల్ కె.కె.వేణుగోపాల్ వాదన వినిపించారు. పీఎన్‌బీలో మోసంపై ఇప్పటికే ఎఫ్ఐఆర్ నమోదైందని, విచారణ కూడా ప్రారంభమైందని ధర్మాసనం దృష్టికి తెచ్చారు.

ఎల్వోయూల బాగోతం 2008 నుంచే మొదలు

పీఎన్‌బీ బ్రాడీ హౌస్ శాఖలో మోసపూరిత ఎల్వోయూల జారీ 2008 నుంచే మొదలైందని రిటైర్డ్ డిప్యూటీ మేనేజర్ గోకుల్‌నాథ్ షెట్టి విచారణ సందర్భంగా తెలిపారు. ఈ మేరకు సీబీఐ ప్రత్యేక కోర్టులో అధికారులు వెల్లడించారు. తాము ఇప్పటిదాకా అరెస్టు చేసిన వారినుంచి మరింత సమాచారం రాబట్టాల్సి ఉన్నందున తమ అదుపునకు అనుమతించాలని కోరారు. వాదప్రతివాదాల అనంతరం బేచూ తివారీ (చీఫ్ మేనేజర్), యశ్వంత్ జోషి (స్కేల్-2 మేనేజర్), ప్రఫుల్ సావంత్ (స్కేల్-1 ఆఫీసర్- ఎగుమతులు)ల కస్టడీకి అనుమతిస్తున్నట్లు జడ్జి ప్రకటించారు. గోకుల్‌నాథ్ తోపాటు సింగిల్ విండో ఆపరేటర్ (క్లర్కు) మనోజ్ ఖారట్‌లు 2017 ఫిబ్రవరి 9, 10, 14 తేదీల్లో రూ.280 కోట్ల విలువైన 8 ఎల్వోయూలు జారీ చేశారని సీబీఐ తరఫు న్యాయవాది ఎ.లిమోసిన్ కోర్టుకు తెలిపారు.

జీతాలివ్వలేను: నీరవ్

పీఎన్‌బీని వేల కోట్లలో మోసిం చేసి పారిపోయిన నీరవ్ మోదీ తాజాగా తమ సంస్థ ఉద్యోగులకు ఈ-మెయిల్ పంపారు. తన కంపెనీల వాటాలను సీబీఐ, ఈడీ అధికారులు జప్తు చేశారని, బ్యాంకు ఖాతాలను స్తంభింపజేశారని అందువల్ల సిబ్బందికి జీతాలివ్వలేనని నిస్సహాయత ప్రకటించారు. ఇక తన కొలువు వదిలేసి మరోచోట ఉద్యోగం చూసుకోవాల్సిందిగా సలహా కూడా ఇచ్చారు. తన భవిష్యత్తేమిటో తనకే అంతుబట్టడంలేదని, పరిస్థితులు ఎప్పుడు చక్కబడతాయో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు.

ఈ కేసులు నిలవవు... నీరవ్ లాయర్ ధీమా

పీఎన్‌బీకి పైసా కూడా చెల్లించేది లేదని నీరవ్ లేఖ రాసిన నేపథ్యంలో అతడి మోసంపై సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాఖలు చేసిన కేసులు నిలబడవని అతడి లాయర్ విజయ్ అగర్వాల్ ధీమా వ్యక్తం చేశారు. బోఫోర్స్, 2జీ కుంభకోణం, ఆరుషి కేసుల తరహాలో వీగిపోతాయని పేర్కొన్నారు. ఇక పరారీలో ఉన్న నీరవ్ 'మోస్ట్ వాంటెడ్' నిందితుల జాబితాలో ఉండగా ఆయన పారిపోలేదని, అంతర్జాతీయ వ్యాపార లావాదేవీల కోసమే విదేశాలకు వెళ్లారని వాదిస్తున్నారు.



నీరవ్, రాఫెల్‌పై మాట్లాడండి

- ప్రజలు వినాలని కోరుకుంటున్నారు
- 'మన్ కీ బాత్'కు నా సలహాలు ఇవే
- ప్రధాని మోదీ సూచనకు రాహుల్ ట్వీట్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: మన్ కీ బాత్ కార్యక్రమానికి సలహాలు ఇవ్వాలని ప్రధాని నరేంద్ర మోదీ కోరడంపై ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ స్పందించారు. ఈ కార్యక్రమంలో నీరవ్ మోదీ, రఫెల్ స్కాంలపై మాట్లాడాల్సిందిగా రాహుల్ సూచించారు. ప్రజల నుంచి సలహాలు కోరే బదులుగా ఈ కుంభకోణాల గురించి మాట్లాడితే బాగుంటుందని పేర్కొన్నారు. ''ఈ నెల 25 న ప్రసారమయ్యే మన్ కీ బాత్ కార్యక్రమానికి మీ సలహాలు, సూచనలు ఇవ్వండి. 1800-11-7800కు ఫోన్ చేస్తే మీ సందేశాలను నమోదు చేస్తారు. అలాగే నరేంద్ర మోదీ యాప్ ఓపెన్ ఫోరమ్ లేదా మై గవర్నమెంట్‌కు కూడా మీ సూచనలను లిఖిత పూర్వకంగా పంపండి'' అని మోదీ ఇటీవల ట్వీట్ చేశారు. దీనికి రాహుల్ స్పందిస్తూ.. ''మోదీజీ గత నెలలో మన్ కీ బాత్‌కు నేను ఇచ్చిన సలహాలను విస్మరించారు. మీరు సలహాలు ఎందుకు అడుగుతారు? మీ నుంచి ఏం వినాలని ప్రతి భారతీయుడు కోరుకుంటున్నాడో అది మీకు తెలుసు. నీరవ్ మోదీ 22 వేల కోట్లు దోచుకుని పారిపోయాడు. 58 వేల కోట్ల రూపాయల రఫెల్ స్కాం జరిగింది. వీటి గురించి మాట్లాడాల్సిందిగా మీకు సలహా ఇస్తున్నా'' అని పేర్కొన్నారు. పంజాబ్ నేషనల్ బ్యాంకులో భారీ కుంభకోణం వెలుగు చూసిన సంగతి తెలిసిందే. వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ వేలాది కోట్ల రూపాయల బకాయిలు ఎగవేసి విదేశాలకు పారిపోయాడు. దీంతో బ్యాంకు సంక్షోభంలో కూరుకుపోయింది. విద్యార్థుల పరీక్షల గురించి రెండు గంటలు మాట్లాడిన ప్రధాని.. పంజాబ్ నేషనల్ బ్యాంకు కుంభకోణం గురించి రెండు నిమిషాలు కూడా మాట్లాడలేదని రాహుల్ విమర్శించారు. నీరవ్ మోదీ, రఫెల్ ఒప్పందం కుంభకోణాలపై మోదీ ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. జనవరి 28న ప్రసారమైన మన్ కీ బాత్ కార్యక్రమంలో దేశంలో అత్యాచారాలు అరికట్టడం, డోక్లాం నుంచి చైనా బలగాలను వెనక్కు పంపడం, యువతకు ఉద్యోగాల కల్పన గురించి మాట్లాడాల్సిందిగా ఇంతకుముందు మోదీని రాహుల్ కోరారు. తాజాగా మరోసారి స్పందిస్తూ.. వేల కోట్ల రూపాయల కుంభకోణాలపై మోదీ మాట్లాడాలని డిమాండ్ చేశారు.

బుందేల్‌ఖండ్‌కు రక్షణ కారిడార్

- 20 వేల కోట్లతో ఏర్పాటు: మోదీ

లఖ్‌నవ్, ఫిబ్రవరి 21: ఉత్తరప్రదేశ్‌లో వెనుకబడిన ప్రాంతమైన బుందేల్‌ఖండ్‌ను అభివృద్ధి చేయడంలో భాగంగా రక్షణ పారిశ్రామిక కారిడార్‌ను ఏర్పాటు చేయనున్నట్టు ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. కేంద్ర బడ్జెట్‌లో పొందుపరిచిన రెండు రక్షణ కారిడార్లలో ఒకదాన్ని 20 వేల కోట్ల రూపాయల వ్యయంతో బుందేల్‌ఖండ్‌లో నెలకొల్పుతామని, దీనివల్ల 2.5 లక్షల మందికి ఉపాధి లభిస్తుందని మోదీ అన్నారు. బుధవారం లఖ్‌నవ్‌లో జరిగిన పెట్టుబడిదారుల సదస్సు-2018లో మోదీ మాట్లాడుతూ.. ఉత్తరప్రదేశ్ అభివృద్ధికి ఆ రాష్ట్ర ప్రజలు, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కృతనిశ్చయంతో ఉన్నారని ప్రశంసించారు. గతంలో నెలకొన్న సమస్యలను యోగి సర్కార్ అధిగమించి సానుకూల దృక్పథంతో అభివృద్ధి సాధిస్తోందని అన్నారు.

ఆప్ ఎమ్మెల్యేల అరెస్ట్

- **సీఎం సలహాదారు విచారణ**
- **సీఎస్‌పై దాడి ఘటనపై వెల్లువెత్తిన ఆగ్రహం**
- **అన్షు ప్రకాశ్‌కు పలు సంఘాల మద్దతు**
- **సీఎం స్పందించకపోవడం దారుణం**
- **మండిపడిన కాంగ్రెస్ నేతలు**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: ఢిల్లీ సీఎస్ అన్షు ప్రకాశ్‌పై దాడి ఘటనలో ఆప్ ఎమ్మెల్యే అమానతుల్లా ఖాన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన దేశవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టించడం, ప్రతిపక్షాలు మండిపడడంతో అమానతుల్లా ఖాన్ బుధవారం ఉదయం జామియా నగర్ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయారు. ఈ విషయంలో సీఎస్ అన్షు ప్రకాశ్‌కు ఐఏఎస్‌ల సంఘం ఇప్పటికే మద్దతు ప్రకటించగా.. తాజాగా ఐఆర్ఎస్, ఐపీఎస్ సంఘాలు కూడా మద్దతిస్తున్నట్లు పేర్కొన్నాయి. ఆప్ ఎమ్మెల్యేలు తనపై దాడి చేశారంటూ సీఎస్ ఆరోపించినా.. ముఖ్యమంత్రి కేజ్రీవాల్ సకాలంలో స్పందించకపోవడం వివాదాస్పదంగా మారింది. ఘటన జరిగిన ఒకరోజు తర్వాత సీఎం స్పందించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిపై దాడి ఘటనపై కాంగ్రెస్ మండిపడింది. సీఎం కేజ్రీవాల్ ముందే ఓ ఉన్నతాధికారిపై దాడిచేయడం అమానుషమని పేర్కొంది. దీనిపై ముఖ్యమంత్రి స్పందించకపోవడం దారుణమని ఆగ్రహం వ్యక్తంచేసింది. ఈ ఘటనకు సంబంధించి కాంగ్రెస్ ప్రతినిధి బృందం లెఫ్టినెంట్ గవర్నర్ అనిల్ బైజాల్‌ను కలిసింది. మరోవైపు, సీఎం కేజ్రీవాల్ నివాసంలో ఆయన ముందే తనపై దాడి జరిగిందని సీఎస్ అన్షు ప్రకాశ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు అజయ్ దత్, ప్రకాశ్ జర్వాల్ తనపై దాడి చేశారని అందులో పేర్కొన్నారు. ఓ పథకం ప్రకారమే తనపై దాడి జరిగిందని, దీని వెనక కుట్ర ఉందని ఆరోపించారు. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ కోసం ఎమ్మెల్యే ప్రకాశ్ జర్వాల్‌ను మంగళవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం జర్వాల్‌ను అరెస్టు చేసినట్లు బుధవారం ఉదయం ప్రకటించారు. కాగా, ఈ విషయంలో కలగజేసుకోవాలంటూ ఢిల్లీ హైకోర్టులో దాఖలైన పిటిషన్‌ను న్యాయస్థానం తోసిపుచ్చింది.


పోలీసుల అదుపులో ఎమ్మెల్యే అమానతుల్లా ఖాన్

దాడి నిజమే.. వైద్య నివేదిక

ఢిల్లీ ప్రధాన కార్యదర్శి (సీఎస్) అన్షు ప్రకాశ్‌పై దాడి నిజంగానే జరిగినట్లు నిర్ధారణ అయింది. దాడి కారణంగా ఆయన కింది పెదవి కమిలిపోయిందని, చెవుల లోపలి భాగంలో చీము కూడా వస్తుందని అరుణ అసఫ్ అలీ ఆసుపత్రి వైద్యులు స్పష్టంచేశారు. ఈమేరకు ఆయనకు చికిత్స చేసిన వివరాలతో కూడిన ఒక పేజీ నివేదికను బహిరంగ పరిచారు. ఆయనకు మెడ భాగంలో కూడా కొంచెం దెబ్బ తగిలిందని పేర్కొన్నారు. ముఖం చుట్టూ గాయాలు ఉన్నా యని, నుదుటి కుడివైపు గాయం గుర్తులు ఉన్నాయని వైద్యులు తెలిపారు. కుడి బుగ్గపై వాచిన గుర్తులు ఉన్నాయన్నారు.

అర్ధ రాత్రి ఎందుకు పిలిచారు?

సోమవారం రాత్రి ఏంజరిగిందనే విషయంపై భిన్న వాదనలు ప్రచారంలో ఉన్నాయి. మీడియాలో ప్రభుత్వ ప్రచార ప్రకటనలకు సంబంధించి సమీక్ష కోసం సీఎం నివాసానికి రావాలంటూ ఫోన్ రావడంతో అర్ధరాత్రి సుమారు 11:30 గంటల ప్రాంతంలో తానక్కడికి వెళ్లానని సీఎస్ వాదిస్తున్నారు. తన తప్పేమీ లేకుండానే అమానతుల్లా ఖాన్‌తో పాటు ప్రకాశ్ జర్వాల్ తనపై దాడికి దిగి చేయిచేసుకున్నారని చెప్పారు. అయితే, రేషన్ పంపిణీకి సంబంధించిన ఫిర్యాదులపై చర్చించేందుకు పిలిచామంటూ ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. తనపై దాడి వెనక కుట్ర ఉందని, ఓ పథకం ప్రకారమే జరిగిందని సీఎస్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో నేరపూర్వక కుట్ర కోణాన్నీ ఎఫ్ఐఆర్‌లో నమోదు చేసినట్లు సమాచారం.


పోలీసుల అదుపులో ఆప్ ఎమ్మెల్యే ప్రకాశ్ జర్వాల్

సీఎం సలహాదారును విచారించిన పోలీసులు

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిపై దాడికి సంబంధించి సీఎం సలహాదారును పోలీసులు 3 గంటల పాటు ప్రశ్నించారు. సీఎస్‌పై దాడి నిజమేనా.. ఎవరెవరు దాడికి పాల్పడ్డారు అంటూ ముఖ్యమంత్రి సలహాదారు వీకే సింగ్‌ను సుదీర్ఘంగా విచారించినట్లు సమాచారం. సీఎస్ అన్షు ప్రకాశ్ ఫిర్యాదు నేపథ్యంలో సివిల్ పోలీస్ లైన్‌లో జైన్‌ను విచారించినట్లు పోలీస్ అధికార ప్రతినిధి దీపేంద్ర పాథక్ పేర్కొన్నారు. విచారణ కొనసాగుతుందని, అవసరమైతే జైన్‌ను మరోసారి పిలిచే అవకాశం ఉందని వివరించారు.

కఠినంగా శిక్షించాలి: ఐపీఎస్, ఐఆర్ఎస్ సంఘం

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిపై దాడి ఘటనను ఐపీఎస్, ఐఆర్ఎస్ సంఘాల నేతలు తీవ్రంగా ఖండించారు. దాడికి పాల్పడ్డ వారిని కఠినంగా శిక్షించాలంటూ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఎస్ అన్షు ప్రకాశ్‌కు తామంతా మద్దతుగా నిలుస్తామని స్పష్టం చేస్తూ.. అధికారుల గౌరవాన్ని కాపాడాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు.




ఎనిమిది మందిని బలిగొన్న ట్రక్కు

- **అదుపుతప్పి ఓ దుకాణం, ఇంట్లోకి దూసుకెళ్లిన వాహనం**
- **మధ్యప్రదేశ్‌లోని బరేలాలో ఘటన, వాహన డ్రైవరు అరెస్టు**
- **పోలీసు వాహనానికి నిప్పు పెట్టిన స్థానికులు**

భోపాల్, ఫిబ్రవరి 21: వేగంగా వచ్చి అదుపుతప్పిన ఓ ట్రక్కు ఎనిమిది మంది ప్రాణాలు బలిగొంది. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని జబల్‌పూర్‌లోని బరేలాలో ఈ ఘోరం జరిగింది. వేగంగా వస్తున్న ఓ ట్రక్కు అదుపు తప్పి రహదారిని ఆనుకొని ఉన్న ఓ దుకాణం, ఇంటిలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఎనిమిది మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం అనంతరం ఆ ప్రాంతంలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఆగ్రహంతో ఊగిపోయిన స్థానికులు ఆందోళనకు దిగారు. ఘటనా స్థలానికి వచ్చిన ఓ పోలీసు వాహనానికి నిప్పు పెట్టారు. ప్రమాదానికి కారణమైన ట్రక్కును నడిపిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు.

'బంప్‌స్టాక్'పై నిషేధం!

- **పరిశీలించాలని జస్టిస్ విభాగానికి ట్రంప్ ఆదేశాలు**
- **ఫ్లోరిడా స్కూల్ ఘటన నేపథ్యంలో నిర్ణయం..**
- **'బంప్‌స్టాక్'తో మామూలు రైఫిల్ 'మెషీన్‌గన్'గా మార్పు**
- **పెరగనున్న ఫైరింగ్ వేగం.. క్షణాల్లో బుల్లెట్ల వర్షం**



వాషింగ్టన్, ఫిబ్రవరి 21: ఫ్లోరిడాలోని ఓ స్కూలులో మాజీ విద్యార్థి విచక్షణా రహితంగా జరిపిన కాల్పుల్లో 14 మంది విద్యార్థులు, ముగ్గురు ఉపాధ్యాయులు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో సదరు విద్యార్థి.. సెమీ ఆటోమేటిక్ రైఫిల్‌ను ఉపయోగించి కాల్పులు జరిపాడు. అయితే కొద్ది రోజుల క్రితం లాస్‌వెగాస్‌లో స్టీఫెన్ పెడాక్ అనే వ్యక్తి కూడా కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో అతను సెమీ ఆటోమేటిక్ రైఫిల్‌కు 'బంప్ స్టాక్' అనే పరికరాన్ని ఉపయోగించాడు. దీని వల్ల ఫైరింగ్ వేగాన్ని పెంచవచ్చు. ట్రిగ్గర్ కూడా ఈజీగా మూవ్ అవుతుంది. దీంతో క్షణాల్లో బుల్లెట్ల వర్షం కురుస్తుంది. ఒకరకంగా సెమీఆటోమెటిక్ వెపన్‌ను ఈ బంప్ స్టాక్ ఓ ఆటోమెటిక్ వెపన్‌గా మారుస్తుంది. అప్పుడు ఇది మెషీన్‌గన్‌లా బుల్లెట్లను వదులుతుంది. అయితే.. ఫ్లోరిడా ఘటన నేపథ్యంలో 'బంప్‌స్టాక్' పరికరంపై నిషేధం విధించాలని పెద్ద ఎత్తున డిమాండ్లు వచ్చాయి. తుపాకీ సంస్కృతిని నియంత్రించేందుకు ఎలాంటి చర్యలు కూడా తీసుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తాయి. దాంతో.. ట్రంప్ ఈ పరికరంపై నిషేధం విధించే అంశాన్ని పరిశీలించాలని న్యాయశాఖకు సూచించారు

బంప్‌స్టాక్‌కు చట్టబద్ధ అనుమతి..

బంప్ స్టాక్‌కు అమెరికాలో లీగల్ స్టేటస్ ఉంది. వీటిని ఆన్‌లైన్‌లో కూడా కొనవచ్చు. అయితే లాస్ వెగాస్ ఘటన తర్వాత ఈ ఎక్స్‌ట్రా ఫిట్టింగ్‌కు ఇప్పుడు గిరాకీ మరింత పెరిగింది. ఓ నివేదిక ప్రకారం బంప్ స్టాక్‌కు ఇప్పుడు సేల్స్ డిమాండ్ నాలుగింతలైంది. నిజానికి గన్‌షాపుల్లో బంప్ స్టాక్‌కు డిమాండ్‌లేదు. దీన్ని ఆన్‌లైన్‌లో కేవలం వంద లేదా రెండు వందల డాలర్లకు ఖరీదు చేయవచ్చు. రైఫిల్‌కు వెనుక భాగంలో అమర్చే ఎక్స్‌ట్రా ఫిట్టింగే బంప్‌స్టాక్. దీని వల్ల గన్ మూవ్‌మెంట్ సులువు అవుతుంది. ట్రిగ్గర్‌పై వేలు తీయకుండానే ఈజీగా గన్‌ఫైర్ చేయవచ్చు. గన్ ముందుకు.. వెనక్కి ఈజీగా కదలడం వల్ల బుల్లెట్స్ డిస్‌చార్జ్ చేసే స్పీడ్ కూడా పెరుగుతుంది. దీంతో తక్కువ సమయంలో ఎక్కువ బుల్లెట్లను ఫైర్ చేయవచ్చు.

మార్చి 16 నుంచి రామ్ కొత్త సినిమా



రామ్ హీరోగా త్రినాథరావు నక్కిన దర్శకత్వంలో దిల్‌రాజు ఓ చిత్రాన్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. మార్చి 16న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమవుతుంది. ఈ చిత్రంలో రామ్ సరసన అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్‌గా నటిస్తుంది. దేవిశ్రీప్రసాద్ సంగీతం అందించే ఈ సినిమా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కనుంది. ఇప్పటివరకు రామ్ చేసిన క్యారెక్టర్లకు పూర్తి భిన్నంగా ఈ సినిమాలో క్యారెక్టర్ ఉంటుందట. ఈ చిత్రంలో నటించే మిగతా నటీనటుల, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలోనే ప్రకటిస్తారు.



చరణ్ భారీ డీల్

రామ్‌చరణ్, బోయపాటి కాంబినేషన్‌లో ఓ సినిమా రూపొందుతోన్న సంగతి తెలిసిందే. ఒకరేమో మాస్ ఇమేజ్ ఉన్న హీరోగా కాగా.. మరొకరేమో మాస్ పల్స్‌ను పసిగట్టి సినిమాలు తెరకెక్కించే డైరెక్టర్. వీరి కాంబినేషన్ లో సినిమా అంటే ఎలాంటి అంచనాలుంటాయనే సంగతిని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ప్రస్తుతం సినిమా చిత్రీకరణ దశలో ఉండగానే, సినిమాపై మంచి అంచనాలు ఏర్పడ్డాయి. ఈ సినిమా హిందీ శాటిలైట్ హక్కులతో పాటు .. డిజిటల్ హక్కులను ప్రముఖ సంస్థ 22 కోట్ల రూపాయలకు కొనుగోలు చేసిందని ఇండస్ట్రీ టాక్. రామ్‌చరణ్ సరసన కైరా అద్వాని హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ చిత్రంలో ప్రశాంత్, ఆర్యన్ రాజేష్ చెర్రీకి అన్నయ్యలుగా నటిస్తుంటే.. స్నేహ, అనన్య వదిన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాను దసరాకు విడుదల చేయాలనే ఆలోచనలో నిర్మాత డి.వి.వి.దానయ్య ఉన్నారు.

బుల్లితెరపై బిల్‌గేట్స్



మైక్రోసాఫ్ట్‌తో ఐ.టి. రంగానికి కొత్త వన్నె తెచ్చిన బిల్‌గేట్స్ ఇప్పుడు బుల్లితెరపై సందడి చేయనున్నారు. హాలీవుడ్‌లో పాపులర్ అయిన కామెడీ సిరీస్ 'ది బిగ్ బ్యాంగ్ థియరీ'లో అతిథి పాత్రలో మెరవనున్నారు. ఈ ఎపిసోడ్‌ను వచ్చే నెల ప్రసారం చేయనున్నారు. అయితే గేట్స్ ఇందులో వేరే పాత్రలో కాకుండా మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడిగానే నటిస్తారు. సిరీస్‌లో భాగంగా నిర్వహించే ఓ కార్యక్రమానికి గేట్స్ ముఖ్య అతిథిగా విచ్చేస్తారు. ఆయనతోపాటు ప్రముఖ భౌతిక శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ తదితరులు పాల్గొననున్నారు. 2001లో వచ్చిన 'ఫ్రాసియర్' అనే కామెడీ సిరీస్‌లోనూ గేట్స్ అతిథి పాత్రలో నటించారు. ఇలాంటి చిన్న పాత్రలకు గేట్స్ ఎటువంటి పారితోషికం తీసుకోకపోవడం విశేషం.

సూర్య కోసం చెన్నైలో సెట్



తమిళ స్టార్ హీరో సూర్య కథానాయకుడిగా డ్రీమ్ వారియర్ పిక్చర్స్ పతాకంపై ఓ సినిమా నిర్మితమవుతున్న విషయం తెలిసిందే. సెల్వ రాఘవన్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా మొదటి షెడ్యూల్ ఇటీవలే ముగిసింది. కాగా.. మూడు వారాలకు పైగా సాగే రెండో షెడ్యూల్‌ను చెన్నైలో చిత్రీకరించనున్నారు. ఇందుకోసం.. తమిళనాడులోని తిరునల్వేలి జిల్లాలో అంబా సముద్రం టౌన్‌ను పోలిన భారీ సెట్‌ను చెన్నైలో నిర్మించారని కోలీవుడ్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ షెడ్యూల్‌లో సూర్యతో పాటు చిత్ర నాయికలు సాయి పల్లవి, రకుల్ ప్రీత్ సింగ్ కూడా పాల్గొనబోతున్నట్టు సమాచారం. జగపతిబాబు ప్రతినాయకుడిగా కనిపించనున్న ఈ చిత్రానికి యువన్ శంకర్ రాజా స్వరాలను అందిస్తున్నారు. దీపావళికి ఈ సినిమా తెరపైకి రానుంది.



'జువ్వ' కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా మెప్పిస్తుంది

- రంజిత్

'మాది వైజాగ్. చిన్నప్పట్నుంచి నాకు సినిమాలంటే ఉండే ఆసక్తితోనే ఈ రంగంలోకి వచ్చాను. హైదరాబాద్‌లోనే ఎం.బి.ఎ చదివాను. అదే సమయంలో సినిమాల్లో అవకాశాల కోసం ప్రయత్నించాను. హీరోగా చేయాలనే కోరికతో చిన్న చిన్న పాత్రలు చేసే అవకాశం వచ్చినా చేయలేదు' అన్నారు హీరో రంజిత్. ఈయన కథానాయకుడుగా నటించిన చిత్రం 'జువ్వ'. పాలక్ లల్వానీ హీరోయిన్‌గా నటించింది. ఈ చిత్రం ఫిబ్రవరి 23న విడుదలవుతుంది. ఈ సందర్భంగా హీరో రంజిత్ మాట్లాడుతూ '''నువ్వు నేను ఒకటవుదాం' సినిమా తర్వాత నేను నటించిన రెండో చిత్రమిది. రత్నంగారు చెప్పిన కథ ఓకే కావడంతో.. మూడు నెలలు ఈ స్క్రిప్ట్‌పై వర్క్ చేశాం. అంతా బావుందని అనుకున్న తర్వాతే షూటింగ్ స్టార్ట్ చేశాం. హైదరాబాద్, వైజాగ్, బెంగళూరు, మలేషియా లొకేషన్స్‌లో ఈ సినిమాను చిత్రీకరించాం. మొత్తం చిత్రీకరణకు 85 రోజులు సమయం పట్టింది. 'దిక్కులు చూడకు రామయ్యా' సినిమాను త్రికోటిగారు ఎలాగైతే డిఫరెంట్‌గా తీశారో అలాగే ఈ సినిమాను కూడా తీశారు. సాధారణ ప్రేమకథకు డ్రామాను కలిపి తెరకెక్కించారు. లవ్, కామెడీ, ఫైట్స్, పాటలు ఇలా అన్ని ఎలిమెంట్స్ కలగలిసిన కమర్షియల్ ఎంటర్‌టైనర్ అందరినీ మెప్పిస్తుంది. కీరవాణిగారు అందించిన పాటలు, నేపథ్య సంగీతమే సినిమాకు ప్రధాన బలం. మలయాళ నటుడు అర్జున్‌ను ఇందులో విలన్‌గా పరిచయం చేస్తున్నాం. అందరికీ పోస్టర్స్ వేసే హీరో, తనకు నచ్చిన హీరోయిన్ కోసం ఏం చేశాడనేదే సినిమా. మా అన్నయ్య భరత్ వృత్తిరీత్యా డాక్టర్. నా కోసం నిర్మాతగా మారి ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా ఈ సినిమాను నిర్మించారు. నెక్స్‌ట్ ఒక సబ్జెక్ట్ ఓకే అయ్యింది. అన్ని కుదిరితే మేలో సినిమా షూటింగ్ ఉంటుంది'' అన్నారు.

కొత్త లుక్‌లో హృతిక్

బాలీవుడ్ హీరో హృతిక్ రోషన్ జైపూర్‌లో సైకిల్‌పై అప్పడాలు అమ్ముతూ కనిపించారు. కండల వీరుడుగా అమ్మాయిల మనసులు దోచుకున్న హృతిక్ ఓ సాధారణ వ్యక్తిగా రోడ్డుపై సైకిల్‌తో కనిపించడంతో అందరూ షాక్ అయ్యారు. అయితే ఇది నిజ జీవితంలో కాదు. హృతిక్ నటిస్తున్న 'సూపర్ 30' కోసం కొత్తలుక్‌లో కనిపించారు. వికాస్‌భల్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మృణాల్ ఠాకూర్ హీరోయిన్. ప్రముఖ గణితశాస్త్ర నిపుణుడు, సూపర్ 30 కోచింగ్ సెంటర్ అధినేత ఆనంద్‌కుమార్ జీవితం ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే సినిమా మొదటి షెడ్యూల్ పూర్తి చేసుకుంది. ప్రస్తుతం జైపూర్‌లో చిత్రీకరణ జరుగుతోంది. ఈ సందర్భంగా హృతిక్ సాధారణ వ్యక్తిలా నూలు వస్త్రాలు ధరించి, భుజంపై తువాలు వేసుకుని.. సైకిల్‌పై అప్పడాలు అమ్ముతూ కనిపించారు. జనం మధ్యలో హృతిక్ అలా కనిపించినా ఎవరూ గుర్తు పట్టకపోవడం విశేషం. సహజంగా ఉండడం కోసం షూటింగ్ వాతావరణం కనిపించకుండా ఈ సీన్‌ని చిత్రీకరించారట. నవంబరులో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.





17 ఏళ్ళ తర్వాత..



గౌతమ్ మీనన్, మాధవన్

గౌతమ్ వాసుదేవ్ మీనన్, మాధవన్ కాంబినేషన్‌లో 2001లో వచ్చిన 'మిన్నలే(చెలి) చిత్రం మంచి విజయం సాధించింది. ఈ సినిమా తర్వాత వీరిద్దరి కాంబినేషన్‌లో సినిమా రాలేదు. దాదాపు 17 సంవత్సరాల తర్వాత గౌతమ్ మీనన్ హిట్ సినిమాల్లో ఒకటైన 'విన్నైతాండి వరువాయ' చిత్రం సీక్వెల్‌లో మాధవన్ నటించనున్నారు. నాగచైతన్య, సమంత జంటగా తెలుగులో ఈ సినిమా 'ఏమాయ చేసావె' పేరుతో రూపొందిన విషయం తెలిసిందే. 'విన్నైతాండి వరువాయ' 10 ఏళ్ల తర్వాత ప్రారంభమయ్యే కథగా ఈ సీక్వెల్ ఉండనుంది. మొదటి భాగంలో ప్రేమ కోణాన్ని చూపిన గౌతమ్ మీనన్ ఇందులో స్నేహం అనే అంశాన్ని ఎలివేట్ చేస్తారని వినికిడి. ఇందులో మాధవన్ స్నేహితులుగా మరో ఇద్దరు ప్రముఖ హీరోలు నటించే అవకాశాలున్నాయట. ఈ చిత్రానికి కూడా ఎ.ఆర్.రెహమాన్ సంగీతాన్ని అందిస్తారు. మరి ఈ సీక్వెల్‌ను తెలుగులో రీమేక్ చేస్తారా? ఒకవేళ చేస్తే నాగచైతన్య ఈ సినిమాలో నటిస్తారా అనేది తెలియాల్సి ఉంది.



గాలి మళ్లింది పెళ్లి పైన

తమిళంలో 'మదరాసు పట్టణం' సినిమాతో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చిన బ్రిటీష్ సొగసరి ఎమీ జాక్సన్. బాలీవుడ్‌లో 'ఏక్ దివానా థా', 'సింగ్ ఈజ్ బ్లింగ్' సినిమాల్లో నటించింది. అలాగే తెలుగులో ఎవడు', తమిళంలో 'థెరి'తో పాటు శంకర్ దర్శకత్వంలో 'ఐ' సినిమాలో నటించింది. ఇప్పుడు శంకర్ దర్శకత్వంలోనే రూపొందిన '2.0' విడుదలకు సిద్ధమవుతోంది. హీరోయిన్‌గా బిజీగా ఉన్న సమయంలోనే ఎమీ పెళ్లి చేసుకుంటుందని వార్తలు సినీ వర్గాల్లో వినపడుతున్నాయి. కొంతకాలంగా ఎమీ జాక్సన్ బ్రిటన్‌కు చెందిన వ్యాపారవేత్త జార్జ్‌తో ప్రేమాయణం కొనసాగిస్తుంది. త్వరలోనే వీరిద్దరూ ఓ ఇంటివారు కాబోతున్నారు. గత ఏడాది జరిగాల్సిన పెళ్లి కాస్త ఎమీ జాక్సన్ బిజీ షెడ్యూల్ కారణంగానే ఈ ఏడాదికి వాయిదా పడిందట.

ఈసారి ప్రత్యేక పాత్రలో..



హంసా నందిని

హీరోయిన్‌గా పరిచయమైన హంసా నందిని ఇప్పుడు ప్రత్యేక గీతాలకు, ప్రత్యేక పాత్రలకు పరిమితమైంది. పెద్ద హీరోల సినిమాల్లో స్పెషల్ సాంగ్స్‌తో అలరిస్తున్న ఈ భామ ఇప్పుడు గోపీచంద్ 25వ సినిమా 'పంతం'లో ఓ ప్రత్యేక పాత్ర చేస్తోంది. 'ఈ సినిమాలో నా క్యారెక్టర్‌కి మంచి ప్రాధాన్యం ఉంది. దర్శకుడు చక్రవర్తి నా పాత్ర గురించి చెప్పగానే వెంటనే ఓకే చెప్పాను. ఈ సినిమాలో ఓ ధనవంతురాలిగా కనిపిస్తాను. అయితే ఇందులో నేను స్పెషల్ సాంగ ఏదీ చెయ్యడం లేదు. నటనకు ప్రాధాన్యం ఉన్న ఈ క్యారెక్టర్‌తో నాకు చాలా మంచి పేరు వస్తుందని ఆశిస్తున్నాను'' అన్నారు. మెహరీన్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీసత్యసాయి ఆర్ట్స్ పతాకంపై కె.కె.రాధామోహన్ నిర్మిస్తున్నారు. మే 18న ఈ సినిమా విడుదలవుతుంది.

వినోదంతోపాటు సందేశం!

సాత్విక్ ఈశ్వర్ హీరోగా సిద్ధయోగి క్రియేషన్స్ పతాకంపై మహేష్ ఖన్నా నిర్మిస్తోన్న చిత్రం 'సత్య గ్యాంగ్'. బుధవారం హైదరాబాద్‌లో జరిగిన పాత్రికేయుల సమావేశంలో హీరో సాత్విక్ ఈశ్వర్, హీరోయిన్ అక్షిత, నిర్మాత మహేష్ ఖన్నా, దర్శకుడు మరియు ఈ చిత్రానికి సంగీతం కూడా సమకూర్చిన ప్రభాస్, సినిమాటోగ్రాఫర్ అడుసుమిల్లి విజయ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్మాత మహేష్ ఖన్నా మాట్లాడుతూ ''సమాజంలో అనాథలనేవారు ఉండకూడదనే సందేశానికి వినోదాన్ని మేళవించి తీస్తున్న చిత్రం 'సత్య గ్యాంగ్'. ఇటీవల విడుదలైన పాటలకు మంచి స్పందన వస్తోంది. మా డైరెక్టర్ ప్రభాస్ మ్యూజిక్ డైరెక్టర్‌గానూ మంచి మార్కులు స్కోర్ చేశాడు. మార్చ్ 15 న సినిమా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం'' అన్నారు. ప్రభాస్ మాట్లాడుతూ.. ''సినిమా బాగా వచ్చింది. మ్యూజిక్‌కి చాలా మంచి రెస్పాన్స్ రావడం ఆనందంగా ఉంది'' అన్నారు. 'సత్య గ్యాంగ్' వంటి ఓ మంచి సినిమాతో హీరోగా పరిచయం అవడం గర్వంగా ఉందని హీరో సాత్విక్ ఈశ్వర్ అన్నారు. ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటించే అవకాశం ఇచ్చిన దర్శక నిర్మాతలకు అక్షిత కృతజ్ఞతలు చెప్పారు.



అక్షిత, సాత్విక్ ఈశ్వర్



మీలో ఒకణ్ణి!

- కమల్ హాసన్ రాజకీయ అరంగేట్రం
- నా పార్టీ... 'మక్కళ్ నీది మయ్యమ్'

చెన్నై, ఫిబ్రవరి 21: ప్రముఖ నటుడు కమల్ హాసన్ రాజకీయ ప్రస్థానం ప్రారంభమైంది. ఈ మేరకు తమిళనాడు రాజకీయ రాజధాని మదురైలో బుధవారం ఏర్పాటు చేసిన భారీ కార్యక్రమంలో ''మక్కళ్ నీది మయ్యమ్'' (ప్రజా న్యాయ వేదిక) పేరిట కొత్త పార్టీకి ఆయన శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ప్రజలకు ప్రాధాన్యమిచ్చే ద్రవిడ సిద్ధాంతాలకు అనుగుణంగా రూపొందించిన పార్టీ పతాకాన్ని, చిహ్నాన్ని కూడా ఆవిష్కరించారు. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఈ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అభిమానులు, సభకు హాజరైన ప్రజలు పెద్దపెట్టున హర్షధ్వానాలు చేస్తుండగా ''నా పార్టీ పేరు 'మక్కళ్ నీది మయ్యమ్' ఈ ప్రస్థానం ఒక్కరోజుతో ముగిసిపోయేది కాదు... ఇదొక దీర్ఘకాలిక లక్ష్యం. ఇందుకోసం ఇన్నాళ్లు ఓపిక పట్టిన నాకు అనేకమంది శ్రేయోభిలాషులు, స్నేహితులు కలసిరావడం ఒక పురస్కారం వంటిదే... అటువంటి హితులలో కేజ్రీవాల్ కూడా ఒకరు'' అని కమల్ ప్రకటించారు. ''ఈ పార్టీ ప్రజల కోసమే... నేను నాయకుణ్ని కాదు... మీలో ఒకణ్ని... మీ అనుచరుణ్ని మాత్రమే... మీ మాటే వెంటా... మీ వెన్నంటి నడుస్తా''నంటూ తమిళనాడు పౌరులకు హామీ ఇచ్చారు. సభకు హాజరైన అశేష ప్రజానీకాన్ని చూసి ఉప్పొంగిపోతున్నానని, అందరూ ఏకమైతే సాధించగల విజయాలకు ఇదే నిదర్శనమని వ్యాఖ్యానించారు. ఈ సభ ఒక నమూనా మాత్రమేనని, రాష్ట్రవ్యాప్తంగా ప్రజాదరణతో ఇలాంటి సభలు మరెన్నో జరుగుతాయని ప్రకటించారు. అన్ని పార్టీలలోని మంచిని మాత్రమే స్వీకరిస్తానని, పార్టీ ప్రారంభానికి ముందు ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఒక ప్రశ్నకు బదులిచ్చారు.

ప్రజలే నీకు శ్రీరామరక్ష: చంద్రబాబు

అమరావతి, ఫిబ్రవరి 21 (మనం ప్రతినిధి): తమిళనాట రాజకీయ అరంగేట్రం చేసిన కమల్ హాసన్‌కు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం రాత్రి ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ''నమ్ముకున్న ప్రజలకు రక్షణ ఇవ్వు... ఆ ప్రజలే నీకు శ్రీరామరక్ష'' అని సలహా ఇచ్చారు.

రామేశ్వరం నుంచి మదురై...

మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం స్వస్థలం రామేశ్వరం నుంచి రోడ్ షోగా బయల్దేరిన కమల్... తొలుత ఆయన సోదరుడు మొహమ్మద్ ముత్తుమీరా లెబ్బై మరైక్కయర్‌ను కలుసుకుని ఆశీస్సులు పొందారు. కలాం చదివిన స్కూల్‌కు వెళ్లాలనుకున్నా యాజమాన్యం అనుమతించలేదు. దీనిపై కమల్ స్పందిస్తూ– 'పాఠశాలకు రాకుండా అడ్డుకున్నారుగానీ తాను నేర్చుకోవాలనుకున్న విషయాలను మాత్రం ఆపలేరన్నారు. తమిళ ప్రజల గుండెల్లో తానున్నానని... ఇప్పుడు వారి ఇళ్లలో కూడా ఉండాలనుకుంటున్నానని చెప్పారు.



కమల్‌ను ఆశీర్వదిస్తున్న కలాం సోదరుడు మహమ్మద్ ముత్తుమీరా

అక్కడి నుంచి మదురైదాకా మార్గమధ్యంలో ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తూ సాగారు. ఇందులో భాగంగా తాను పుట్టిన ఊరు పరమకుడిలోనూ ప్రసంగించారు. ''దాదాపు 45 ఏళ్ల తర్వాత ఇక్కడికి వచ్చాను. ఊరు మారిందిగానీ, ఇక్కడి మనుషుల మనసుల్లో మార్పులేదు. నేనెప్పటికీ ఈ నేలతల్లి బిడ్డనే. మీరంతా నన్ను సినీ'తార'గా చూశారు. కానీ, నేను తారను కాను... మీ ఇంటి దీపాన్ని... మీ చేతులు రక్షణగా ఉంచి నేను సదా వెలిగేలా సహకరించండి'' అని ఉద్వేగభరితంగా మాట్లాడారు. తాను మహాత్మాగాంధీ వీరాభిమానినని, ఆయన మదురైలోనే కొల్లాయి కట్టడం ప్రారంభించారని కమల్ గుర్తుచేశారు. ఏపీ సీఎం చంద్రబాబు తన హీరో అని చెప్పారు. ఆయన విజన్ అద్భుతమని కితాబిచ్చారు. ఆయన తనకు ఫోన్ చేశారని... ప్రజలకు ఏం చేయాలో సలహాలిచ్చారని చెప్పారు.

ప్యాకేజీపై స్పష్టత ఇవ్వాలి

- అప్పటి వరకూ కేంద్రంపై పోరాటం చేస్తాం
- జగన్‌కు, బీజేపీకి సంబంధం ఏంటో: సోమిరెడ్డి



అమరావతి, ఫిబ్రవరి 21 (మనం ప్రతినిధి): ప్రత్యేక హోదాకు బదులు కేంద్ర ప్రభుత్వం ఇస్తానన్న ప్రత్యేక ప్యాకేజీకి సంబంధించి ఇప్పటి వరకు స్పష్టత లేదని, ప్యాకేజీపై స్పష్టత ఇచ్చే వరకు కేంద్రంపై పోరాటం చేస్తామని మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. బుధవారం సచివాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీజేపీతో మిత్రబంధం కోసమే పొత్తుపెట్టుకున్నామని వివరించారు. గత కేంద్ర ప్రభుత్వం ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామని హామీ ఇచ్చిందని, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన ఎన్‌డీఏ.. ఆర్థిక సంఘం సిఫార్సుల ప్రకారం తాము ప్రత్యేక హోదా ఇవ్వలేమని, ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని చెప్పిందని మంత్రి వివరించారు. ప్రత్యేక హోదాకు సమానమైన ప్యాకేజీ ఇస్తామని అరుణ్ జైట్లీ ప్రకటించారని, అయితే ఇంతవరకూ ఎటువంటి సహాయం అందలేదని మంత్రి తెలిపారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తే మొట్ట మొదట సంతోషించే వ్యక్తి తానేనని ముఖ్యమంత్రి చంద్రబాబు గతంలోనే చెప్పారని, హోదా ఇవ్వలేకున్నా దానికి సమానమైన ప్యాకేజీ ఇచ్చినా సంతోషమేనని ప్రకటించారని తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ఏదైనా చేయగలిగే వ్యక్తి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాత్రమేనని మంత్రి అన్నారు. ఇప్పటి వరకు ప్రతిపక్ష నేత జగన్‌పై 12 చార్జిషీట్లు నమోదయ్యాయని, ఆయన ఇకనైనా అవినీతి రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. దేశ రాజకీయాల్లో అనుభవజ్ఞులైన నాయకుల్లో చంద్రబాబు ఒకరని, ఎవరు అధికారంలో ఉంటే వారి కాళ్లు పట్టుకునే నైజం జగన్‌దని మంత్రి విమర్శించారు. కేసుల మాఫీ కోసం జగన్ ఎంతదూరమైనా వెళతారని తెలిపారు. అసలు జగన్‌కు, బీజేపీకి ఉన్న సంబంధం ఏమిటో తెలపాలని డిమాండ్ చేశారు.

రెచ్చిపోతున్న విజయసాయిరెడ్డి..

జగన్‌కు కుడిభుజంగా ఉన్న ఏ2 విజయసాయి రెడ్డి రెచ్చిపోయి మాట్లాడుతున్నారని మంత్రి సోమిరెడ్డి విమర్శించారు. ఐఏఎస్ అధికారి సతీష్ చంద్ర, ఐపీఎస్ అధికారి వెంకటేశ్వరరావులను బెదిరిస్తూ, వారిని జైల్లో పెట్టిస్తామని అనడం సరికాదన్నారు. ఎమ్మెల్యే యరపతినేనిని బెదిరించడాన్ని ఖండిస్తున్నానని మంత్రి తెలిపారు. యరపతినేని ఓ మంచి ప్రజా నాయకుడని, మంచి స్వభావం గల వ్యక్తి అని అన్నారు. ఐఏఎస్ ఆఫీసర్‌ను జైల్లో పెట్టించిన ఘనత జగన్‌కే దక్కుతుందని మంత్రి అన్నారు. జగన్ వల్ల 12 మంది ఐఏఎస్ ఆఫీసర్లు నష్టపోయారని తెలిపారు.

రాష్ట్రానికి విలన్ చంద్రబాబే



- హోదాను అడ్డుకుంది ఆయనే
- అఖిలపక్షం పేరుతో డ్రామాలు
- ప్యాకేజీ తీసుకున్నప్పుడు గుర్తురాలేదా?
- వైసీపీ నేత పార్థసారథి ధ్వజం

అమరావతి, ఫిబ్రవరి 21 (మనం ప్రతినిధి): రాష్ట్ర ప్రయోజనాలను దగ్గరుండి మరీ అడ్డుకొంటున్న నంబర్ వన్ విలన్ చంద్రబాబేనని, ప్రత్యేక హోదా రాకపోవడానికి కారణం ఆయనేనని వైసీపీ అధికార ప్రతినిధి పార్థసారథి ధ్వజమెత్తారు. విజయవాడలోని వైసీపీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో కాంగ్రెస్ పార్టీ.. నేడు బీజేపీ రాష్ట్రానికి అన్యాయం చేయడానికి ఆయనే కారణమని పార్థసారథి ఆరోపించారు. అప్పుడు లేఖ రాసి రాష్ట్ర విభజనకు సహకరించారని, ఇప్పుడు ప్రత్యేక హోదా ఇవ్వొద్దని కేంద్రానికి వత్తాసు పలుకుతున్నారని విమర్శించారు. దేశంలోనే సీనియర్ రాజకీయ నాయకుడినని చెప్పుకొంటున్న చంద్రబాబు విశ్వసనీయత ఎంతో ప్రత్యేక హోదా విషయంలో స్పష్టమైపోయిందని చెప్పారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా రాకుండా అడ్డుకుంటున్నది సీఎం చంద్రబాబు ఒక్కరేనని పార్థసారథి ఆరోపించారు. హోదా కన్నా ప్యాకేజీనే మేలు అని ఇన్నాళ్లు మభ్యపెట్టారని, ఎన్నికలు దగ్గరకు వస్తుండటంతో ఇప్పుడు మాట మారుస్తున్నారని మండిపడ్డారు. ఇప్పుడు అఖిలపక్షం పేరుతో డ్రామాలు మొదలుపెట్టారని, ప్యాకేజీ చాలా బాగుందని అర్ధరాత్రి వేళ మీడియా సమావేశం పెట్టిన నాడు అఖిలపక్షం గుర్తురాలేదా అని ప్రశ్నించారు. చంద్రబాబు చేస్తున్న నీతి మాలిన రాజకీయాలను ప్రజలు చీదరించుకొంటున్నారని, ఆయన వెంటనే ప్రజలకు క్షమాపణ చెప్పి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

వ్యక్తిగత హాజరుకు మినహాయించండి

- హైకోర్టును ఆశ్రయించిన శ్రీనివాసన్

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (మనం లీగల్ ప్రతినిధి): ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ) దాఖలు చేసిన కేసులో సీబీఐ కోర్టు విచారణకు స్వయంగా హాజరుకావాలన్న ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ ఇండియా సిమెంట్స్ అధినేత శ్రీనివాసన్ హైకోర్టును ఆశ్రయించారు. గనుల లీజు, నీటి కేటాయింపులపై సీబీఐ పెట్టిన కేసును హైకోర్టు కొట్టేసిందని, దాని ఆధారంగా ఈడీ పెట్టిన కేసు విచారణ సమయంలో వ్యక్తిగత హాజరీ నుంచి మినహాయింపు ఇవ్వాలని ఆయన లాయర్ బుధవారం హైకోర్టులో వాదించారు. దీనిపై వివరాలు అందజేయాలని ఈడీని జస్టిస్ షమీమ్ అక్తర్ నోటీసులు జారీ చేశారు. సీబీఐ కేసుకూ ఈ కేసుకూ సంబంధం లేదని, ఇది మనీలాండరింగ్‌తో ముడిపడిన కేసు అని ఈడీ లాయర చెప్పారు. విచారణ 27కి వాయిదా పడింది.

'రిజర్వ్‌డు'పై జగన్ దృష్టి

- 37 అసెంబ్లీ స్థానాలపై అధినేత వ్యూహం
- రాబోయే ఎన్నికల్లో ఆధిపత్యంపై కసరత్తు
- ప్రతిచోటా ప్రత్యేక ప్రతినిధి నియామకం
- గెలుపోటములకు ప్రధాన బాధ్యులు వారే
- ఫిరాయింపుదారుల సీట్లు కైవసంపైనా శ్రద్ధ

అమరావతి, ఫిబ్రవరి 21 (మనం ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్‌లోని రిజర్వ్‌డ్ అసెంబ్లీ నియోజకవర్గాలపై వైసీపీ అధినేత జగన్ దృష్టిపెట్టారు. అలాగే ఫిరాయింపుదారులున్న స్థానాలను ఎలాగైనా తిరిగి కైవసం చేసుకోవాలని పట్టుదలతో ఉన్నారు. కాగా, రాష్ట్రంలోని 175 స్థానాలకుగాను 37 రిజర్వ్‌డు కేటగిరీలో ఉన్నాయి. మునుపటి ఎన్నికల సందర్భంగా వీటిలో అధికశాతం వైసీపీ ఖాతాలో పడ్డాయి. రాబోయే ఎన్నికల్లోనూ ఆ నియోజకవర్గాల్లో ఇదే ఆధిపత్యం సాధించాలని జగన్ వ్యూహరచన చేస్తున్నారు. రిజర్వ్‌డ్ స్థానాల్లో పార్టీ బలం బాగానే ఉన్నప్పటికీ అభ్యర్థులకు తగినమేర ఆర్థిక వనరులు సమకూర్చాల్సిన బాధ్యత పార్టీపైనే ఉంది. దీంతోపాటు కిందిస్థాయి శ్రేణులను మరింత బలోపేతం చెయ్యాలని పార్టీ నేతలను జగన్ ఆదేశించారు. ఈ మేరకు ఎస్సీ, ఎస్టీ స్థానాల్లో పార్టీ కార్యక్రమాలను ముమ్మరం చెయ్యాలని సూచించారు మరోవైపు ఈ 37 స్థానాల్లో టీడీపీకి కూడా సమాన బలం ఉంది. దీంతో వైసీపీ ద్వితీయ శ్రేణి నాయకత్వానికి అధికార పార్టీ గాలం వేయకుండా జాగ్రత్త వహించాలని జగన్ హెచ్చరించారు. ఇందులో భాగంగా ఆయా నియోజకవర్గాల్లో స్థానిక రాజకీయ స్థితిగతులపై ప్రణాళిక సిద్ధం చేయాలని కూడా ఆదేశించారు.


ప్రతి స్థానానికీ ప్రత్యేక ప్రతినిధి

రిజర్వ్‌డ్ నియోజకవర్గాల ఇన్‌చార్జిలకు తోడుగా ప్రత్యేక ప్రతినిధులను కూడా నియమించాలని జగన్ భావిస్తున్నారు. ప్రస్తుతం వైసీపీ ఖాతాలో ఉన్న పామర్రు, తిరువూరు, నందిగామ (కృష్ణాజిల్లా); రంపచోడవరం, రాజోలు (తూర్పు గోదావరి); పోలవరం, కొవ్వూరు, చింతలపూడి (పశ్చిమ గోదావరి); సూళ్లూరుపేట (నెల్లూరు); అరకు, పాడేరు (విశాఖ); రాజాం, పాలకొండ (శ్రీకాకుళం); కురుపాం, సాలూరు (విజయనగరం); యర్రగొండపాలెం (ప్రకాశం)లలో పార్టీ జెండా మళ్లీ ఎగరాలని వారికి స్పష్టం చేయనన్నారు. అభ్యర్థుల గెలుపోటములకు ప్రధానంగా బాధ్యత వహించాల్సింది ప్రత్యేక ప్రతినిధులేనని, ముఖ్యంగా ఫిరాయింపుదారుల స్థానాల్లో ఎన్ని ఎక్కువ సాధించగలిగితే అంతగా వైసీపీ అధికారంలోకి వచ్చే అవకాశాలుంటాయని ఆయన ముఖ్యనేతలతో అభిప్రాయపడినట్లు సమాచారం.



అన్యమత ఉద్యోగులకు ఊరట

- తొలగించరాదని టీటీడీకి హైకోర్టు ఆదేశం
- గత మధ్యంతర ఉత్తర్వులు పొడగింపు



హైదరాబాద్, ఫిబ్రవరి 21 (మనం లీగల్ ప్రతినిధి): టీటీడీలో పనిచేసే అన్యమత ఉద్యోగులకు హైకోర్టులో ఊరట లభించింది. హిందూయేతర ఉద్యోగులను తొలగించరాదని టీటీడీని ఆదేశించింది. టీటీడీలో పనిచేసే అన్యమత ఉద్యోగులకు ఆలయ ఈవో ఇచ్చిన నోటీసుకు సంజాయిషీ ఇవ్వాలని సూచించింది. వారి నుంచి ఈవో సంజాయిషీ అందుకున్నా ఏవిధమైన చర్యలూ తీసుకోరాదంటూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను హైకోర్టు పొడిగించింది. హిందూయేతరులను తొలగించరాదన్న ఉత్తర్వులు కొనసాగించాలని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ విజయలక్ష్మితో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశించింది. ఈవో నోటీసులు జారీ చేయడాన్ని సవాల్ చేస్తూ హిందూయేతర ఉద్యోగులు దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు విచారించింది. ఉద్యోగాల్లో చేరేటప్పుడు హిందూయేతర మతాల ప్రచారం చేయబోమని హామీ ఇచ్చారని, అందుకు అనుగుణంగా వారికి ఆదేశాలివ్వాలని ఈవో తరపు న్యాయవాది వాదించారు. దేవస్థానానికి హామీ ఇస్తే హైకోర్టు వారికి ఎలా ఆదేశాలు ఇస్తుందని బెంచ్ ప్రశ్నించింది. హామీ ఉల్లంఘన జరిగితే వారిపై దేవస్థానం చర్య తీసుకోవాలని సూచించింది. ఈ కేసులో ఈవో తమ వాదనతో కౌంటర్ దాఖలు చేయాలని బెంచ్ నోటీసులు ఇచ్చింది.

వందల కోట్ల అవినీతి

'లూ లూ'కు భూ కేటాయింపు క్విడ్ ప్రో కో

- ఈ వ్యవహారంపై సీబీఐ విచారణ చేయించాలి.. చంద్రబాబు వచ్చాక కబ్జాలు: విశాఖ నేతలు



సమావేశంలో పాల్గొన్న అఖిల పక్షం నాయకులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 21 (మనం న్యూస్ బ్యూరో): విశాఖపట్నం నడిబొడ్డున 12 ఎకరాల అత్యంత విలువైన భూములను ప్రైవేటు సంస్థ 'లూ లూ'కు నిబంధనలకు విరుద్ధంగా కేటాయించడంలో వందల కోట్ల అవినీతి దాగుందని మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు ఆరోపించారు. ఇది ఇచ్చిపుచ్చుకొనే ఒప్పందం (క్విడ్ ప్రోకో) కిందకే వస్తుందని అన్నారు. వేల కోట్ల విలువైన భూములను లూ లూ మాల్స్ సంస్థకు సంవత్సరానికి కేవలం ఆరున్నర కోట్ల రూపాయల లీజుకు ఇవ్వడాన్ని విశాఖలోని అఖిల పక్షనేతలు తప్పుపట్టారు. వైసీపీ నగర మాజీ అధ్యక్షుడు వంశీకృష్ణ శ్రీనివాస్ నేతృత్వంలో బుధవారం విశాఖలో జరిగిన అఖిల పక్ష రౌండ్ టేబుల్ సమావేశం ఈ వ్యవహారంపై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేసింది. సీఎం చంద్రబాబు లబ్ధిపొందేందుకు లూ లూకు భూములను అప్ప గించారని బాలరాజు ధ్వజ మెత్తారు. నగరంలోని ప్రజోపయోగ భూములను ప్రభుత్వం ప్రజావసరా లకు వినియోగించకుండా ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టడం అన్యాయమని వైసీపీ నగర అధ్యక్షుడు మళ్ల విజయప్రసాద్ పేర్కొన్నారు. విశాఖలోని విలువైన భూములపై చంద్రబాబు బృందం కన్నుపడిందని, వాటిని రక్షించుకొనేందుకు ప్రజలు సన్నద్ధం కావాలని సీపీఐ నేత కుమార్ పిలుపునిచ్చారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తరువాత విశాఖలో జరిగిన అభివృద్ధి కంటే భూకబ్జాలే ఎక్కువని లోక్‌సత్తా నేత శంకర్రావు ఆరోపించారు. సీఆర్‌జడ్ నిబంధనలను కూడా ఉల్లంఘిస్తూ కేటాయింపులు జరపడాన్ని ఏయూ విద్యార్థి సంఘం నేత ఆరేటి మహేశ్ తప్పుపట్టారు. వైసీపీ నేతలు మూర్తియాదవ్, గరికిన గౌరి, సీనియర్ పాత్రికేయులు వీ వీ రమణమూర్తి తదితరులు ప్రసంగించారు. విశాఖ భూముల రక్షణ కోసం దీర్ఘకాలిక ఉద్యమం చేపట్టాలని సమావేశంలో పాల్గొన్న వివిధ పార్టీల నేతలు నిర్ణయం తీసుకొన్నారు.

రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట


- ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి
- అతివేగం వల్లే ఎక్కువ ప్రమాదాలు
- నిబంధనలు అతిక్రమిస్తే జరిమానా
- అధికారులకు దినేశ్ కుమార్ ఆదేశం



అమరావతి, ఫిబ్రవరి 21 (మనం ప్రతినిధి): రోడ్డు ప్రమాదాల నివారణకు అడ్డుకట్ట వేయాలని, నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపే వారి నుంచి భారీగా అపరాధ రుసుము వసూలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేశ్ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం సచివాలయంలోని తన కార్యాలయంలో హోం, ఆర్ అండ్ బీ, వైద్య, ఆరోగ్య, పంచాయతీ రాజ్ శాఖ అధికారులతో ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన సీఎస్.. రాష్ట్రంలో జిల్లాల వారీగా చోటుచేసుకుంటున్న రోడ్డు ప్రమాదాల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. శ్రీకాకుళం, విజయనగరం, కడప జిల్లాల్లో అధికంగా రోడ్డు ప్రమాదాలు జరిగినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలని, ఇందుకోసం ప్రజల్లో చైతన్యం కల్పించాలని సీఎస్ సూచించారు. అతివేగం వల్లే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. రోడ్డు ప్రమాదాల ఫొటోల ప్రదర్శన ఏర్పాటు చేయడం వల్ల ప్రమాదాల వల్ల కలిగే నష్టాలపై ప్రజల్లో అవగాహన కలుగుతుందన్నారు. అదే సమయంలో హెల్మెట్లు, షీట్ బెల్టులు ధరించని వారితో పాటు మద్యం తాగి వాహనం నడిపే వారి నుంచి భారీ ఎత్తున అపరాధ రుసుములు వసూలు చేయాలని సీఎస్ ఆదేశించారు. తరచూ ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. శిథిలమైన రోడ్లను ఎప్పటికప్పుడు మరమ్మత్తులు చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. అతివేగం నివారణకు స్పీడ్ గన్‌లు ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రంలో రోడ్డు సేఫ్టీ ఫండ్ కోసం రూ.10 కోట్ల కేటాయింపునకు అంతకుముందు సమావేశం ఆమోదం తెలిపింది. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శులు అనూరాధ, నీరబ్ కుమార్ ప్రసాద్, పూనం మాలకొండయ్య, రవాణ శాఖ కమిషనర్ బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పోలవరానికి నిధులు

- నవయుగ కంపెనీకి రూ. 1244.36 కోట్లు
- ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ పెంపు
- 2017 జనవరి 1 నుంచి అమలు
- 3.86 లక్షల మంది ఉద్యోగులకు లబ్ధి
- ఏపీ మంత్రివర్గం నిర్ణయాలు: మంత్రి కాల్వ



అమరావతి, ఫిబ్రవరి 21 (మనం ప్రతినిధి): ట్రాన్స్‌ట్రాయ్ సంస్థ నత్తనడకన చేస్తున్న పోలవరం ప్రాజెక్టు పనులను వేగవంతం చేసేందుకు రంగంలోకి తీసుకొచ్చిన నవయుగ కంపెనీ.. ఆ పనులు చేపట్టేందుకు వీలుగా రూ. 1244.36 కోట్లను సంస్థకు మంజూరు చేస్తూ ఏపీ మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. ప్రాజెక్టులో కాంక్రీట్ పనులు చేపట్టేందుకు ఈ నిధులు కేటాయించారు. అలాగే.. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఒక విడత కరవు భత్యాన్ని మంజూరు చేస్తూ కూడా ఏపీ కేబినెట్ నిర్ణయం తీసుకుందని సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి కాల్వ శ్రీనివాసులు చెప్పారు. బుధవారం ఉదయం ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన ఏపీ కేబినెట్ సమావేశం జరిగింది. అనంతరం సమావేశ వివరాలను మంత్రి కాల్వ శ్రీనివాసులు మీడియాకు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 2015 వేతన సవరణ మేరకు 22.008 శాతం నుంచి 24.104 శాతం మేరకు డీఏ పెంచుతూ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. పెరిగిన 2.096 శాతం కరవు భత్యాన్ని 2017 జనవరి 1 నుంచి చెల్లిస్తారని చెప్పారు. యూజీసీ స్కేల్ వర్తించేవారికి డీఏ 132 నుంచి 136 శాతానికి పెరగనుందన్నారు. ఈ పెంపు వల్ల 3.86 లక్షల మంది ఉద్యోగులకు లబ్ధి చేకూరుతుందన్నారు. పెంచిన కరవు భత్యం నగదు రూపంలో ఈ ఏడాది ఏప్రిల్ 1న తీసుకునే మార్చి నెల జీతంతో పాటు అందిస్తారన్నారు. పాత బకాయిలను ఉద్యోగుల జీపీఎఫ్ ఖాతాలోకి జమ చేస్తారని, పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు, కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఉద్యోగులకు మార్చి నెల వేతనం నుంచే డీఏ పెంపు వర్తిస్తుందని చెప్పారు. కరవు భత్యం పెంపు వల్ల ప్రభుత్వంపై ప్రతి నెలా రూ.69.91 కోట్లు, ఏడాదికి రూ.838.87 కోట్ల చొప్పున భారం పడనుందని వివరించారు. అలాగే గ్రామ రెవెన్యూ సహాయకులకు ఇప్పుడున్న జీతానికి అదనంగా నెలకు రూ. 300 చొప్పున తాత్కాలికంగా పెంచుతూ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇందుకోసం ఏడాదికి రూ.6.57 కోట్ల భారం పడనుందన్నారు. ఈ రెండూ కలిపి ప్రభుత్వంపై రూ.845.44 కోట్ల భారం పడుతుందని తెలిపారు.


ఏపీ ఎకనామిక్ డెవలప్ మెంట్ బోర్డు(ఏపీఈడీబీ)కు స్వయం ప్రతిపత్తి కల్పించే ముసాయిదా బిల్లును ఆమోదించినట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేవారికి భయాలు లేకుండా వివాదరహితంగా ఉండేలా చూడటానికి బోర్డుకు స్వయం ప్రతిపత్తి కల్పించేందుకు ఈ బిల్లు దోహదపడుతుందని మంత్రిమండలి భావించినట్లు పేర్కొన్నారు. ఏపీ ఈడీబీ చట్టం 2018 అనుసరించి స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు(ఎస్ఐపీబీ), స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ కమిటీలకు కూడా స్వయం ప్రతిపత్తి కల్పించేలా బిల్లు రూపొందించారని వివరించారు.

విశాఖ, తిరుపతిలలో ఎఫ్ఈసీలు..

జీవీఎంసీ (గ్రేటర్ విశాఖ మునిసిపల్ కార్పొరేషన్) పరిధిలో కుటుంబ వినోద కేంద్రం (ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్ సెంటర్– ఎఫ్ఈసీ) ఏర్పాటుకు ఎస్‌పీఐ సినిమాస్ ప్రైవేట్ లిమిటెడ్ (డెవలపర్)కు 33 ఏళ్ల లీజు ప్రాతిపదికన 2.7 ఎకరాలను కేటాయించేందుకు జీవీఎంసీ కమిషనర్‌కు అనుమతి ఇస్తూ మంత్రిమండలి నిర్ణయం తీసుకుందని తెలిపారు. లీజు రూపంలో మొదటి ఏడాది రూ. 4.284 కోట్లు చెల్లించాల్సి ఉంటుందని, ఏడాదికి 5 శాతం చొప్పున లీజు మొత్తాన్ని పెంచేలా ఒప్పందం కుదుర్చుకుంటారని చెప్పారు. పీపీపీ పద్ధతిలో చేపట్టే ఈ ప్రాజెక్టును రూ. 25 కోట్లతో రెండేళ్లలో పూర్తిచేసేలా ఒప్పందం కుదుర్చుకుంటారన్నారు. ప్రాథమికంగా ఏపీ టూరిజం కార్పొరేషన్(ఏపీటీడీసీ) దీని ఖర్చులను భరించి పర్యాటక ప్రాజెక్టుగా దీనిని నిర్వహిస్తుందని చెప్పారు. తిరుపతి అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ (తుడా) పరిధిలో ఎఫ్ఈసీ ఏర్పాటుకు అన్నమయ్య సర్కిల్‌లో 33 ఏళ్లకు లీజు ప్రాతిపదికన 3.72 ఎకరాల భూమిని ఎస్‌పీఐ సినిమాస్‌కు కేటాయించేందుకు తుడా వైస్ చైర్మన్‌కు అనుమతిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. యాంటీ కరప్షన్ బ్యూరో (ఏసీబీ)లో కొత్తగా 350 పోస్టులను భర్తీ చేసేందుకు మంత్రి మండలి ఆమోదం లభించింది. అందులో 300 ఖాళీలను నేరుగానూ, మిగిలిన 50 ఖాళీలను ఔట్‌సోర్సింగ్ విధానంలో భర్తీ చేయాలని నిర్ణయించినట్లు మంత్రి చెప్పారు.

సెన్సెక్స్ ఫిబ్రవరి 2018 21


33,844.86 ▲141.27



పెరిగినవి	%	తగ్గినవి	%
టీసీఎస్	3.33	సన్ ఫార్మా	-6.19
ఐటీసీ	2.00	ఇండస్ ఇండ్	-1.93
ఓఎన్‌జీసీ	1.66	టాటా స్టీల్	-1.57
ఎస్‌బిఐ	1.28	టాటా మోటార్స్	-1.23
ఇన్ఫోసిస్	1.23	బజాజ్ ఆటో	-0.97

నిఫ్టీ ఫిబ్రవరి 2018 21

10,397.45 ▲37.05



పెరిగినవి	%	తగ్గినవి	%
హెచ్‌సీఎల్ టెక్	3.91	సన్ ఫార్మా	-6.03
టెక్ మహీంద్రా	3.66	హిందాల్కో	-3.28
టీసీఎస్	3.31	బజాజ్ ఫినాన్స్	-2.58
ఐటీసీ	1.88	ఇండస్ ఇండ్	-1.75
ఓఎన్‌జీసీ	1.68	టాటా స్టీల్	-1.59

టాప్ గైనర్స్ 21 ఫిబ్రవరి


33,844.86
బి.ఎస్.ఇ సెన్సెక్స్ ▲141.27

		%
3043.05	టీసీఎస్	3.33%
268.05	ఐటీసీ	2.00%
190.10	ఓఎన్‌జీసీ	1.66%
273.10	ఎస్‌బిఐ	1.28%
1148.70	ఇన్ఫోసిస్	1.23%
928.35	రిలయన్స్	0.97%
1054.75	కోటక్ మహీంద్రా	0.93%
312.15	యస్ బ్యాంక్	0.92%
1824.10	హెచ్‌డీఎఫ్‌సీ	0.83%
535.20	యాక్సిస్ బ్యాంక్	0.66%

బులియన్ | గత 7 రోజులు



రూపాయి వర్సెస్ డాలర్



నిలదొక్కుకున్న మార్కెట్లు

మూడు సెషన్ల నష్టాలకు బ్రేక్ వేసి, లాభాల్లో ముగిసిన సూచీలు

ముంబయి: వరుసగా మూడు సెషన్లలో నష్టాలు మూటగట్టుకున్న దేశీయ స్టాక్ మార్కెట్ బుధవారం ఎట్టకేలకు లాభాల బాట పట్టింది. ఐ.టి షేర్లలో స్థిరంగా కొనసాగిన కొనుగోళ్ళు, పి.ఎస్.యు బ్యాంక్ కౌంటర్లలో రికవరీతో బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజ్ (బి.ఎస్.ఇ) సెన్సెక్స్ 141 పాయింట్లు పుంజుకుంది. ఐ.టి షేర్ల కాకుండా, ఎఫ్.ఎం.సి.జి, ఆయిల్ అండ్ గ్యాస్ షేర్లు మార్కెట్ ర్యాలీకి ప్రధానంగా తోడ్పడ్డాయి. మార్కెట్లలో ఉత్సాహం నింపిన అంశాల్లో ఆసియాలో ఇతర స్టాక్ మార్కెట్లు బలపడుతున్న ధోరణి, ముడి చమురు ధరల్లో స్వల్ప తగ్గుదల అగ్ర భాగంలో నిలుస్తాయి. ఫిబ్రవరి ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ గడువు రేపటితో ముగుస్తూండడంతో స్పెక్యులేటర్ల షార్ట్-కవరింగ్ కూడా ఆరోహణ గతికి ఊతమిచ్చింది. ''వరుసగా కొనసాగిన పతన ధోరణి తర్వాత, మార్కెట్ బుధవారం సానుకూల ధోరణితో ముగియగలిగింది. ఐ.టి ఇండెక్స్ అద్భుతమైన పనితీరు కనబరచడం, పి.ఎస్.యు బ్యాంకుల షేర్ల ధరలు పుంజుకోవడం దానికి ప్రధాన కారణం. మదుపురులు దిశా నిర్దేశం చేయగల తాజా అంశాల కోసం ఎదురుచూస్తున్నారు. త్రైమాసిక ఫలితాలు కంపెనీల రాబడులు పుంజుకోవడం ప్రారంభించాయి. కానీ, ద్రవ్యోల్బణంపై ఆందోళన, వడ్డీ రేటులో పెరుగుదల వాల్యుయేషన్‌పై ఒత్తిడి పెంచవచ్చు'' అని జియోజీత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ పరిశోధన విభాగాధిపతి వినోద్ నాయర్ చెప్పారు.

బి.ఎస్.ఇ 30 షేర్ల సెన్సెక్స్ బుధవారం 33,911.36 పాయింట్ల గరిష్ఠ స్థాయిని తాకిన తర్వాత, లాభాల స్వీకరణకు కుంగి, 33,702.50 పాయింట్ల కనిష్ఠ స్థితిని చూసింది. తర్వాత, పుంజుకుని 33,844.86 పాయింట్ల వద్ద ముగిసింది. గత మూడు సెషన్లలో సెన్సెక్స్ 593.88 పాయింట్లు కోల్పోయింది. విదేశీ మదుపరులు కొనసాగించిన అమ్మకాలు, క్షీణిస్తున్న రూపాయి విలువపై ఆందోళనలు అందుకు ప్రధానంగా పురికొల్పిన అంశాలు. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్.ఎస్.ఇ) సూచి 'నిఫ్టీ' బుధవారం 10,426.10 పాయింట్లు 10,349.60 పాయింట్ల మధ్య ఊగిసలాడి చివరకు 10,397.45 పాయింట్ల వద్ద ముగిసింది.



గీతాంజలికి తాళాలు

గీతాంజలి జెమ్స్ షేర్ల ధర వరుసగా ఆరవ సెషన్‌లోనూ క్షీణించింది. కంపెనీని మూసివేయనున్నట్లు యాజమాన్యం తన ఉద్యోగులకు వర్తమానం ఇచ్చినట్లు వార్తలు రావడంతో కంపెనీ షేర్ ధర రూ. 27.46 కనిష్ఠ స్థితికి పడిపోయింది. ఇక భరోసా పత్రాల కుంభకోణానికి మూల బిందువైన పి.ఎన్.బి షేర్ ధర 5 రోజుల్లో 56 శాతం పైగా క్షీణించింది.

కొనసాగుతున్న విదేశీ ఫండ్ల అమ్మకాలు

తాత్కాలిక డాటా ప్రకారం, మంగళవారం దేశీయ మదుపు సంస్థలు రూ. 1437.24 కోట్ల విలువ చేసే షేర్లు కొనుగోలు చేయగా, విదేశీ పోర్ట్ ఫోలియో ఇన్వెస్టర్లు రూ. 850.35 కోట్ల విలువ చేసే షేర్లు విక్రయించారు.

తగ్గిన ముడి చమురు ధరలు

అమెరికా వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ ముడి చమురు ఫ్యూచర్లలో పీపాకు 81 సెంట్లు తగ్గి 60.98 డాలర్లుగా నిలిచింది. బ్రెంట్ క్రూడ్ పీపాకు 0.79 సెంట్లు తగ్గి 64.46 అమెరికన్ డాలర్లు పలుకుతోంది. అంతర్జాతీయ మార్కెట్లలో జపాన్ నికాయ్ 0.21 శాతం, హాంకాంగ్ హ్యాంగ్ సెంగ్ 1.81 శాతం పెరుగుదలను చూశాయి. చైనాలో మార్కెట్లు బుధవారం కూడా మూసి ఉన్నాయి. ఐరోపా మార్కెట్లు తొలి లావాదేవీల్లో బలహీన ధోరణిని కనబబరచాయి.

భూషణ్ రేసులో రెండే సంస్థలు

న్యూఢిల్లీ: ఖాయిలాపడిన భూషణ్ పవర్ అండ్ స్టీల్ లిమిటెడ్‌ను స్వాధీనం చేసుకునేందుకు బ్రిటన్ కేంద్రంగా ఉన్న లిబర్టీ హౌస్ వేసిన బిడ్‌ను రుణ దాతల కమిటీ (సి.ఓ.సి) తిరస్కరించింది. దీంతో దాని స్వాధీన రేసులో టాటా స్టీల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ సంస్థలు మాత్రమే మిగిలినట్లయింది. బిడ్‌లను సమర్పించడానికి ఫిబ్రవరి 8 చివరి తేదీ కాగా, లిబర్టీ హౌస్ మంగళవారం తన బిడ్‌ను సమర్పించింది. దాంతో సి.ఓ.సి దాని ప్రతిపాదనను తిరస్కరించినట్లు తెలిసింది. లిబర్టీ హౌస్ బుధవారం సాగిన సి.ఓ.సి సమావేశంలో టాటా స్టీల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ సంస్థల బిడ్‌ల వివరాలను పరిశీలించారు. న్యాయ సలహాదారులు వాటిని మదింపు చేయనున్నారు. బిడ్‌లలో అవి పేర్కొన్న షరతులు, నిబంధనలను సమావేశంలో రుణ దాతలకు వెల్లడించినట్లు విశ్వసనీయ వర్గాల వారి ద్వారా తెలిసింది. భూషణ్ పవర్ అండ్ స్టీల్ తన రుణ దాతలకు సుమారు రూ. 45,000 కోట్లు బకాయి పడింది. తాజా పరిణామాలపై వ్యాఖ్యానించేందుకు పరిష్కార వృత్తి నిపుణుడు (ఆర్.పి) మహేందర్ కుమార్ ఖండేల్‌వాల్ నిరాకరించారు. టాటా స్టీల్ రుణ దాతల చేతికి రూ. 17,000 కోట్లు ఇచ్చి, భూషణ్ సంస్థ నిర్వహణకు రూ. 7,200 కోట్లు కేటాయించేందుకు ముందుకు వచ్చినట్లు ఆ వర్గాల ద్వారా తెలిసింది. రుణ దాతలకు ఇప్పుడు రూ. 11,000 కోట్లు ఇచ్చి, భూషణ్ సంస్థను నడిపించడానికి రూ. 2000 కోట్లు వెచ్చిస్తామని జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్రతిపాదించినట్లు తెలిసింది. భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్.బి.ఐ) నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ పరిశీలనకు పంపిన 12 నిరర్థక ఆస్తుల ఖాతాలలో భూషణ్ స్టీల్ అండ్ పవర్ ఒకటి. భూషణ్ స్టీల్ కేసులో దివాలా ప్రక్రియకు రుణ దాతల కన్సార్టియంకు నేతృత్వం వహిస్తున్న ఎస్.బి.ఐ పిటిషన్ దాఖలు చేసింది. పి.ఎన్.బి కూడా అదే విధంగా అభ్యర్థించింది.

ప్రాంతీయ భాషల్లో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం

- **నోయిడాలో తెలుగు వెలుగు**

హైదరాబాద్: నోయిడాలో వెయ్యి మందికి ఉపాధి కల్పించే కేంద్రాన్ని పల్సస్ గ్రూప్ స్థాపిస్తోందని ఒమిక్స్, పల్సస్ గ్రూప్ సి.ఇ.ఓ డాక్టర్ శ్రీనుబాబు గేదెల ప్రకటించారు. ప్రతీ ఒక్కరికీ శాస్త్ర, ఆరోగ్య రక్షణ సమాచారం ఉచితంగా అందుబాటులో తెచ్చే బృహత్తర ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుట్టినట్లు ఆయన తెలిపారు. దీనికి ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం సహకారం అందిస్తోందని డాక్టర్ శ్రీనుబాబు తెలిపారు. లక్నోలో మంగళవారం ఆరంభమైన ఉత్తరప్రదేశ్ ఇన్వెస్టర్ సమ్మిట్‌కు యూపీ ప్రభుత్వ ఆహ్వానం మేరకు ఆయన హాజరయ్యారు. ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, కేంద్ర మంత్రి సురేష్ ప్రభు, ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రాలతోపాటు విందు సమావేశంలో పాల్గొన్నట్లు శ్రీనుబాబు చెప్పారు. వైద్యారోగ్య శాస్త్ర, ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన సమస్త సమాచారం ప్రాంతీయ భాషల్లోకి అనువదించి ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచాల్సిన ఆవశ్యకతను సీఎం, కేంద్ర మంత్రులకు వివరించినట్లు ఆయన చెప్పారు. ఇంగ్లీష్ నుంచి భారతీయ భాషల్లోకి సైంటిఫిక్, హెల్త్‌కేర్ లిటరేచర్‌ను అనువదించి ఓపెన్ యాక్సెస్‌లో ఉంచడం వల్ల దేశంలో మారుమూల పల్లెలకు సైతం విజ్ఞానం అందించవచ్చని తద్వారా ఆరోగ్య భారతదేశాన్ని, జాతీయాభివృద్ధిని సాధించొచ్చని శ్రీనుబాబు వివరించారు. ప్రత్యక్షంగా వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించడంతోపాటు పరోక్షంగా లక్షలాది మందికి వైద్యారోగ్య పరిరక్షణ సమాచారం ఉచితంగా అందించడం తన ధ్యేయమని ఆయన ప్రకటించారు. పరిశోధనలకు భాష అవరోధం కాకూడదని ఆయన అభిప్రాయపడ్డారు. హిందీలోనూ జర్నల్స్ తెచ్చేందుకు నోయిడా కేంద్రం కానుంది. ఇతర ప్రాంతాలతో పోల్చితే ఉత్తర ప్రదేశ్‌లో చక్కని హిందీ భాష రాయగలిగేవారు ఎక్కువగా ఉన్నారు. దీంతోపాటు యూపీలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల నుంచి లైఫ్ సైన్సెస్, ఫార్మా రంగంలో డిగ్రీలు పూర్తి చేసిన విద్యార్థులు ప్రతి ఏటా వేలాది మంది బయటకు వస్తున్నారు. వీరి సహకారంతో హిందీలో జర్నల్స్ తీసుకురావాలని ఒమిక్స్ ప్రయత్నం.



ఇటీవల టైమ్స్ సంస్థ చేసిన ఓ అధ్యయనంలో 2020-2011 నాటికి 75 శాతం మంది భారతీయులు ప్రాంతీయ భాషలలో ఉన్న వ్యాసాలు చదివేందుకు ఆసక్తి చూపడంతోపాటు, ఇంటర్నెట్‌లో తమకు కావాల్సిన అంశాలను మాతృ భాషలోనే సెర్చ్ చేస్తారని వెల్లడించింది. ఒమిక్స్, పల్సస్ గ్రూపుల ప్రతిపాదిత ప్రాజెక్టులు పూర్తయితే స్థానిక భాషల్లో సమాచారం అంతా అందుబాటులోకి వచ్చి భారతదేశం వైద్యారోగ్య, ఆరోగ్య పరిరక్షణ సమాచారానికి విశ్వ విజ్ఞాన కేంద్రంగా రూపొందుతుందని ఆయన అన్నారు. విశేషమైన అనుభవం, సైంటిఫిక్.. హెల్త్‌కేర్ సబ్జెక్ట్‌లపై పూర్తిగా పట్టు, ప్రపంచ భాషలన్నిం టిలోకి ఆర్టికల్స్ అనువదించిన అనుభవం, నిపుణులైన అత్యధిక మంది ఉద్యోగులు, అత్యాధునిక సౌకర్యాలున్న పల్సస్, ఒమిక్స్ సంస్థలే ఈ అనితర సాధ్యమైన ప్రాజెక్ట్‌ను విజయవంతంగా పూర్తి చేయగలవని ఆయన చెప్పారు. వైజ్ఞానిక, ఆరోగ్య రక్షణ రంగాలకు చెందిన వెయ్యికి పైగా జర్నల్స్..25 మిలియన్ల పేజీల సమాచార సంపదను సృష్టించిన ఘనత పల్సస్ గ్రూప్‌దేనన్నారు. ఈ ప్రాజెక్ట్ వల్ల 5000 మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయి. అందరికీ అన్ని భాషలూ రావు. అందుకే వివిధ ప్రాంతీయ భాషల్లో జర్నల్స్ అనువాదం చేసి అందిస్తున్నాం.

ఒమిక్స్, పల్సస్ విజయప్రస్థానం

ఒకే ఒక్క జర్నల్‌తో ఒమిక్స్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ 2009లో ప్రారంభించిన ప్రస్థానం నేడు 1000కి చేరింది. క్లినికల్, మెడికల్, ఇంజనీరింగ్, టెక్నాలజీ రంగాలలో శాస్త్ర సాంకేతిక, ఆరోగ్య పరిరక్షణకు ఉద్దేశించిన జర్నల్స్‌ను అందుబాటులోకి తెచ్చింది. ప్రస్తుతం ఏడాదికి 50,000 శాస్త్ర పరిశోధక వ్యాసాలు ఆన్‌లైన్‌లో ప్రచురిస్తున్నారు. ఇప్పటివరకూ 40 దేశాలలో 3,000 పైగా వైద్యారోగ్య, శాస్త్ర సాంకేతిక రంగాలకు సంబంధించిన సదస్సులు నిర్వహించింది. డాక్టర్ శ్రీనుబాబు ఆధ్వర్యంలోని ఒమిక్స్ సంస్థ 60,000 వేలకు మందికి పైగా ప్రపంచస్థాయి శాస్త్రవేత్తలు, పారిశ్రామికవేత్తలు, పరిశోధకులు, పరిశోధక విద్యార్థులకు ఒక వేదిక కల్పించింది. ఈ క్రమంలో యూరోప్, కెనడా, యూఎస్ఏ, రష్యా దేశాలలోని కొన్ని కంపెనీలను స్వాధీనం చేసుకుంది. 30 ఏళ్లకు పైగా విశేష అనుభవం ఉన్న కెనడాకు చెందిన హెల్త్ ఇన్‌ఫర్మాటిక్స్, మెడికల్ అండ్ సైంటిఫిక్ వ్యాసాల ప్రచురణ సంస్థ అయిన పల్సస్ గ్రూప్ డాక్టర్ శ్రీనుబాబు నిర్వహణలోకి వచ్చింది.

ఒమిక్స్, పల్సస్ గ్రూపులో ప్రస్తుతం 3500 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరిలో 75 శాతం మంది మహిళా ఉద్యోగులే ఉన్నారు. వీరంతా చెన్నై, హైదరాబాద్, ఢిల్లీలలో పని చేస్తున్నారు. పల్సస్ గ్రూప్ సొంతంగా హైదరాబాద్‌లో ఐటీ, ఐటీ ఆధారిత సర్వీసుల క్యాంపస్‌లు, లైఫ్ సైన్సెస్, మానవ వనరులు నైపుణ్యాభివ ద్ధి కేంద్రం, ఆరోగ్య పరిరణక్ష సమాచారం అనువాద కేంద్రాలను నెలకొల్పే దిశగా ప్రయత్నాలు చేస్తోంది. రానున్న ఐదేళ్లలో 10 వేల కోట్ల పెట్టుబడులతో ఈ సంస్థలను విశాఖపట్నం, హైదరాబాద్, నోయిడాలలో నెలకొల్పడం లక్ష్యం పెట్టుకుని ఆ దిశగా ప్రణాళికలు సిద్ధం చేసుకుంది. 1984లో ఆరంభమైన పల్సస్ గ్రూప్ అనే ఓ బహుళజాతి కంపెనీని ఒమిక్స్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ 2016లో కైవసం చేసుకుంది. లండన్ , సింగపూర్, టొరంటో, హైదరాబాద్ నుంచి పల్సస్ గ్రూప్ కార్యకపాలాలను నిర్వహిస్తోంది. హెల్త్ టెక్, హెల్త్ ఇన్‌ఫార్మాటిక్స్, మెడికల్ పబ్లిషింగ్, ఫార్మా కో విజిలెన్స్ సేవలను పల్సస్ గ్రూప్ నిర్వహిస్తోంది.

పెట్టుబడుల ఉపసంహరణ

- **మరో జాబితా సిద్ధమవుతోంది**


న్యూఢిల్లీ: ప్రైవేటీకరించడానికి అనువైన, ఖాయిలా పడిన ప్రభుత్వ రంగ సంస్థల (పి.ఎస్.యుల) జాబితాను మరోదానిని ప్రభుత్వ మేధావుల బృందం నీతి ఆయోగ్ రూపొందిస్తోందని ఆ సంస్థ సి.ఇ.ఓ అమితాబ్ కాంత్ బుధవారం వెల్లడించారు. ప్రభుత్వ యాజమాన్యంలో నడుస్తున్న ఖాయిలా పడిన కంపెనీల వికసనశీలతను పరిశీలించవలసిందిగా ప్రధాన మంత్రి కార్యాలయం (పి.ఎం.ఓ) నీతి ఆయోగ్‌ను కోరింది. ఖాయిలా పడిన 40 ప్రభుత్వ రంగ సంస్థలలో వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంహరణకు ఆయోగ్ ఇప్పటికే సిఫార్సు చేసింది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ పబ్లిక్ ఎసెట్ మేనేజ్‌మెంట్ (డీఐపీఏఎం) దానిపై పని చేస్తోంది. ప్రక్రియ తుది దశలో ఉంది. ''(ఖాయిలా పడిన పి.ఎస్.యులకు సంబంధించి) మేం ఇప్పటికే నాలుగు జాబితాలు పంపాం. ఇప్పుడు ఐదవ జాబితా తయారీ పనిలో ఉన్నాం. (ఖాయిలా పడిన పి.ఎస్.యుల) ఆరవ, ఏడవ జాబితాలను కూడా మేం తయారు చేస్తాం'' అని



కాంత్ చెప్పారు. పి.ఎస్.యులలో పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా ఈ ఆర్థిక సంవత్సరంలో సేకరించిన దానికన్నా రూ. లక్ష కోట్ల తక్కువగా, వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ. 80,000 కోట్లు సమీకరించాలని ప్రభుత్వం భావిస్తోంది. పి.ఎస్.యులలో పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా రూ. 72,500 కోట్లు సమీకరించాలని 2017-18 బడ్జెట్‌లో లక్ష్యంగా పెట్టుకున్నారు. సి.పి.ఎస్.ఇలలో పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా సేకరించే రూ. 46,500 కోట్లు, వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా వచ్చే రూ. 15,000 కోట్లు, బీమా కంపెనీల లిస్టింగ్ ద్వారా చేకూరే రూ. 11,000 కోట్లు కూడా దానిలో ఇమిడి ఉన్నాయి.

వృద్ధి 7 శాతం పైన సాధ్యమే

న్యూఢిల్లీ: విధానపరమైన సంస్కరణలు, అధిక పెట్టుబడులు, నిలకడగా ఉన్న అంతర్జాతీయ వృద్ధి వాతావరణాన్ని ఊతంగా చేసుకుని భారతదేశపు మధ్యకాలిక వృద్ధి సామర్థ్యం 7 శాతం పైనే ఉంటుందని యు.బి.ఎస్ నివేదిక ఒకటి వెల్లడించింది. బ్రెజిల్ (2.2-2.8 శాతం), రష్యా (1.5-2.0 శాతం), ఇండోనేషియా (5.4-5.8 శాతం), చైనా (5.5-6.0 శాతం) వంటి ఇతర ప్రవర్ధమాన మార్కెట్లతో పోలిస్తే మధ్యకాలిక వృద్ధి సామర్థ్యంలో భారతదేశం హెచ్చు ర్యాంక్‌లో నిలుస్తుందని ఆ గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసుల దిగ్గజం పేర్కొంది. మధ్యకాలంలో భారతదేశం వృద్ధి సామర్థ్య అవకాశాలు క్రమంగా మెరుగుపరచుకునేందుకు మౌలిక వసతులలో పెట్టుబడులు పెంపొందించడం, కార్మిక మార్కెట్ సంస్కరణలు, విద్య, ఆరోగ్య సంస్కరణలు, నియంత్రణ పరమైన ప్రతిబంధకాలు సడలించడం తదితర చర్యలను తీసుకోవలసి ఉందని ఆ నివేదిక పేర్కొంది. అయితే, ద్రవ్యపరమైన ప్రతిబంధకారు, మందగొడిగా ఉన్న పెట్టుబడుల



చక్రభ్రమణాన్ని దృష్టిలో పెట్టుకున్నప్పుడు, వచ్చే రెండు మూడేళ్ళలో వృద్ధి సామర్థ్యాన్ని మెరుగుపరచుకోకుండా భారతదేశపు ఆర్థిక వృద్ధిని 8 శాతానికి మించి తీసుకెళ్ళడం కష్టమవుతుంది. స్థూల స్థిర రిస్కులను విస్తృత పరచవలసి ఉంటుంది. ఆ రకమైన వృద్ధి ''కొనసాగించలేనిదిగా'' కూడా తయారవుతుందని నివేదిక తెలిపింది.

స్వల్ప మెరుగుదల

పెట్టుబడులు ఓ మోస్తరుగా ఉండి, సంస్కరణల వేగం బలహీనపడడంతో 2003-08లో సగటున 7.6 శాతంగా ఉన్న వృద్ధి సామర్థ్యం 2014-15లో 6.7 శాతానికి తగ్గింది. ''అయితే, గత నాలుగేళ్ళలో, భారతదేశపు వృద్ధి సామర్థ్యం మా అంచనాల ప్రకారం, స్వల్పంగా మెరుగుపడి, 2016-17లో 7 శాతం స్థాయికి ఎగువన నిలిచింది'' అని యు.బి.ఎస్ పేర్కొంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం చేపట్టిన ఆర్థిక, సంస్థాపరమైన సంస్కరణల ఫలితంగానే జి.డి.పిలో వృద్ధి మెరుగుదల చాలా వరకు సాధ్యపడినట్లు యు.బి.ఎస్ ప్రకటన తెలిపింది. జి.ఎస్.టి అమలు, ద్రవ్యోల్బణాన్ని లక్ష్యంగా పెట్టుకుని విధానాల అమలు, కొత్త దివాలా కోడ్, సమ్మిళిత ఫైనాన్షియల్ సేవలు, వ్యాపార నిర్వహణ వాతావరణాన్ని మెరుగుపరచడం, గుప్త ధనాన్ని అరికట్టే చర్యలు, డిజిటలీకరణను ప్రోత్సహించడం వంటివాటిని అది ఉదాహరణగా చూపింది.

ఇండియన్ బ్యాంక్ హోమ్ లోన్ 8.25%

హైదరాబాద్: గృహ రుణాల వడ్డీ రేటు సవరించి 8.25 శాతానికే అందజేస్తున్నట్లు ఇండియన్ బ్యాంక్ ఒక ప్రకటనలో తెలిపింది. దీనిని బ్యాంకింగ్ పరిశ్రమలోనే అతి తక్కువ వడ్డీగా అది పేర్కొంది. ఎలాంటి గరిష్ఠ పరిమితి లేకుండా ఎంత మొత్తంలో తీసుకునే గృహ రుణానికైనా ఇదే వడ్డీ రేటు వర్తిస్తుందని తెలిపింది. 30 ఏళ్ళపాటు చెల్లించే విధంగా తీసుకునే రుణంపై లక్ష రూపాయలకు 751 రూపాయల చొప్పున నెలవారీ వాయిదా మొత్తాన్ని చెల్లించవలసి ఉంటుందని వివరించింది. ఖాతాదారులు, కొత్తగా గృహాల కొనుగోలుకు వెళుతున్నవారు ఈ రుణ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చని ఇండియన్ బ్యాంక్ జోనల్ మేనేజర్ ఆర్. మనోహర్ తెలిపారు. జంట నగరాలలోని ఇండియన్ బ్యాంక్ శాఖలు 24 గంటల లోపు రుణాలు మంజూరు చేస్తున్న సంగతిని ఆయన గుర్తు చేశారు. బ్యాంక్ 2017 డిసెంబరు 31తో ముగిసిన తొమ్మిది నెలల కాలంలో రూ. 1127.01 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది.

అందుబాటులో ఫ్యాషన్ దుస్తులు



హైదరాబాద్: ఆర్పీ-సంజీవ్ గోయంకా గ్రూప్‌నకు చెందిన టూబీమీ అపెరల్స్ రానున్న శరద్, హేమంత రుతువులను దృష్టిలో ఉంచుకుని కొత్త ఫ్యాషన్ దుస్తుల శ్రేణిని ప్రవేశపెట్టింది. టూబీమీ బ్రాండ్‌ను 2017 ఫిబ్రవరిలో ప్రారంభించారు. ఫ్యాషన్ పరిశ్రమలో అది తనకంటూ ఒక స్థానాన్ని సృష్టించుకుంది. టూబీమీ దుస్తులు సరసమైన ధరలకు లభించేవిగా, అదే సమయంలో ఆకర్షణీయమైన డిజైన్, ఫ్యాషన్, మన్నికైనవిగా పేరు తెచ్చుకున్నాయి. ఎంపిక చేసిన స్పెన్సర్ రిటైల్ దుకాణాలలో ఇవి అందుబాటులో ఉన్నాయి. షూలు, బెల్టులు, బ్యాగులు వంటి ఫ్యాషన్ అనుబంధ వస్తువులను కూడా టూబీమీ అందిస్తోంది. టూబీమీ ఉత్పత్తుల ధర రూ. 199 నుంచి రూ. 1499 వరకు ఉంది. తొంభై శాతం ఉత్పత్తులు రూ. 999 అంతకన్నా తక్కువ ధరలకు లభిస్తున్నాయి. టూబీమీ దేశంలోకి మొదటిసారిగా 'ఫాస్ట్ మూవింగ్ ఫ్యాషన్ గూడ్స్' భావనను తీసుకొచ్చింది. దానికనుగుణంగానే అది నాలుగు వారాల కొకసారి దుకాణాల అరల్లోకి కొత్త తరహా దుస్తులు వచ్చేట్లు చేస్తోంది. వినియోగదారులు దుకాణాన్ని సందర్శించిన ప్రతిసారీ వారికి తాజా ఫ్యాషన్ దుస్తులు దర్శనమిస్తూంటాయి. ఫ్యాషన్‌ను అందరికీ అందుబాటులోకి తేవడం టూబీమీ బ్రాండ్ ప్రత్యేకతగా స్పెన్సర్స్ రిటైల్‌లో దుస్తుల విభాగ ఉపాధ్యక్షుడు బి. జగదీశ్ చెప్పారు. స్త్రీ, పురుషులకు టూబీమీ 2200లకు పైగా స్టైల్ అవకాశాలు కల్పిస్తోంది. జంట నగరాలలో మల్కాజ్‌గిరి, ముషీరాబాద్, అత్తాపూర్, ఎల్.బి.నగర్, బోయిన్‌పల్లిలలో టూబీమీ బ్రాండ్ దుస్తులు అందుబాటులో ఉన్నాయి. దేశంలోని 20 నగరాల్లో 41 స్టోర్సుల్లో వాటిని అమ్ముతున్నారు.

బాండ్ల జారీతో నిధుల సేకరణ

న్యూఢిల్లీ: రూ. 3,000 కోట్ల విలువైన బాసెల్ త్రీ అనుసరణ టైర్ 2 బాండ్ల జారీకి మూలధన సమీకరణ కమిటీ ఆమోదం తెలిపినట్లు ప్రైవేటు రంగ యస్ బ్యాంక్ తెలియజేసింది. సగటున రూ. 3,000 కోట్లు సమీకరించేందుకు రుణ పత్రాల స్వరూప స్వభావాలు కలిగిన ఒక్కొక్కటి రూ. 10,00,000 విలువ చేసే రేటెడ్, లిస్టెడ్, నాన్-కన్వెర్టిబుల్, పునర్ కొనుగోలు సదుపాయమున్న, సెక్యూరిటీ లేని, బాసెల్ త్రీ విధేయ టైర్ 2 బాండ్ల జారీకి బ్యాంక్ బోర్డునకు చెందిన మూలధన సమీకరణ కమిటీ ఆమోదం తెలిపిందని యస్ బ్యాంక్ పేర్కొంది. ఒకటి లేదా అంతకుమించిన విడతల్లో రుణ సాధనాల ద్వారా రూ. 20,000 కోట్లు సమీకరించేందుకు యస్ బ్యాంక్ గత ఏడాది జూన్‌లో షేర్‌హోల్డర్ల ఆమోదం పొందింది.



మంచుతో
కప్పబడిన కాంచన్‌జంగ పర్వత
శిఖరాలతో అలరారుతున్న ప్రదేశం డార్జిలింగ్.
అందుకే డార్జిలింగ్‌ను 'ప్రిన్సెస్ ఆఫ్ హిల్‌స్టేషన్'
అంటారు. డార్జిలింగ్ అంటే పిడుగుల ప్రదేశమని అర్థం.
తేయాకుకు ప్రసిద్ధిగాంచిన డార్జిలింగ్ దీని ఎగుమతులలో
ప్రథమ స్థానంలో ఉంది. ఈ ప్రదేశమంతా చిన్న చిన్న
జలపాతాల హొయలతో ఎటుచూసినా కనువిందుచేసే
లోయలతో సందర్శకులను ఆకట్టుకుంటాయి.
అలాంటి ఎన్నో రమణీయ దృశ్యాలకు నెలవైన
డార్జిలింగ్ విశేషాలు మీకోసం!

మనం పర్యాటకం
గురువారం, 22 ఫిబ్రవరి 2018
www.manamnews.com


కనువిందు చేసే డార్జిలింగ్



ప్రకృతి అందాలతో బౌద్ధులకు చిరునామాగా నిలిచే డార్జిలింగ్‌లో ఎన్నో వింతలు, విశేషాలు ఉన్నాయి. పశ్చిమబంగాకు ఉత్తర భాగాన 7004 అడుగుల ఎత్తున తూర్పు హిమలయాల్లో నేపాల్, భూటాన్‌కు చేరువలో డార్జిలింగ్ ఉంది. డార్జిలింగ్ బ్రిటిష్‌కాలం నుంచే పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దబడింది. ఇక్కడి పర్వతాలపైనుంచి కొండ శిఖరాలను చూస్తుంటే ఎన్నో రమణీయ దృశ్యాలు కనిపిస్తుంటాయి. పొగమంచు, ప్రకాశవంతమైన సూర్యాస్తమయం ఆకట్టుకుంటాయి. సాల్, ఓక్ చెట్లతో సమశీతోష్ణ అడవులు, ఎత్తయిన శిఖరాలతో ప్రకృతి ప్రేమికులను ఆనంద పారవశ్యంలో తేలియాడిస్తూ, అలసట మచ్చుకైనా దరిచేరనీయవు. అంతేకాదు, సహజమైన పార్కులకు, గార్డెన్‌లకు ఇది నిలయం.

గార్డెన్స్ స్పెషల్!

ఇక్కడి టాయిడ్ బొటానికల్ గార్డెన్ హిమాలయ పర్వత వృక్షజాతులకు ప్రసిద్ధి. డార్జిలింగ్‌కు పది కిలోమీటర్ల దూరంలో ఉన్న రాక్ గార్డెన్ చూడదగ్గ ప్రదేశాలలో ఒకటి. ఇక్కడ వివిధ రకాలుగా మలిచిన రాళ్ళపై పారుతున్న జలపాతాల తీరు సందర్శకులను మంత్రముగ్ధుల్ని చేస్తుంది. కూర్చొని చూసే విధంగా అక్కడ ప్రత్యేక ఏర్పాటు చేశారు. డార్జిలింగ్‌కు 13 కిలోమీటర్ల దూరంలో గంగమయ ఉంది. ఇక్కడ వాలుగా ఉండే కొండచరియల మీద రకరకాల పుష్పాలు దర్శనమిస్తాయి. అంతేకాదు, డార్జిలింగ్ సందర్శనీయ ప్రదేశాలలో చంచల్ లేక్ ముఖ్యమైంది. అది డార్జిలింగ్ పట్టణానికి కావలసిన నీటిని సరఫరా చేస్తుంది. ఇది డార్జిలింగ్‌కు 8032 అడుగుల ఎత్తున ఉంది. ఇలాంటి ఎన్నో ప్రకృతి దృశ్యాలకు పెట్టింది పేరు డార్జిలింగ్.



హిమలయన్ మౌంటనీరింగ్ ఇనిస్టిట్యూట్

ఎవరెస్టు శిఖర పర్వతారోహణకు సంబంధించిన శిక్షణా సంస్థ డార్జిలింగ్‌లోనే ఉంది. ఇక్కడే శిఖరారోహణ మ్యూజియం కూడా ఉంది. ఇందులో పర్వతారోహకులు తీసుకెళ్లే సామాగ్రి విశేషాలను చూడవచ్చు. అలాగే పర్వతారోహణకు వచ్చే విద్యార్థులకు, ట్రైనర్‌లకు హాస్టల్ వసతి, షాపింగ్‌లు చేసేందుకు అన్ని సౌకర్యాలు ఇక్కడ కల్పించబడ్డాయి.

వన్యప్రాణులకు నెలవు

హిమలయన్ మౌంటనీరింగ్ ఇనిస్టిట్యూట్ ప్రాంగణంలోనే పద్మజానాయుడు హిమలయన్ జులాజికల్ పార్క్ ఉంది. హిమలయాలకు సంబంధించిన అరుదైన వన్యప్రాణులకు ఈ జంతు ప్రదర్శనశాల నిలయం. రెడ్‌పాండా, మంచు చిరుతలు, టిబెటన్ నక్కలతో పాటు, వలస వచ్చే అరుదైన పక్షులు ప్రకృతి ప్రేమికులను కట్టిపడేస్తాయి. అంతేకాక, కొమ్ము ఖడ్గమ




గాలు, ఏనుగులు, పులులు, మచ్చల జింకలు ఎన్నో డార్జిలింగ్‌లో కనువిందు చేస్తాయి. ఈ పార్క్‌లో సైబీరియన్ టైగర్స్ స్నో లిపర్డ్ బ్రీడింగ్ సెంటర్ ఉంది. డార్జిలింగ్‌లోని ఎత్తయిన ప్రదేశం టైగర్ హిల్. ఇది డార్జిలింగ్‌కు పదకొండు కిలోమీటర్ల దూరంలో ఉంది. మంచుతో కప్పబడిన తూర్పు హిమాలయాలలోని కాంచనగంగ పర్వత శిఖరాల మధ్య నుంచి సూర్యోదయాన్ని చూడటానికి ఉత్తమమైన చోటు ఇదే!

టాయ్ ట్రెయిన్

డార్జిలింగ్ పర్యటనలో తప్పకుండా చూడాల్సింది టారు ట్రెయిన్ ప్రయాణం. ఇది పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటుంది. 1881లో బ్రిటిష్ వారు ప్రవేశపెట్టిన టారు ట్రెయిన్ నేరోగజ్ రైల్వేలైన్ మీద నడుస్తుంది. ఇక్కడి బటాసియా లూప్‌లో వలయాకారంలో ఉండే అంచులు చూడముచ్చటగా ఉంటాయి. ఇక్కడి నుంచి చూస్తే టీ తోటలు, నీటి ప్రవాహాలు ఎంతో అద్భుతంగా కనబడతాయి. డార్జిలింగ్ భూభాగం, కాంచనగంగ తూర్పు హిమాలయ పర్వతశిఖరాలు చూపరులను ఇట్టే ఆకర్షిస్తాయి. అలాగే, ఒకచోట కూర్చొని డార్జిలింగ్ అందాలను తనివితీరా చూడటానికి రోప్‌వే అనువైనది. రోప్ వేలో నుంచి డార్జిలింగ్ లోయ ద శ్యాలు, తేయాకు తోటలు, దట్టమైన అడవులు, పర్వత ప్రవాహాలు, జలపాతాలు, మంచు శిఖరాల్లాంటివి మనస్సును కట్టిపడేస్తాయి. కిందికి వచ్చిన తర్వాత తేయాకు తోటలలో తిరుగుతుంటే ఎంతో ప్రశాంతంగా, ఆనందంగా ఉంటుంది. అంతేకాదు, ట్రెక్కింగ్ వంటి సాహసక్రీడలకు ఇది అనువైన ప్రాంతం.

నేచురల్ హిస్టరీ మ్యూజియం

డార్జిలింగ్ పట్టణం మధ్యలో ఉండే ప్రాంతాన్ని చౌరస్తా అంటారు. ఇది మనోహరమైన, చదునైన, నాలుగు రోడ్ల కూడలి. అనేకమంది సందర్శకులు, నివాసితులు మండుటెండల్లో విశ్రాంతి తీసుకోవడానికి ఈ ప్రదేశం అనువుగా ఉంటుంది. ఇక్కడ ఒక పక్క పైన్ చెట్ల మధ్యలో నుంచి అందమైన పర్వత శిఖరాల దృ శ్యం కనువిందు చేస్తుంటే, మరోపక్క బోటిక్ షాపులు అలరిస్తాయి. ప్రశాంతంగా కూర్చోవడానికి వీలుగా బెంచీలూ ఏర్పాటు చేశారు. ఇక్కడికి దగ్గరలో 1903లో ప్రారంభించబడిన బెంగాల్ నేచురల్ హిస్టరీ మ్యూజియం ఉంది. ఈ మ్యూజియంలో రకరకాల సీతాకోకచిలుకలు, పక్షులు, వాటి గూళ్లు, గుడ్లు, క్షీరదాలు, సరీస పాలు, చేపలు, కీటకాల్లాంటి రకరకాల వన్యప్రాణులను చూడవచ్చు. ఇవన్నీ సజీవంగా ఉన్నాయా అన్నట్లు ఉంటాయి. వీటిని రసాయనాలలో భద్రపరచి, ప్రదర్శనలో ఉంచారు. టిబెటిన్ శరణార్థులు ఉండటానికి వీలుగా టిబెటిన్ రెఫ్యూజీ సెంటర్ ఉంది. డార్జిలింగ్ చరిత్రకు సంబంధించిన యుద్ధస్మారకం కూడా చూడదగ్గది. అంతేగాక, డార్జిలింగ్ హస్తకళలకు ప్రసిద్ధి చెందింది. ఇక్కడ ఊలు, సిల్కు, టంగ్‌కా, కంచు, రాగి, బంగారు ఆభరణాలను సందర్శకులు కొనుక్కోవచ్చు.



జపనీస్ ఆలయం

డార్జిలింగ్ నుంచి కారులో పది నిమిషాలు ప్రయాణిస్తే ఒక అందమైన ప్రదేశానికి చేరుకుంటాం. ఇది ఎంతో ప్రశాంతంగా ఉంటుంది. అదే జలపహార్ హిల్. ఇక్కడ జపనీయుల సంప్రదాయాలకు అనుగుణంగా నిర్మించబడిన ఆలయం ఉంది. బుద్ధుని నాలుగు అవతారాలుగా



భావించే పెద్ద విగ్రహాలూ ఇక్కడికి దగ్గరలోనే ఉన్నాయి. వీటినే పీస్ పగోడా అంటారు. దివ్యమైన తేజస్సుతో విరాజిల్లే బుద్ధుని విగ్రహాలను చూడటానికి ఎంతోమంది బౌద్ధ సందర్శకులు ఇక్కడకు వస్తూ ఉంటారు. అంతేకాక, డార్జిలింగ్‌లోని కాళీమాత ఆలయం హిందువులకు, బౌద్ధులకూ సందర్శనీయ ప్రదేశంగా గుర్తింపు పొందింది. ఇక్కడే బౌద్ధుల గ్రంథాలయం కూడా ఉంది. అందుకే అంటారు డార్జిలింగ్ ప్రయాణం అంటే జీవితంలో మర్చిపోలేని ఓ మధుర అనుభూతి అని! ఇంకెందుకు ఆలస్యం మీరూ ప్రయాణానికి సిద్ధంకండి!!



క్లిక్ చేస్తే చాలు!

ట్రావెలింగ్ అనేది ఓ లైఫ్ జర్నీ. సూపర్ లొకేషన్ కంట పడిందంటే క్లిక్‌మనిపించకుండా ఉండలేం. సెల్ఫీ లేదా ఫొటో గ్యారంటీ. మీ ఫ్రెండ్స్ గ్యాంగ్‌లో కనీసం ఒక్కరైనా ఫొటోగ్రాఫర్ ఉంటారు. మీరైనా సరే! ఫొటో ఎలా తీయాలో కరెక్ట్‌గా తెలియకపోయినా, ఫ్రేమ్ ఎలా సెట్ చేయాలో, లైటింగ్‌కు తగ్గట్టు ఫొటో ఎలా తీయాలో ఐడియా ఉండే ఉంటుంది. వారిలో సత్తా ఎంతో పక్కాగా తెలియాలంటే ఈ యాప్ ఉండాల్సిందే. అదే 500పిఎక్స్. ఫోన్‌లో ఈ యాప్ డౌన్‌లోడ్ చేసుకొని, మీరు తీసిన ఫొటోలను పోస్ట్ చేస్తే చాలు. ఔత్సాహికులతో పాటు ప్రఖ్యాత ఫొటోగ్రాఫర్లు కూడా ఉంటారు. వాటిని పరిశీలించే వాటిలో కార్పొరేట్ కంపెనీలు కూడా ఓ కన్నేసి ఉంచుతాయి. మీరు తీసిన ఫొటో నచ్చిందంటే, ఉద్యోగం ఇవ్వచ్చు. సో... గెట్ లక్కీ!



ఎక్కడికెళ్లినా ఇంటి వంట!

కులూమనాలి, సిమ్లా. ఇలా ప్రపంచంలో ఏ ప్రదేశానికైనా వెళ్లే ఛాన్స్ మన చేతిలోనే ఉంటుంది. కానీ మనకు నచ్చిన ఆహారం తినే ఛాన్స్ ఉంటుందా? అంటే క్వశ్చన్ మార్క్ ఫేస్ పెట్టాల్సిందే. ఎక్కడికి వెళ్లినా అక్కడి రుచులు ఆస్వాదించాలి గానీ, నచ్చిన వంటకాలు తినే వీలుంటే ఎంత బాగుంటుంది? అని అనుకునేవాళ్లు ఎంతోమంది. అలాంటివారి కోసమే ఈ ట్రావెల్ కుక్కర్. చిన్న చిన్న వంటకాలు వండుకొని, హాయిగా తినొచ్చు. రోడ్ ట్రిప్స్, బస్ ట్రిప్స్, ట్రెక్కింగ్ చేసే వాళ్లకు ఇది బాగా ఉపయోగపడుతుంది. బ్యాగ్‌లోనే పట్టేంత చిన్న పరిమాణంలో ఉంటుంది. ముఖ్యంగా తక్కువ సంఖ్యలో వెళ్లే వారికి ఇది బాగా ఉపయోగపడుతుంది.



జాలీగా హాలిడే

హాలిడే ట్రిప్ తీపిగుర్తుగా మిగిలిపోవాలంటే ఈ టిప్స్‌ను ఫాలో అయిపోండి. నాణ్యమైన అండర్ గార్మెంట్స్‌ను ఎంచుకోండి. మీరు నమ్మినా, నమ్మకపోయినా నాణ్యమైన లోదుస్తులు హాలిడే ట్రిప్‌లో చాలా అవసరం. ఎందుకంటే చాలా దూరం వాకింగ్ చేయాల్సి వస్తుంది. సైట్ సీయింగ్ కోసం నడవాల్సి ఉంటుంది. ట్రెక్కింగ్, సయాకింగ్ వంటివి చేయాల్సి ఉంటుంది. ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ఉండాలంటే యాంటీ బ్యాక్టీరియల్ అండర్ గార్మెంట్స్‌ను ఎంచుకోండి. మందులు తీసుకెళ్లండి. ఫస్ట్ ఎయిడ్‌కిట్, నొప్పి నివారణ మాత్రలు తప్పనిసరి. దగ్గు మందు, జ్వరానికి పారాసెటమాల్ వంటి జనరల్ మందులు వెంట ఉంచుకోండి. ఇంటర్నేషనల్ ట్రిప్స్‌కు వెళుతున్నట్లయితే కూపన్స్ కోసం ప్రయత్నించండి. డబ్బు ఆదా విషయంలో కూపన్స్ బాగా ఉపకరిస్తాయి. టాబ్లెట్‌లో మీకు నచ్చిన వీడియోలు, పాటలు డౌన్‌లోడ్ చేసి పెట్టుకోండి. లాంగ్ ట్రిప్‌లో బోర్‌డమ్‌ను పోగొట్టడానికి ఇవి బాగా పనికొస్తాయి. కొంచెం ఖర్చు ఎక్కువైనా లగ్జరీకే ప్రాధాన్యం ఇవ్వండి. ఎందుకంటే ట్రిప్ మెమొరబుల్‌గా నిలిచిపోవాలంటే ఆ మాత్రం చేయక తప్పదు. ఇయర్ ప్లగ్స్‌ను బ్యాగులో ఉంచుకోండి. నాయిస్ ఎక్కువగా ఉన్నప్పుడు ఇయర్ ప్లగ్స్ బాగా ఉపయోగపడతాయి. ఇలాంటి జాగ్రత్తలు తీసుకుంటే టూర్ మెమొరబుల్‌గా చిరకాలం నిలిచిపోతుంది.



రోడ్ ట్రిప్‌కు యాప్

ముంబయి దాని చుట్టుపక్కల రోడ్ ట్రిప్పు వేయాలనుకుంటున్నారా? ఇందుకోసం ప్రత్యేకంగా ఒక యాప్ ఉంది. దాని సహాయంతో రోడ్ ట్రిప్పును సునాయాసంగా ముగించుకోవచ్చు. ఎప్పటినుంచో రోడ్ ట్రిప్పు వేయాలనుకున్న మీ సరదా కూడా తీరుతుంది. ముంబయి, పూనెలకు సంబంధించి 80 ట్రిప్ ఆప్షన్స్ ఇందులో ఉన్నాయి. గిర్ నుంచి గోకర్ణం వెళ్లడానికి సులభమైన రహదారిమార్గాల వివరాలు ఈ యాప్‌లో ఉంటాయి. ఈ యాప్‌లో ముఖ్యంగా మూడు విభాగాలు ఉంటాయి. మీరు వెళ్లాలనుకున్న ప్రాంతాల గురించి. రెండవది ఎక్కడ ఆగవచ్చు, వసతిసౌకర్యాల వివరాలు, చూడాల్సిన ప్రదేశాల వివరాలు. మూడవది బ్లాగు ద్వారా వెళ్లే ప్రాంతం సమాచారం తెలుసుకోవడం, కారును రెంటుకు తీసుకోవడం, కార్ చెకప్ సర్వీసులు వంటివి. జులైలో యాక్టివిటీ బేస్డ్ ప్యాకేజెస్‌ను కూడా కంపెనీ తీసుకురానుంది. ప్యాకేజెస్‌లో బడ్జెట్‌కనుగుణంగా కార్ రెంటల్స్, వసతి సౌకర్యాలు అందుబాటులో ఉంటాయి. మహారాష్ట్రలో చూడాల్సిన మారుమూల ప్రాంతాలు ఎన్నో ఉన్నాయి. రోడ్డు ద్వారా ప్రయాణిస్తేనే వీటిని చూడ గలిగే అవకాశం ఉంటుంది. అలాంటి ఎన్నింటినో యాప్ సహాయంతో మనం చూడగలం. రోడ్ ప్రయాణానికి సంబంధించి అన్ని రకాలుగా ఈ యాప్ సహాయపడుతుంది.

టూర్‌ని ఎంజాయ్ చేద్దాం!

వేడి నుంచి ఉపశమనం కోసం, కొత్త ప్రదేశాల సందర్శన కోసం సమయం దొరికేది ఇప్పుడే. అయితే వేసవిలో టూర్‌కు వెళుతున్నట్లయితే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. టూర్‌కు వెళ్లాక అలసట అంటూ కూర్చోకుండా యాక్టివ్‌గా ఉండటానికి ప్రయత్నించండి. సైట్ సీయింగ్, వాకింగ్, షాపింగ్, స్విమ్మింగ్... లాంటివి చేస్తూ ఉల్లాసంగా గడపండి. వేసవిలో టూర్ ప్లాన్ చేసుకుంటే డీహైడ్రేషన్‌కు గురికాకుండా చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఎప్పుడూ చెంతన వాటర్‌బాటిల్ ఉండేలా చూసుకోండి. తరచుగా జ్యూస్‌లు, లిక్విడ్స్ తీసుకోండి. ఇంటి నుంచే కొంత ఫుడ్‌ను ప్యాక్ చేసి పట్టుకెళ్లండి. ప్రొటీన్ పౌడర్, నట్స్, చియా సీడ్స్ వంటివి వెంట తీసుకెళితే మంచిది. సిటీకి దూరంగా వెళ్లాల్సి వచ్చినపుడు, ట్రెక్కింగ్‌లాంటివి చేస్తున్నప్పుడు దగ్గరలో ఎలాంటి ఆహారం దొరకకపోవచ్చు. కాబట్టి ముందే స్నాక్స్ ప్యాక్ చేసి తీసుకెళ్లండి. మీరు విడిది చేసిన ప్రదేశానికి దగ్గరలో మార్కెట్ ఉంటే సందర్శించండి. ఫ్రూట్స్ కొని పెట్టుకోండి. క్యారెట్, కీరదోస, నిమ్మకాయలు కొన్ని కొనుగోలు చేయండి. స్థానికంగా పేరుండే ఆహారం తినడానికి ప్రయత్నించకుండా మీకు నచ్చే ఆహారాన్ని మాత్రమే తీసుకోండి. ఆహారం రుచించకపోతే ఉడికించిన కోడిగుడ్లు, పండ్లు, ఓట్‌మీల్ వంటి వాటికి ప్రాధాన్యం ఇవ్వండి.



మనం స్పోర్ట్స్

గురువారం 22 ఫిబ్రవరి 2018

www.manamnews.com



చచ్చి బతికాను

ఓ ఆంగ్ల వెబ్‌సైట్ కాలమ్‌లో సెరెనా

న్యూయార్క్: గత సెప్టెంబర్‌లో తొలి బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత దాదాపు చచ్చి బతికాను. కాన్పు అయిన తర్వాత ఆమె ఎదుర్కొన్న సమస్యల గురించి గతంలోనే చెప్పింది. కానీ ఇప్పుడు మరిన్ని వివరాలను తెరపైకి తెచ్చింది. 'నా కూతురు ఒలింపియాకు జన్మనిచ్చిన తర్వాత దాదాపు నేను చచ్చిపోయాను' అని ఆ ఆర్టికల్‌లో 36 ఏళ్ల సెరెనా రాసిన తొలి వాక్యం. అత్యవసర సిజేరియన్‌తో సెరెనా బిడ్డకు జన్మనిచ్చింది. తర్వాత పల్మనరీ ఎంబాలిజంతో పాటు అనేక సమస్యల వల్ల సెరెనాకు ఒకట్రెండు శస్త్ర చికిత్సలు జరిగాయి. దీంతో ఆమె ఆరు వారాల పాటు మంచానికే పరిమితమైంది. 'అసాధారణ ప్రతిభావంతులైన ఆ డాక్టర్లకు, నర్సులకు నేను సర్వదా కృతజ్ఞురాలను. ఇటువంటి సమస్యలకు ఎలా ఎదుర్కోవాలో వాళ్లకు బాగా తెలుసు. వాళ్లు తగినంత శ్రద్ధ చేసుకోకపోయివుంటే.. నేను జీవించి ఉండేదాన్ని కాదు' అని సెరెనా చెప్పింది. సిజేరియన్ తర్వాత సెరెనా కడుపులో ఒక పెద్ద రక్తపు గడ్డ ఉన్నట్టు డాక్టర్లు కనుగొన్నారు. అవి ఆమె ఊపిరి తిత్తుల దిశగా వెళుతున్నట్టు తెలుసుకున్నారు. దీంతో ఆమెను మళ్లీ ఆపరేషన్ థియేటర్‌కు తీసుకెళ్లి మళ్లీ శస్త్ర చికిత్స చేశారు.

పారా అథ్లెట్ ఖాతూన్‌కు షరతులతో చోటు



న్యూఢిల్లీ: ఆత్మహత్య బెదిరింపులకు దిగిన భారత పారా అథ్లెట్ సకినా ఖాతూన్‌కు కామన్వెల్త్ గేమ్స్ భారత జట్టులో షరతులతో కూడిన చోటు లభించింది. దీంతో త్వరలో ఆస్ట్రేలియాలోని గోల్డ్ కోస్ట్‌లో జరగనున్న కామన్వెల్త్ గేమ్స్‌లో మహిళల లైట్ వెయిట్ పారా పవర్‌లిఫ్టింగ్‌లో ఖాతూన్ పాల్గొననుంది. ఇప్పటి వరకు కామన్వెల్త్ గేమ్స్‌లో భారత్‌కు పతకం అందించిన ఏకైక భారత పారా అథ్లెట్ సకినా ఖాతూన్. ఈమె గ్లాస్గోలో లైట్ వెయిట్ కేటగిరిలో కాంస్య పతకాన్ని గెలిచింది. అయితే కామన్వెల్త్ గేమ్స్‌కు పంపించే భారత జట్టు జాబితాలో ఈమె పేరును చేర్చలేదు. దీంతో తన పేరు చేర్చకుంటే పారాలింపిక్ కమిటీ ఆఫ్ ఇండియా (పీసీఐ) కార్యాలయం ముందే ఆత్మహత్య చేసుకుంటానని ఖాతూన్ బెదిరించింది. దీనిపై స్పందించిన పీసీఐ ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ (ఐఓఏ), కామన్వెల్త్ గేమ్స్ ఫెడరేషన్ (సీజీఎఫ్), ఇంటర్నేషనల్ పారాలింపిక్ కమిటీ (ఐపీసీ)లకు లేఖ రాస్తూ సకినా ఖాతూన్ పేరును ఎలాగైనా భారత జట్టులో చేర్చాలని లేఖ రాసింది. పీసీఐ కోరికను మన్నించిన సీజీఎఫ్, ఐపీసీలు షరతులతో కూడిన చోటును కల్పించాయి. గుర్తింపు కొందిన వైద్య సిబ్బందితో ఖాతూన్‌ను వైద్య పరీక్షలు నిర్వహించి నివేదికను ఐఓఏకు అందజేస్తామని పీసీఐ సీఈఓ అన్నారు. అంతేకాకుండా తన విజ్ఞప్తిని మన్నించిన సీజీఎఫ్, ఐపీసీలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



వర్షం కారణంగా ఇండియా, సౌతాఫ్రికా మహిళల నాలుగో టీ20 రద్దు

సిరీస్ ఆశలు వాయిదా

శనివారం చివరి మ్యాచ్

ఐదు మ్యాచ్‌ల సిరీస్



సెంచూరియన్: టీ20 సిరీస్‌ను కూడా కైవసం చేసుకోవాలన్న భారత మహిళల జట్టు ఆశలు వాయిదా పడ్డాయి. బుధవారం ఇక్కడ జరిగాల్సిన నాలుగో టీ20 మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత జట్టు 2-1 ఆధిక్యంతో కొనసాగుతోంది. వన్డే సిరీస్‌ను కైవసం చేసుకున్న టీమిండియా టీ20 సిరీస్‌ను కూడా సొంతం చేసుకుని చరిత్ర సృష్టించాలని బరిలోకి దిగింది. కానీ భారత మహిళల ఆశలను వరుణుడు అడ్డుకున్నాడు. టాస్ గెలిచిన భారత జట్టు సౌతాఫ్రికాను బ్యాటింగ్ చేయమని కోరింది. దీంతో తొలుగ బ్యాటింగ్‌కు దిగిన సౌతాఫ్రికా మహిళల జట్టు 15.3 ఓవర్లలో 130 పరుగుల వద్ద ఉన్నప్పుడు భారీ వర్షం పడింది. దాదాపు రెండు గంటలు వేచి చూసిన అనంతరం అంపైర్లు మ్యాచ్ రద్దు చేసినట్టు ప్రకటించారు. చివరి ఐదో టీ20 మ్యాచ్ కేప్‌టౌన్‌లో శనివారం జరుగుతుంది. చివరి మ్యాచ్‌లో గెలిస్తే సింగిల్ సౌతాఫ్రికా టూర్‌లో రెండు సిరీస్‌లు గెలిచిన ఘనత హర్మన్‌ప్రీత్ కౌర్ సేనకు దక్కుతుంది. ఆస్ట్రేలియాలోనూ టీ20 సిరీస్ గెలిచిన భారత మహిళల జట్టు ఈ డబుల్ సిరీస్ విజయం రెట్టింపు బలాన్నిస్తుంది. అంతేకాకుండా ఈ సిరీస్ విజయం చరిత్ర పుటల్లో నిలిచిపోతుంది. వర్షం ఆటంకం కలిగించినప్పటికీ ఓవర్లు తగ్గించయినా మ్యాచ్‌ను నిర్వహిస్తారని అందరూ అనుకున్నారు. కానీ తగ్గినట్టే తగ్గి మళ్లీ సన్నని చినుకులు పడటంతో భారత మహిళల చేజింగ్‌కు అవకాశమే లేకుండా పోయింది.

15.3 ఓవర్ల ఆటలో సౌతాఫ్రికా ఓపెనర్లు లిజెల్లీ లీ (58 నాటౌట్), డేన్ వాన్ నీకెర్క్ (55) అర్ధ సెంచరీలు సాధించారు. ఆఫ్ స్పిన్నర్ దీప్తి శర్మ రెండు వికెట్లు తీసుకోగా.. లెగ్ స్పిన్నర్ పూనమ్ యదవ్ ఒక వికెట్ పడగొట్టింది. ఈ మ్యాచ్ రద్దయినప్పటికీ ఇంకా సిరీస్ భారత్ చేతిలోనే ఉంది. ఎందుకంటే ఐదు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో భారత జట్టు ఇప్పటికే 2-1తో ఆధిక్యంలో ఉంది. చివరి మ్యాచ్ కూడా రద్దయితే సిరీస్ భారత జట్టుకే దక్కుతుంది. ఒకవేళ చివరి మ్యాచ్‌లో ఓడితే 2-2తో సిరీస్ సమమవుతుంది. వన్డే సిరీస్‌ను 2-1తో కైవసం చేసుకున్న భారత మహిళల జట్టు వరుసగా మూడు మ్యాచ్‌లు గెలిచి ఆరంభంలోనే టీ20 సిరీస్‌ను కైవసం చేసుకోవాలని భావించింది. తొలి మ్యాచ్‌లో ఏడు వికెట్లతో, రెండో మ్యాచ్‌లో తొమ్మిది వికెట్లతో భారత జట్టు గెలిచిన సంగతి తెలిసిందే. కానీ జొహాన్నెస్‌బర్గ్‌లో జరిగిన మూడో టీ20లో భారత జట్టు అనూహ్యంగా 5 వికెట్లతో ఓటమిపాలైంది. దీంతో సౌతాఫ్రికా జట్టు సిరీస్ ఆశలు సజీవంగా నిలిచాయి.

సౌతాఫ్రికాలో చివరి రోజులను...

ఎంజాయ్ చేస్తున్న కోహ్లీ సేన



సెంచూరియన్: సౌతాఫ్రికా పర్యటన ముగింపు దశకు చేరుకోవడంతో కోహ్లీ సేన ఎవరికి తోచిన విధంగా వాళ్లు ఎంజాయ్ చేస్తున్నారు. ఓపెనర్ శిఖర్ ధావన్ తన కుటుంబాన్ని జ్ఞాపకం చేసుకుంటూ ట్వీటలో మునిగిపోయాడు. రోహిత్ శర్మ, యజ్వేంద్ర చాహల్, దినేష్ కార్తీక్, బ్యాటింగ్ కోచ్ సంజయ్ బంగర్ గోల్ఫ్ కోర్సుకు వెళ్లి అక్కడ ఎంజాయ్ చేశారు. తనకిష్టమైన క్రికెటర్‌ను చూసేందుకు స్కూల్‌కు డుమ్మా కొట్టిన చిన్నారి అభిమానిని విరాట్ కోహ్లీ కలిశాడు. ఇలా సౌతాఫ్రికా పర్యటన చివరి రోజులను టీమిండియా క్రికెటర్లు ఆస్వాదిస్తున్నారు. ఈ సుదీర్ఘ పర్యటనను భారత క్రికెటర్లు అత్యున్నతంగా ముగించాలని భావిస్తున్నారు. టెస్టు సిరీస్‌లో రెండు ఓటములను చవిచూసిన టీమిండియా క్రికెటర్లు ప్లాన్-ఎను బయటికి తీసి వన్డే సిరీస్‌లో వరుసగా గెలుస్తూ వస్తోంది. దీంతో టీమిండియా గ్రాఫ్ పైపైకి వెళుతోంది. డిసెంబర్ నెలాఖరులో సౌతాఫ్రికాకు వచ్చిన టీమిండియా ఈ నెలాఖరులో తిరిగి భారత్‌కు చేరుకుంటుంది. 'కుటుంబానికి దూరంగా చాలా రోజులు గడిపినప్పుడు మాత్రమే వారికి దూరమయ్యామన్న ఫీలింగ్ కలుగుతుంది. నిజంగా నేను నా పిల్లలను మిస్సయ్యాను. వారితో ఆడుకోవడం, వారికి కావలసిన ఆహారాన్ని వండి పెట్టడం, వారితో కలిసి ఉండటం మిస్సయ్యాను. అంతేకాకుండా నన్ను పిచ్చిగా ప్రేమించే నా భార్యను మిస్సయ్యాను. నేను స్వదేశం చేరుకున్నప్పుడు ఎక్కువ సమయం వారితోనే గడపాలనుకుంటున్నాను' అని ధావన్ మంగళవారం రాత్రి ట్విట్ చేశాడు. ఇక రోహిత్, చాహల్‌లకు ఈ పర్యటన కలకాలం గుర్తుండి పోతుంది. ఆరంభంలో ఫామ్‌లో లేకపోయినప్పటికీ పోర్ట్ ఎలిజబెత్‌లో జరిగిన కీలకమైన ఐదో వన్డేలో సెంచరీ చేసి టీమిండియా సిరీస్‌ను కట్టబెట్టాడు. సౌతాఫ్రికా పర్యటనలో చాహల్ వన్డేల్లో 16 వికెట్లు తీసుకోవడం విశేషం. వీరిద్దరితో పాటు రిజర్వ్ వికెట్‌కీపర్/బ్యాట్స్‌మన్ దినేష్ కార్తీక్, బ్యాటింగ్ కోచ్ సంజయ్ బంగార్ కూడా మానసిక ఉల్లాసం కోసం గోల్ఫ్ కోర్స్‌కు వెళ్లారు. ఇక కోహ్లీ విషయానికొస్తే.. సౌతాఫ్రికా పర్యటన కెప్టెన్‌కు చాలా ప్రత్యేకమైంది. మూడు టెస్టుల్లో సెంచరీ చేసిన ఏకైక బ్యాట్స్‌మన్ కోహ్లీ. అంతేకాకుండా ర్యాంకింగ్ బ్యాటింగ్ పాయింట్స్‌లో ఒకేసారి వన్డే, టెస్టుల్లో 909 పాయింట్లు సాధించిన ఏకైక బ్యాట్స్‌మన్‌గా నిలిచాడు. సౌతాఫ్రికాలో ఇంతటి బిజీ షెడ్యూల్‌లోనూ ఒక చిన్నారి అభిమానిని కోహ్లీ కలిశాడు. కోహ్లీని కలిసేందుకు ఆ చిన్నారి స్కూల్‌కు బంక్ కొట్టాడు. దీంతో ఆ చిన్నారితో కలిసి కోహ్లీ ఫొటోకు ఫోజులిచ్చాడు.

శ్రీలంక టీ20 ముక్కోణపు సిరీస్‌కు...

భువీ, బుమ్రాలకు విశ్రాంతి



న్యూఢిల్లీ శ్రీలంకలో జరగనున్న టీ20 ముక్కోణపు సిరీస్‌కు ఈ వారాంతంలో టీమిండియాను ఎంపిక చేయనున్నారు. ఈ టోర్నీలో వచ్చే నెల 6వ తేదీ నుంచి 18వ తేదీ వరకు జరగనుంది. అయితే చీఫ్ సెలెక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్ నేతృత్వంలో జరగనున్న సెలెక్షన్ కమిటీ సమావేశంలో పేస్ బౌలర్లు భువనేశ్వర్ కుమార్, జస్‌ప్రీత్ బుమ్రాలపై పని ఒత్తిడి గురించి చర్చించనున్నారు. సౌతాఫ్రికాలో జరిగిన అన్ని మ్యాచ్‌ల్లో కెప్టెన్ కోహ్లీ కూడా ఆడాడు. కానీ కోహ్లీ పరిస్థితి వేరు. ఎందుకంటే తనకు తానుగా విశ్రాంతి కావాలని కోరితే తప్ప సెలెక్షన్ కమిటీ విశ్రాంతి ఇవ్వదు. 'విరాట్ కోహ్లీ కోరితే విశ్రాంతి తీసుకోవచ్చు. విరాట్ విషయంలో తనకు తానే నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. అయితే ఈ సీజన్‌లో ఇది చివరి పర్యటన కాబట్టి టీ20 సిరీస్‌లో పాల్గొనాలని అతను భావించొచ్చు. ఈ సిరీస్ ముగిసిన తర్వాత కోహ్లీకి ఐపీఎల్‌కు ముందు 15 రోజుల విశ్రాంతి దొరుకుతుంది' అని పేరు చెప్పేందుకు ఇష్టపడని బీసీసీఐ అధికారి ఒకరు చెప్పారు. దీనిపై స్పందించడానికి సెలెక్షన్ కమిటీ చైర్మన్ ప్రసాద్ నిరాకరించారు. కానీ ఫాస్ట్ బౌలింగ్ కాంబినేషన్‌పై సెలెక్షన్స్ సమావేశంలో తప్పక చర్చకు రానుంది. ఐపీఎల్‌తో ప్రారంభమయ్యే సుదీర్ఘ సీజన్‌కు భువనేశ్వర్, బుమ్రాలకు తప్పక విశ్రాంతినిచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. ఒకవేళ వీరికి విశ్రాంతినిస్తే శార్దూల్ ఠాకూర్, జైదేవ్ ఉనద్కట్‌లకు జట్టులో చోటు దక్కే అవకాశముంది.





లీ చాంగ్‌ను సంప్రదించిన

మ్యాచ్ ఫిక్సర్

తిరస్కరించానన్న మలేసియా షట్లర్

కౌలాలంపూర్: ఓసారి తనను మ్యాచ్ ఫిక్సర్ సంప్రదించాడని మలేసియా స్టార్ షట్లర్ లీ చాంగ్ వీ అన్నాడు. అయితే తమ దేశానికి చెందిన ఇద్దరు షట్లర్లపై మ్యాచ్ ఫిక్సింగ్ దర్యాప్తు జరగడం సిగ్గు చేటని చెప్పాడు. 'డబ్బు నాకు ముఖ్యం కాదు. దేశ ప్రతిష్టకే తొలి ప్రాధాన్యత ఇస్తాను. దాన్ని ఉన్నత స్థానంలో ఉంచడం నా బాధ్యత' అని లీ చాంగ్ పేర్కొన్నాడు. మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలపై మలేసియాకు చెందిన ఇద్దరు షట్లర్లను బ్యాడ్మింటన్ వరల్డ్ ఫెడరేషన్ (బీడబ్ల్యూఎఫ్) విచారిస్తోందన్న వార్త నేపథ్యంలో లీ చాంగ్ పూర్వపు ఘటనలను గుర్తు చేసుకున్నాడు. అనుమానాస్పద షట్లర్లిద్దరూ ఈ నెలాఖరులో బీడబ్ల్యూఎఫ్ ముందు హాజరవుతారు. అయితే ఈ ఆరోపణలు మలేసియా పేరు ప్రతిష్టను దిగజారుస్తుందని మూడుసార్లు ఒలింపిక్ రజత పతకం గెలిచిన లీ అన్నాడు. ఇద్దరు షట్లర్లు ఎదుర్కొంటున్న ఆరోపణలపై ఒక టాప్ ప్లేయర్‌గా తనకు అసహనంగా ఉందని.. సిగ్గు పడుతున్నానని లీ చాంగ్ చెప్పాడు. ఈ కేసు ఎంత త్వరగా ముగిస్తే అంత మంచిదన్నాడు.

మెగ్ లాన్నింగ్‌కు మళ్లీ చోటు

భారత్ పర్యటనకు ఆస్ట్రేలియా మహిళల జట్లు ఖరారు



సిడ్నీ: మెగ్ లాన్నింగ్స్‌కు మళ్లీ ఆస్ట్రేలియా జట్టులో చోటు దక్కింది. మార్చిలో భారత్ పర్యటనకు రానున్న ఆస్ట్రేలియా మహిళల వన్డే, టీ20 జట్లను ఎంపిక చేశారు. లాన్నింగ్ కెప్టెన్‌గా వ్యవహరించనుంది. అలెక్స్ బ్లాకవెల్ రిటైర్మెంట్ తీసుకోవడంతో రేచెల్ హేన్స్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తుంది. ఐసీసీ మహిళల వరల్డ్ కప్ తర్వాత లాన్నింగ్ క్రికెట్‌కు దూరమైంది. భుజానికి శస్త్ర చికిత్స చేసుకోవడంతో ఆమె 5 నెలలు విశ్రాంతి తీసుకోవాల్సి వచ్చింది. అరంగేట్ర క్రికెటర్లు సోఫీ మొలినెక్స్, నికోల కారేలకు కూడా వన్డే, టీ20 జట్లలో చోటు లభించింది. అయితే ఆస్ట్రేలియాకు ఒకే ఒక వన్డే మ్యాచ్ ఆడిన బెలిండా వకరెవకు కూడా వన్డే జట్టులో చోటు సంపాదించింది. కానీ ఆల్ రౌండర్ టహ్లియా మెక్‌గ్రాత్ వెన్ను నొప్పి కారణంగా భారత్ పర్యటనకు దూరమైంది. భారత్ పర్యటనకు మెక్ లాన్నింగ్స్ అందుబాటులోకి రావడంపై ఆస్ట్రేలియా జాతీయ సెలెక్టర్ షాన్ ఫ్లెగ్లర్ హర్షం వ్యక్తం చేశారు. 'లాన్నింగ్స్ పునరావాసం మెరుగ్గా సాగుతోంది. అయితే తొలి మ్యాచ్‌కు ముందు కొన్ని వారాలు ఆమె బ్యాటింగ్ ప్రాక్టీస్ చేస్తుంది. సరైన సమయానికి ఆమె పూర్తిగా కోలుకుని బరిలోకి దిగుతుందని పూర్తి నమ్మకముంది. మెగ్ జట్టుకు నేతృత్వం వహిస్తుంది. మహిళల యాషెస్ సిరీస్‌లో తాత్కాలిక కెప్టెన్‌గా అద్భుత ప్రతిభ కనబరిచిన రేచెల్ భారత్ పర్యటనలో వైస్ కెప్టెన్‌గా వ్యవహరించడం మా అదృష్టంగా భావిస్తున్నాను' అని ఫ్లెగ్లర్ అన్నారు. టహ్లియా గాయంపై ఆయన స్పందిస్తూ.. 'సెలెక్షన్‌కు అందుబాటులో లేకపోవడం నిజంగా టహ్లియా దురదృష్టం. యాషెస్‌లో ఆమె అద్భుతమైన నైపుణ్యం ప్రదర్శించింది. దేశవాళీ క్రికెట్‌పైనే ఎక్కువగా దృష్టి పెట్టిన ఆమె ఇక వరల్డ్ టీ20కి సిద్ధపడాలి' అని అన్నారు. చాలా రోజుల తర్వాత మళ్లీ జట్టులోకి వచ్చిన మెగ్ లాన్నింగ్ కూడా ఎప్పుడెప్పుడా అని భారత్‌తో సిరీస్ కోసం ఎదురు చూస్తోంది. 'సుదీర్ఘ ఏడు నెలలు నేను క్రికెట్‌కు దూరమయ్యాను. కానీ పూర్తిగా కోలుకునేందుకు ఎంతో శ్రమించాను. అంతర్జాతీయ క్రికెట్‌కు నేను పూర్తిగా సిద్ధంగా ఉన్నానన్న విజయంలో ఎటువంటి సందేహమూ లేదు. మ్యాచ్‌లకు అనుగుణంగా శరీరాన్ని మలచుకోగలనని ఆశిస్తున్నాను. ఫీల్డింగ్‌లో వంద శాతం ప్రతిభ కనబరచలేకపోవచ్చు. కానీ బ్యాటింగ్‌తో జట్టుకు కావాల్సిన సహకారం అందిస్తాను. ఇందులో ఎటువంటి సమస్యలూ లేవు' అని లాన్నింగ్ పేర్కొంది. మార్చి 12న వడోదరలో జరిగిన తొలి వన్డేతో ఇండియా, ఆస్ట్రేలియా సిరీస్ ప్రారంభమవుతుంది.

ఆస్ట్రేలియా వన్డే జట్టు: మెగ్ లాన్నింగ్ (కెప్టెన్) రేచెల్ హేన్స్ (వైస్ కెప్టెన్), నికోల్ బోల్టన్, నికోల కారే, యాష్లీ గార్డ్‌నర్, అలిస్సా హీలీ, జెస్ జొనాస్సెన్, సోఫీ మొలినెక్స్, బెత్ మూనీ, ఎల్లిసె పెర్రీ, మెగన్ స్కట్, బెలిండా వకరెవ, ఎలైస్ విల్లాని, అమండా జేడ్ వెల్లింగ్టన్.

ఆస్ట్రేలియా టీ20 జట్టు: మెగ్ లాన్నింగ్ (కెప్టెన్) రేచెల్ హేన్స్ (వైస్ కెప్టెన్), యాష్లీ గార్డ్‌నర్, అలిస్సా హీలీ, జెస్ జొనాస్సెన్, డెలిస్సా కిమ్మిన్స్, సోఫీ మొలినెక్స్, బెత్ మూనీ, ఎలైస్ పెర్రీ, మెగన్ స్కట్, నయోమి స్టాలెన్‌బర్గ్, ఎలైస్ విల్లాని, అమండా జేడ్ వెల్లింగ్టన్.

క్వార్టర్స్‌లో హైదరాబాద్ ఓటమి

సెమీస్‌కు కర్ణాటక జట్టు ● సెంచరీలతో అదరగొట్టిన మయాంక్ అగర్వాల్, రవికుమార్ సమర్థ్ ● విజయ్ హజారే ట్రోఫీ



మయాంక్ అగర్వాల్ (140)

న్యూఢిల్లీ: విజయ్ హజారే ట్రోఫీ వన్డే టోర్నీలో హైదరాబాద్ జట్టు క్వార్టర్ ఫైనల్లో ఓటమిపాలై ఇంటి ముఖం పట్టింది. బుధవారమిక్కడ జరిగిన తొలి క్వార్టర్ మ్యాచ్‌లో హైదరాబాద్‌పై కర్ణాటక జట్టు 103 పరుగులతో గెలిచింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన కర్ణాటక జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 347 పరుగులు చేయగా.. తర్వాత హైదరాబాద్ జట్టు 42.5 ఓవర్లలో 244 పరుగులకు ఆలౌటైంది. కర్ణాటక బ్యాట్స్‌మెన్ మయాంక్ అగర్వాల్, రవికుమార్ సమర్థ్ సెంచరీలతో జట్టుకు భారీ స్కోరు అందించారు. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన హైదరాబాద్ జట్టు ఆరంభంలోనే తొలి వికెట్ కోల్పోయింది. మూడో ఓవర్లో రెండో ఓపెనర్ అక్షత్ రెడ్డి అవుటయ్యాడు. తర్వాత రవితేజ వచ్చాడు. కానీ అప్పటి వరకు నిలకడగా ఆడుతున్న తొలి ఓపెనర్ రోహిత్ రాయుడు 16వ ఓవర్లో అవుటయ్యాడు. దీంతో 90 పరుగులకే హైదరాబాద్ జట్టు ఓపెనర్లను కోల్పోయింది. అయితే తర్వాత వచ్చిన సందీప్.. రవితేజతో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశాడు. వీరిద్దరూ కలిసి మూడో వికెట్‌కు 98 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని అందించారు. కానీ ఆరంభం నుంచి దూకుడుగా ఆడిన రవితేజ అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్న కాసేపటికే వెనుదిరిగాడు. తర్వాత అంబటి రాయుడు బ్యాటింగ్‌కు దిగాడు. తర్వాత అర్ధ సెంచరీకి దగ్గరగా వచ్చిన సందీప్ 35వ ఓవర్లో అవుటయ్యాడు. దీంతో జట్టును గెలిపించే బాధ్యత అంబటి రాయుడుపై పడింది. త్యాగరాజన్‌తో కలిసి జట్టును ఒడ్డుకు చేర్చే ప్రయత్నం చేశాడు రాయుడు. కానీ అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్న అంబటి రాయుడు 37వ ఓవర్లో గోపాల్ వేసిన ఐదో బంతికి అవుటయ్యాడు. దూకుడు ఆటతో త్యాగరాజన్ ఎక్కువ సేపు క్రీజులో నిలవలేకపోయాడు. ఆ తర్వాత వచ్చిన వాళ్లంతా సింగిల్ డిజిట్ స్కోరుకే పరిమితమయ్యారు. అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కర్ణాటక జట్టు కూడా ఆరంభంలోనే తొలి వికెట్ కోల్పోయింది. నాలుగో ఓవర్లో మహ్మద్ సిరాజ్ వేసిన నాలుగో బంతికి అవుటయ్యాడు. దీంతో 29 పరుగులకే కర్ణాటక జట్టు తొలి వికెట్ కోల్పోయింది. అయితే తర్వాత వచ్చిన రవికుమార్ సమర్థ్ తొలి ఓపెనర్ మయాంక్ అగర్వాల్‌తో కలిసి జట్టును చక్కదిద్దాడు. వీరిద్దరూ రెండో వికెట్‌కు 242 పరుగుల భారీ భాగస్వామ్యంతో జట్టుకు భారీ స్కోరును అందించారు. అయితే 39వ ఓవర్లో వీరి భాగస్వామ్యానికి తెరపడింది. సెంచరీ పూర్తి చేసుకున్న అగర్వాల్ (111 బంతుల్లో 12 ఫోర్లు, 7 సిక్సర్లతో 140 పరుగులు) రవితేజ వేసిన బంతికి భారీ షాట్ కొట్టబోయి లాంగ్ ఆన్‌లో ఉన్న ఫీల్డర్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. తర్వాత దేశ్‌పాండే వచ్చాడు. కానీ 44వ ఓవర్లో సమర్థ్ కూడా అవుటయ్యాడు. సమర్థ్ 124 బంతుల్లో 13 ఫోర్లతో 125 పరుగులు చేశాడు. తర్వాత దేశ్‌పాండే కూడా అవుటయ్యాడు. బిన్నీ తక్కువ పరుగులకే వెనుదిరిగగా.. కృష్ణప్ప గౌతమ్ డకౌటయ్యాడు. చిదంబరం గౌతమ్ 20 పరుగుల చేసి పెవిలియన్ చేరుకున్నాడు. తర్వాత అరవింద్, ప్రదీప్ తక్కువ పరుగులకే అవుటయ్యారు. గోపాల్ నాటౌట్‌గా నిలవడంతో కర్ణాటక ఇన్నింగ్స్ ముగిసింది.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam publications private limited, Printed at JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, Survey No:127, Plot No:12, Mallapur Village, Nacharam, Medchal District.Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade,4th&5th Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-46519999. E-mail Id: editor@manamnews.com.